ప్రభాత
వెలుగు
25.01.2019
www.v6velugu.com
శుక్రవారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 339 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL



దూసుకెళ్లిన గెలుపు గుర్రం

పీఎస్‌ఎల్వీ సీ44 ప్రయోగం సక్సెస్

ఇస్రో ఖాతాలో మరో విజయం

కక్ష్యలోకి మైక్రోశాట్ ఆర్, కలాం శాట్

శాస్త్రవేత్తలకు రాష్ట్రపతి, ప్రధాని అభినందనలు

02

సర్పంచ్ పదవులకు రూ. 3 వేల కోట్లకుపైగా ఖర్చు

ఒక్కో అభ్యర్థి వ్యయం రూ. 5 లక్షల నుంచి 10 లక్షలు

ఆదాయం ఉన్న పంచాయతీల్లో కోటికి పైగానే..!

కొన్నిచోట్ల ఓటుకు రూ. 5 వేల నుంచి 15 వేలు

అదనంగా మందు, బిర్యానీ, వెండి నాణేలు

కుల సంఘాల వారీగా స్పెషల్ ప్యాకేజీలు

పైసా మే పవర్

పంచాయతీ పోరులో నోట్ల కట్టలు



వెలుగు నెట్‌వర్క్:

అది నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లోని ఓ గ్రామ పంచాయతీ. సర్పంచ్ పోస్టుకు పదుల సంఖ్యలో పోటీ. ఏకగ్రీవమే ముద్దని జనం పట్టుబట్టారు. అభ్యర్థులు ఎక్కువవడంతో వాళ్లంతా అర్రాస్‌కు జై కొట్టారు. వేలంపాట మొదలైంది.. లక్ష, 10 లక్షలు, 20 లక్షలు.. ఇలా పాట సాగిపోతూనే ఉంది. ఓ బడా లీడర్.. 63 లక్షల 30 వేలు అని చెయ్యెత్తాడు. ఒకటోసారి, రెండోసారి, మూడోసారి.. ఎవరూ ముందుకు రాలేదు. ఆ మొత్తానికి అర్రాస్ ఓకే చెప్పేసింది. ఆ బడా లీడర్ సర్పంచ్ అయ్యాడు. వచ్చిన సొమ్మునంతా గ్రామాభివృద్ధికి ఖర్చు చేయాలని జనం నిర్ణయించుకున్నారు. అయితే, ఆ పైసలు ఎవరి దగ్గర దాచాలన్న దానిపై ఒక్కొక్కరూ ఒక్కో రకంగా మాట్లాడుకున్నారు. చివరికి ఊరిలోని మొత్తం 2,050 మంది ఓటర్లకు తలా రూ. 3వేలు చొప్పున పంచుకోవాలని డిసైడ్ చేసుకున్నారు. పంచాయతీ ఎన్నికలు ఎంత ఖర్చుతో కూడుకున్నవో చెప్పడానికి ఇది ఓ చిన్న ఉదాహరణ మాత్రమే. రాష్ట్రంలో మొత్తం 12,732 గ్రామ పంచాయతీలకు

మిగతా 4లో

రెండో 'పంచాయతీ' నేడే

3,342 గ్రామాల్లో పోలింగ్.. సాయంత్రానికి ఫలితాలు

బరిలో 10,668 మంది సర్పంచ్ అభ్యర్థులు

మూడోదశలో 573 సర్పంచ్‌లు ఏకగ్రీవం

04



జనరల్

మే 20న లాసెట్, 31న ఎడ్‌సెట్

లాసెట్ మే 20కి.. పీజీఈసెట్ మే 28–31 వరకు.. ఎడ్‌సెట్ మే 31కి మార్చిన విద్యామండలి.

02



దేశం - విదేశం

వెనెజులాలో రెండు సర్కార్లు!

ప్రెసిడెంట్ మదురో ఎన్నిక చెల్లదన్న నేషనల్ అసెంబ్లీ.. తాత్కాలిక అధ్యక్షుడిగా గుయిడో ప్రమాణం.

05



ప్లే

పాండ్యా, రాహుల్‌కు రిలీఫ్

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పాండ్యా, రాహుల్‌పై సస్పెన్షన్ ఎత్తేసిన బీసీసీఐ.

11



బిజినెస్

నగదు పంపితే వీర బాదుడే

బ్యాంకింగ్ కరెస్పాండెంట్ల ద్వారా పంపించే నగదుపై 18% జీఎస్టీ వేయాలని బ్యాంకుల నిర్ణయం.

10



ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో వేదమంత్రాల మధ్య సీఎం కేసీఆర్ దంపతులు నాలుగో రోజు గురువారం సహస్ర చండీయాగంలో ప్రత్యేక పూజలు చేశారు. హోమం, పూర్ణాహుతితో శుక్రవారం యాగం ముగుస్తుంది.

చందాకొచ్చర్‌పై క్రిమినల్ కేసు



ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో చందాకొచ్చర్ మెడకు వీడియోకాన్ రుణ వివాద కేసు మరింత బిగుసుకుంటోంది. చందాకొచ్చర్‌తోపాటు ఆమె భర్త దీపక్ కొచ్చర్‌పై సీబీఐ గురువారం క్రిమినల్ కేసు రిజిస్టర్ చేసింది. వీడియోకాన్ గ్రూప్ ఎండీ వేణుగోపాల్ ధూత్‌పై కూడా కేసు నమోదు చేసింది.

10

బీజేపీకి షాక్

కేంద్రంలో హంగ్!

237 సీట్లకే పరిమితంకానున్న ఎన్డీయే

పుంజుకోనున్న యూపీఏ.. 166 సీట్లు గెలిచే చాన్స్

ఇండియా టుడే, కార్వీ సర్వేలో వెల్లడి

ఎన్డీయే 103 సీట్లు కోల్పోతుందన్న రిపబ్లిక్ టీవీ–సీ ఓటర్ సర్వే

యూపీఏకు 167 రావొచ్చని అంచనా

చక్రం తిప్పేవి ప్రాంతీయ పార్టీలే

తెలంగాణలో టీఆర్ఎస్, ఏపీలో వైఎస్సార్సీపీ హవా


03

లోక్ సభ ఎన్నికల్లో బ్యాలెట్ పేపరు వాడం

ఈవీఎంలు ఫుట్‌బాల్స్ కావు: చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సునీల్ అరోరా

న్యూఢిల్లీ:

వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం) నే ఉపయోగిస్తామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) సునీల్ అరోరా స్పష్టం చేశారు. ఈవీఎంల నుంచి బ్యాలెట్ పేపర్ల యుగానికి వెళ్లేది లేదన్నారు. 2014 లోక్ సభ ఎన్నికల్లో ఈవీఎంల హ్యాకింగ్ జరిగిందంటూ తాజాగా ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అనేక రాజకీయ పార్టీలు బ్యాలెట్ పేపర్ల విధానాన్నే మళ్లీ ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో గురువారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన సీఈసీ ఈవీఎంల వాడకంపై క్లారిటీ ఇచ్చారు. "రాజకీయ పార్టీలు తరచూ తమ అభిప్రాయాలను మార్చుకోవడానికి ఈవీఎంలు ఫుట్ బాల్ కాదు. ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించడానికి వీవీప్యాట్ యంత్రాలను కూడా తీసుకొచ్చాం" అని ఆయన అన్నారు. దేశంలో 20 ఏళ్లుగా ఈవీఎంలు ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ఇన్నేళ్లలో ఎక్కడా ఈవీఎంల పనితీరుపై ఫిర్యాదులు రాలేదన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో ఓడితే ఆ నెపం ఈవీఎంల మీద వేస్తున్నారని ఆరోపించారు. ఈవీఎంలపై ఎలాంటి వివాదాలనైనా ఎదుర్కోవడానికైనా ఈసీ సిద్ధంగా ఉందన్నారు.



సీబీఐ డైరెక్టర్ ఎంపిక మళ్లీ వాయిదా

సీబీఐ డైరెక్టర్ ఎంపిక మరోసారి వాయిదా పడింది. ప్రధాని మోడీ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ గురువారం సమావేశమైనా.. ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. డైరెక్టర్ పోస్టు కోసం దాదాపు 80 పేర్లు పరిశీలించినట్టు సమాచారం. వచ్చే వారం కమిటీ మరోసారి భేటీ కానుంది.

02

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
77.00	77.00	77.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
78.00	77.00	76.00

పేదల కోటా రిజర్వేషన్లు
1 నుంచి కేంద్ర సర్వీసుల్లో అమలు
సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు

న్యూఢిల్లీ: పెద్ద కులాల్లోని పేదల (ఈడబ్ల్యూఎస్) కోసం తీసుకువచ్చిన 10 శాతం రిజర్వేషన్లు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, సర్వీసుల్లో అమలవుతాయి. కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈడబ్ల్యూఎస్ కోటా అమలు కు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల బిల్లును ఈనెల 9న పార్లమెంటు ఆమోదించింది. తర్వాత బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించడంతో చట్టంగా మారింది. కేంద్రంలోని సివిల్ పోస్టులు, సర్వీసులు, విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఈ ఆర్డర్ పేర్కొంది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ల కిందికి రాని, కుటుంబ ఏడాది ఆదాయం రూ.8 లక్షలలోపు ఉన్నవారిని ఈడబ్ల్యూఎస్ లబ్ధిదారులుగా గుర్తిస్తారు.

ఈడబ్ల్యూఎస్ అమలుకు గుజరాత్ మెలిక

పేదల కోటా రిజర్వేషన్ల అమలుకు గుజరాత్ ప్రభుత్వం మెలిక పెట్టింది. 1978 తర్వాత గుజరాత్ కు వలస వచ్చిన వారు పేదల కోటా రిజర్వేషన్లకు అర్హులు కారని విజయ్ రూపానీ సర్కార్ స్పష్టం చేసింది. భూమిపుత్రులైన గుజరాతీయుల ప్రయోజనాలు కాపాడటానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేసిన తొలి రాష్ట్రంగా పేరు తెచ్చుకున్న గుజరాత్, రిజర్వేషన్ల అమలు కు 1978 ఏడాదిని ప్రాతిపదికగా తీసుకోవడాన్ని ప్రతిపక్షాలు దుయ్యబట్టాయి. 1978 తర్వాత గుజరాత్ వచ్చిన మిగతా రాష్ట్రాల ప్రజలు కూడా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా గుజరాత్ లోనే నివసిస్తున్న వారి ప్రయోజనాలు సర్కార్ నిర్ణయంతో దెబ్బతింటాయని ‘ ఉత్తర భారతీయ వికాస్ పరిషత్’ పేర్కొంది. విజయ్ రూపాని సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ కూడా తప్పుపట్టింది. తన నిర్ణయంపై గుజరాత్ ప్రభుత్వం మరోసారి ఆలోచించుకోవాలని కోరింది.



గురువారం చండీయాగంలో తీర్థం స్వీకరిస్తున్న సీఎం కేసీఆర్, ఎర్రవల్లిలోని యాగశాల వద్ద సీఎం దంపతులతో ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకట స్వామి దంపతులు

నాడు టెర్రరిస్టు.. నేడు అశోక చక్ర

న్యూఢిల్లీ: నజీర్ అహ్మద్ వనీ, కాశ్మీర్ లోని కుల్గాం జిల్లా కు చెందిన యువకుడు. 30 ఏళ్ల కిందట దారి తప్పాడు. టెర్రరిస్టు గా మారాడు. అనేక టెర్రరిస్టు కార్యకలాపాల్లో పాల్గొన్నాడు. కొంతకాలానికి తప్పు తెలుసుకున్నాడు. టెర్రరిజం తో జరుగుతున్న అనర్థాలను అర్థం చేసుకున్నాడు. చేస్తున్న పని కరెక్ట్ కాదని డిసైడ్ అయ్యాడు. టెర్రరిజానికి గుడ్ బై కొట్టాడు. తర్వాత 2004 లో సైన్యంలో చేరాడు. టెరిటోరియల్ ఆర్మీ బెటాలియన్ లో తొలి పోస్టింగ్. ఎంతో ధైర్యంగా సరిహద్దులను కాపలా కాశాడు. మొత్తం 17 ఎన్ కౌంటర్లలో పాల్గొన్నాడు. సైన్యానికి చేసిన సేవలకు గాను 2007, 2018 లో రెండు సార్లు సేవా పతకాన్ని అందుకున్నాడు.



2018 నవంబర్ 25 న ఏం జరిగింది

అది కిందటేడాది నవంబర్ 25. షోపియాన్ దగ్గర పెద్ద సంఖ్యలో టెర్రరిస్టులు తారసపడ్డారు. ప్రాణాలను పణంగా పెట్టి నజీర్ పోరాటం చేశాడు. టెర్రరిస్టుల తూటాలకు తీవ్రంగా గాయపడ్డాడు. రక్తం కారుతున్నా మడమ తిప్పలేదు. దీంతో తోటి సైనికులు నజీర్ ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ట్రీట్మెంట్ తీసుకుంటూ ప్రాణాలు విడిచాడు. దేశం కోసం ప్రాణాలర్పించిన నజీర్ వనీ ధైర్య సాహసాలను కేంద్రం గుర్తించింది. నజీర్ కు మరణానంతరం అశోక్ చక్ర ప్రకటించింది. ప్రతిష్ఠాత్మకమైన అశోక్ చక్ర అవార్డు లభించిన తొలి కాశ్మీరీగా నజీర్ వనీ చరిత్ర లో పేరు నమోదు చేసుకున్నాడు. శనివారం జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో నజీర్ వనీ కుటుంబ సభ్యులు అశోక్ చక్ర పురస్కారాన్ని అందుకోబోతున్నారు.

రుద్ర హోమం.. వేద నాదం

- నాలుగో రోజు శాస్త్రోక్తంగా సహస్ర మహాచండీ యాగం
- ఉదయం నుంచి రాత్రి దాకా హోమాలు, జపాలు, పారాయణాలు
- రాజశ్యామల మాత మండపంలో అర్చనతో క్రతువు మొదలు
- పాల్గొన్న సీఎం కేసీఆర్ దంపతులు

హైదరాబాద్, వెలుగు:

ఎర్రవల్లిలో ఆధ్యాత్మికత వెల్లివిరిస్తోంది. సహస్ర మహాచండీ యాగంలో భాగంగా గురువారం నాలుగో రోజు ఉదయం నుంచి రాత్రి వరకు హోమాలు, జపాలు, పారాయణాలు, హారతులు, మంత్రపుష్ప పూజాదికాలు నిర్వహించారు. రాజశ్యామల మాత మండపంలో అర్చనతో నాలుగో రోజు క్రతువు మొదలైంది. సీఎం కేసీఆర్ దంపతులు అమ్మవారికి శరభ శాలువ జపాలు, హోమాలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తర్వాత బగళాముఖి అమ్మవారి మండపంలో పూజలు చేశారు. రుత్వికులు పాంచాంగిక దీక్షలో ఆవాహిత దేవతా పూజ, పది వేల జపం, సుహాసినీ పూజ, హారతీ మంత్రపుష్పం, మూలమంత్ర హవనం, హరిద్రాన్నంతో 2 వేల మూలమంత్ర హవనం పూజలు చేశారు. మహారుద్ర యాగంలో భాగంగా శాంతి పాఠంతో ఆరంభించి ఆవామిత దేవతా పూజలు, రుద్ర జపాభిషేకాలు, 44 మంది రుత్విజులతో 44 ఏకాదశ రుద్రహోమాలు, అధ్యాక్త తిలలతో హోమం, ప్రదోష పూజ, నవగ్రహ జపాదులు, పంచకాటకాలు, పంచోపనిషత్తులు, సుందరాకాండ పారాయణం, సూర్య నమస్కారాలు, మహా మృత్యుంజయ జపం, హవనం వైభవంగానిర్వహించారు. ప్రాతఃకాల పూజలో సహస్ర చండీయాగం శ్రీచక్రార్చన, 400 సప్త శతి పారాయణాలు పూర్తి చేశారు. మంగళహారతి, మంత్రపుష్పం, భజన కార్యక్రమం, తీర్థ ప్రసాద వితరణతో మధ్యాహ్నిక కార్యక్రమం పూర్తయింది. సాయంత్రం లక్ష నవార్ణ జపాలు పూర్తి చేశారు. తర్వాత ప్రదోషకాల పూజలు, హారతి మంత్రపుష్పం, భజన చేసి తీర్థ ప్రసాదాలు ఇచ్చారు.

తరలి వచ్చిన నేతలు

నాలుగో రోజు యాగానికి నేతలు తరలివచ్చారు. ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి, సరోజ దంపతులతోపాటు ఎంపీలు కవిత, సంతోష్‌కుమార్, బూర నర్సయ్యగౌడ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతారాం నాయక్, బడుగుల లింగయ్య యాదవ్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, బీబీ పాటిల్, బండ ప్రకాశ్, దయాకర్, మాజీ మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, జగదీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జూపల్లి కృష్ణారావు, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మనోహర్‌రెడ్డి, గ్యాదరి కిశోర్, శంకర్ నాయక్, కాలే యాదయ్య, మాగంటి గోపినాథ్, అరికెపూడి గాంధీ, ఆరూరి రమేశ్, పెద్ద సుదర్శన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, నన్నపునేని నరేందర్, క్రాంతి, కంచర్ల భూపాల్‌రెడ్డి, సీఎస్ శైలేంద్రకుమార్ జోషి, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ నర్సింగ్‌రావు, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్ట సవరణలపై
స్టేకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ, వెలుగు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలో తెచ్చిన సవరణలపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు గురువారం నిరాకరించింది. ఈ కేసుల్లో నిందితుడికి బెయిల్ లభించకుండా కేంద్రం తీసుకొచ్చిన చట్టసవరణలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ నిర్ణయం ప్రకటించింది. 2018 మార్చి 20న ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ కేంద్రం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ తో పాటే ఈ పిటిషన్ పై విచారణ చేపడతామని జస్టిస్ ఎ.కె.సిక్రి నేతృత్వంలోని బెంచ్ స్పష్టం చేసింది. జస్టిస్ యు.యు.లలిత్ ను ఈ బెంచ్ లో చేర్చాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరింది. ఎస్సీ, ఎస్టీ చట్టం దుర్వినియోగమవుతోందని, ఈ కేసుల్లో వెంటనే అరెస్టు చేయరాదని 2018 మార్చి 20న జస్టిస్ ఎ.కె.గోయల్, యు.యు.లలిత్ ల తో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు వెలువరించింది. ముందస్తు బెయిల్ కు కూడా అవకాశం కల్పించింది. ఈ చట్టం కింద ప్రభుత్వ ఉద్యోగిపై కేసు నమోదైతే ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి తర్వాతే అరెస్టు చేయాలని చెప్పింది. దీన్ని దళితసంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో గతేడాది ఆగస్టు 9న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్ట సవరణ బిల్లును పార్లమెంటు ఆమోదించింది.



ఐఎన్ఎస్ కొహసా ప్రారంభం
అండమాన్, నికోబార్ దీవుల్లో మూడో ఎయిర్ బేస్

న్యూఢిల్లీ : అండమాన్, నికోబార్ దీవుల్లో మూడో ఎయిర్ బేస్ ను నావికాదళం ప్రారంభించింది. దీనికి ఐఎన్ఎస్ కొహసా అని పేరు పెట్టింది. నేవీ చీఫ్ అడ్మిరల్ సునీల్ లాంబా గురువారం ఈ ఎయిర్ బేస్ ను ప్రారంభించారు. అండమాన్, నికోబార్ దీవుల్లోని ఓ రన్ వే స్ట్రిప్ ను అభివృద్ధి చేసి, పూర్తిస్థాయి ఎయిర్ బేస్ గా మార్చారు. ఐఎన్ఎస్ కొహసా అందుబాటులోకి రావడంతో హిందూ మహాసముద్రంలో నిఘా సామర్థ్యం మరింత పెరిగింది. పోర్ట్ బ్లెయిర్ కు దాదాపు 300 కిలోమీటర్ల దూరంలో ఐఎన్ఎస్ కొహసా ఎయిర్ బేస్ ఉంది.

సీబీఐ డైరెక్టర్ ఎంపిక
మరోసారి వాయిదా

న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) డైరెక్టర్ ఎంపిక మరోసారి వాయిదా పడింది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ సమావేశం గురువారం సాయంత్రం సమావేశమైనప్పటికీ, ఎలాంటి నిర్ణయానికి రాలేకపోయింది. వచ్చే వారం కమిటీ మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. ప్రధాని మోడీ నివాసంలో జరిగిన సమావేశంలో ఆయనతో పాటు లోక్ సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ పాల్గొన్నారు. సీబీఐ డైరెక్టర్ పోస్టు కోసం దాదాపు 80 పేర్లు పరిశీలనకు వచ్చినట్లు ఖర్గే చెప్పారు. అయితే వీరికి సంబంధించి తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. దీంతో పదవిని ఆశిస్తున్నవారికి సంబంధించి మరింత సమాచారం కావాలని తనతో పాటు జస్టిస్ రంజన్ గొగోయ్ కోరినట్లు ఆయన చెప్పారు. సాధ్యమైనంత త్వరగా కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రధానిని కోరామన్నారు. కాగా 1982 నుంచి 1985 బ్యాచ్ వరకు ఉన్న ఐపీఎస్ అధికారుల పేర్లను కమిటీ పరిశీలించినట్లు తెలిసింది. అవినీతి ఆరోపణల నేపథ్యంలో సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను రాత్రికి రాత్రి తప్పించిన కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక డైరెక్టర్ గా ఎం.నాగేశ్వరరావు కు బాధ్యతలు అప్పగించింది.

నేడు, రేపు రాష్ట్రంలో పలుచోట్ల వర్షం

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడొచ్చని వాతావరణ కేంద్రం చెప్పింది. శనివారం పలుచోట్ల వడగండ్ల వాన పడే అవకాశం ఉంది. దక్షిణ బంగాళాఖాతంపై అల్పపీడనం ఏర్పడుతోంది. దీనికి అనుబంధంగా 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.

అజ్ఞాతం వీడిన కన్నడ ఎమ్మెల్యే

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉమేశ్ జాదవ్ చివరకు గురువారం అజ్ఞాతం వీడారు. ఈనెల 18న జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్పీ) సమావేశానికి దుమ్మా కొట్టిన తర్వాత ఉమేశ్ ఎవరికీ కనిపించకుండా అజ్ఞాతంలోకి వెళ్లారు. తాను బీజేపీలోకి వెళ్లడం లేదని మీడియాతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. కాంగ్రెస్ లోనే కొనసాగుతానని క్లారిటీ ఇచ్చారు. అయితే ఈ విషయంలో నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తల, తన మద్దతుదారుల అభిప్రాయం తీసుకుంటానన్నారు. మంత్రివర్గ విస్తరణలో చోటు దొరకనందుకు పార్టీ పై ఉమేశ్ అసంతృప్తిగా ఉన్నారు.

పీఎస్ఎల్వీ సీ44 ప్రయోగం
దిగ్విజయం



గురువారం అర్ధరాత్రి నింగిలోకి దూసుకెళ్తున్న పీఎస్ఎల్వీ సీ44



విద్యార్థులు, సైంటిస్టులతో ఇస్రో చైర్మన్ కె.శివన్ విజయానందం

శ్రీహరికోట:

స్పేస్‌రేస్‌లో ఇస్రో ఖాతాలో మరో ఘనత చేరింది. గెలుపు గుర్రం పీఎస్ఎల్వీ మరోసారి సత్తా చాటింది. రెండు మినీ ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ సీ44 గురువారం అర్ధరాత్రి విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ స్పేస్ సెంటర్‌లోని మొదటి లాంచ్‌ప్యాడ్ నుంచి నింగికెగిసిన రాకెట్ తమిళనాడు విద్యార్థులు తయారు చేసిన కలాంశాట్‌ను, ఇమేజింగ్‌కోసం పంపిన మైక్రోశాట్ ఆర్ ఉపగ్రహాన్ని సూర్యుడి ధ్రువ కక్ష్యలో దింపింది. ఈ ప్రయోగంలో ఇస్రో ఓ కొత్త ప్రయోగం చేసింది. నాలుగో దశ హయ్యర్ సర్క్యులర్ ఆర్బిట్ (వృత్తాకార కక్ష్య)లోకి చేరింది. తద్వారా మరింత ఎత్తులో ప్రయోగాలు చేసుకునేందుకు ఓ ఆర్బిటాల్ వేదికను ఏర్పాటు చేసినట్టయింది. ఇలా హయ్యర్ సర్క్యులర్ ఆర్బిట్‌లోకి చేరిన తొలి ఉపగ్రహంగా విద్యార్థులు చేసిన కలాంశాట్ ఘనతకెక్కింది. రక్షణ రంగానికి సేవలందించేందుకు ఉద్దేశించిన 740 కిలోల మైక్రో శాట్ ఆర్ ఉపగ్రహాన్ని సరిగ్గా 13.30 నిమిషాల్లో 274.12 కిలోమీటర్ల ఎత్తులో పీఎస్ఎల్వీ సీ44 రాకెట్ కక్ష్యలోకి చేర్చింది. 90 నిమిషాల తర్వాత బుల్లి ఉపగ్రహం కలాంశాట్‌ను 450 కిలోమీటర్ల ఎత్తులో సూర్యుడి కక్ష్యలోకి విజయవంతంగా పంపింది. తద్వారా స్టేజ్ 4నూ వాడుకోవచ్చన్న ధీమానిచ్చింది. ఇంకో విశేషం ఏమిటంటే, ఈ ప్రయోగం కోసం ఇస్రో తొలిసారిగా మునుపటి పీఎస్ఎల్వీలకు భిన్నంగా పీఎస్ ఎల్వీ డీఎల్‌తో ప్రయోగం చేసి విజయవంతమైంది. 1.2 కిలోల బరువున్న కలాంశాట్‌ను తమిళనాడు విద్యార్థులు కేవలం రూ.12 లక్షల ఖర్చుతో తయారు చేశారు. చిన్న ఉపగ్రహాల కమ్యూనికేషన్ వ్యవస్థల పనితీరును పరిశీలించడం దీని లక్ష్యం. కొత్త సంవత్సరంలో చేసిన తొలి అంతరిక్ష ప్రయోగం దిగ్విజయం కావడంపై ఇస్రో సైంటిస్టులు, అధికారులు, ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. చప్పట్లు, కేరింతలతో సంబురాలు చేసుకున్నారు. సైంటిస్టులు, ఉద్యోగులకు ఇస్రో చైర్మన్ కె.శివన్ అభినందనలు తెలిపారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోడీ తదితర ప్రముఖులు ఇస్రోకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ ఏడాది 37 ప్రయోగాలు
ఇస్రో చైర్మన్ కె.శివన్ వెల్లడి

తిరుమల, వెలుగు: ఈ ఏడాది చంద్రయాన్ తోపాటు మొత్తం 37 అంతరిక్ష ప్రయోగాలు ఉంటాయని ఇస్రో చైర్మన్ కె.శివన్ చెప్పారు. గురువారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. పీఎస్ఎల్వీ సీ44 నమూనా రాకెట్ కు శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. హైస్కూల్ విద్యార్థులను సైంటిస్టులుగా తీర్చిదిద్దేందుకు ఇస్రోలో శిక్షణ ఇస్తామని చెప్పారు.

మే 20న లాసెట్, 31న ఎడ్‌సెట్
మూడు ప్రవేశ పరీక్షల తేదీల్లో మార్పులు



హైదరాబాద్, వెలుగు: కామన్ ఎంట్రెన్స్ టెస్టుల తేదీలు మారాయి. లాసెట్, పీజీఈసెట్, ఎడ్‌సెట్ పరీక్ష తేదీల్లో స్వల్ప మార్పులు చేశారు. మే 26న జరగాల్సిన లాసెట్‌ను అదే నెల 20కి మార్చారు. మే 27 నుంచి 29 వరకు జరగాల్సిన పీజీఈసెట్‌ను మే 28 నుంచి 31 వరకు నిర్వహిస్తారు. మే 30, 31 తేదీల్లో అనుకున్న ఎడ్‌సెట్‌ను 31న ఒకే రోజుకు కుదించారు. రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (టీఎస్‌సీహెచ్‌ఈ)లో సెట్స్ కన్వీనర్లు, యూనివర్సిటీల వీసీలు, టీఎస్ ఆన్‌లైన్, టీసీఎస్ ప్రతినిధులతో ఉన్నత విద్యామండలి అధికారులు గురువారం సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలు అదే తేదీల్లో ఉన్నందున మూడు పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్టు టీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి చెప్పారు.

మే 12న కొమెడ్ కే, యూనిగేజ్ ఎంట్రెన్స్

ఇంజినీరింగ్ బీఈ, బీటెక్ కోర్సులకు సంబంధించి కొమెడ్ కే, యూనిగేజ్ ఎంట్రెన్స్ మే 12న ఉంటుందని ఎరా ఫౌండేషన్ సీఈఓ మురళీధర్ తెలిపారు. 180 విద్యాసంస్థలు, 21 వర్సిటీలకు కామన్ ఎంట్రెన్స్‌గా ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దేశంలో జేఈఈ తర్వాత ఇదే రెండో అతిపెద్ద మల్టీ యూనివర్సిటీ ప్రైవేట్ ఇంజినీరింగ్ ఎగ్జామ్ అన్నారు. ఈనెల 16 నుంచి 19 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తెలంగాణలో 6, ఏపీలో 18 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మే 27న ఫలితాలు విడుదల చేస్తామన్నారు.

వ్యక్తిగతంగా హాజరుకాలేను
ఈడీకి ఐఏఎస్ చంద్రకళ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: అక్రమ మైనింగ్, మనీలాండరింగ్ కేసులో తనకు వ్యక్తిగత హాజరునుంచి మినహాయింపునివ్వాలని తెలంగాణకు చెందిన యూపీ కేడర్ ఐఏఎస్ అధికారి చంద్రకళ గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను కోరారు. వ్యక్తిగత కారణాలవల్ల విచారణకు హాజరు కాలేకపోతున్నట్లు తెలిపారు. లక్నోలోని సీబీఐ జోనల్ ఆఫీసుకు లీగల్ ప్రతినిధిని పంపి డాక్యుమెంట్లను అందజేశారు. 2012, 2016లో హమీర్‌పూర్ ఏరియాలో మైనింగ్ అక్రమాలపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత మనీలాండరింగ్ ఆరోపణలతో చంద్రకళకు ఈడీ సమన్లు జారీచేసింది. అప్పట్లో గనుల శాఖను నిర్వహించిన మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ పాత్రపై కూడా సీబీఐ దర్యాప్తు చేస్తోంది.





శ్రీవారిని దర్శించుకున్న సీజే రాధాకృష్ణన్

తిరుమల, వెలుగు: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.బి.ఎన్. రాధాకృష్ణన్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సుప్రభాత సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. టీటీడీ అధికారులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. దర్శనం తర్వాత రంగనాయకుల మండపంలో జస్టిస్ రాధాకృష్ణన్ కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

'లోక్‌సభ'కు బ్యాలెట్

ప్రతిపక్షాల డిమాండ్

హైదరాబాద్, వెలుగు: ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు వచ్చే లోక్‌సభ ఎన్నికలను బ్యాలెట్ పేపర్‌తోనే నిర్వహించాలని పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పోలింగ్‌కు, కౌంటింగ్‌కు మధ్య భారీ ఓట్ల తేడా ఉందని, వీవీప్యాట్లను లెక్కించాలని కోరినా ఈసీ పట్టించుకోలేదని ఆరోపించారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అనుమానాలున్న చోట వీవీప్యాట్లను లెక్కించారని, తెలంగాణలో మాత్రం ఒక్క చోట కూడా వీవీప్యాట్లను ఎందుకు లెక్కించలేదని ప్రశ్నించారు. ఎన్నికల నిర్వహణలో ఈసీ వైఫల్యంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతిపక్షాలు గురువారం ఇందిరా పార్కు వద్ద ధర్నా చేశాయి. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. ఓట్ల సవరణ చేయకుండానే ఈసీ అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లిందని, ఫ్రీ అండ్ ఫేర్‌గా ఎలక్షన్లు నిర్వహించడంలో విఫలమైందని ఆరోపించారు. హైకోర్టు విచారణ సందర్భంగా ఓట్లను సవరిస్తామని మాట ఇచ్చి తప్పిన సీఈవో రజత్‌కుమార్‌ను తప్పించాలని, పది వేలలోపు మెజారిటీతో గెలిచిన చోట వీవీ ప్యాట్లను లెక్కించాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. ఈవీఎంల్లో అవకతవకలు జరిగాయని తాము నమ్ముతున్నామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చెప్పారు. ఎవరికి ఓటు వేశామనే దానిపై ఓటరుకు కూడా అనుమానాలు ఉన్నాయని, బ్యాలెట్ పేపర్‌తోనే అనుమానాలు నివృత్తి అవుతాయని అన్నారు. 2014లో బీజేపీ ఈవీఎంల ట్యాంపరింగ్ ద్వారానే అధికారంలోకి వచ్చిందన్న ఆరోపణలకు ఈసీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు జరిపే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని మాజీ మంత్రి డీకే అరుణ చెప్పారు.



గురువారం ఇందిరాపార్కు వద్ద ధర్నాలో భట్టి, రమణ, ఉత్తమ్, కోదండరాం తదితరులు

- అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌కు, కౌంటింగ్‌కు మధ్య భారీగా ఓట్ల తేడా
- అయినా వీవీప్యాట్‌లను ఈసీ లెక్కించలేదు
- పీసీసీ చీఫ్ ఉత్తమ్ ఆరోపణ
- ఈసీ వైఫల్యంపై ఇందిరాపార్కు వద్ద ప్రతిపక్షాల ధర్నా

ఓటరు నమోదుపై నిర్లక్ష్యం

రాష్ట్రంలో ఓటరు నమోదు కార్యక్రమంలో తీవ్ర నిర్లక్ష్యం జరిగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సీపీఐకి కూడా ఈవీఎంలపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాలని అన్ని పార్టీలు, ఉద్యమ నేతలకు సూచించారు. రాష్ట్రంలో ఓట్ల నమోదు సరిగా జరగలేదని, అందుకే రజత్‌కుమార్ ఓటర్లకు క్షమాపణలు చెప్పారని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం అన్నారు. తొలగించిన ఓటర్ల విషయంలో ఇప్పటికీ క్లారిటీ రాలేదన్నారు. అర్హులైన వారికి ఇప్పటికైనా ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. రజత్‌కుమార్ వ్యవహార శైలి అనుమానాస్పదంగా ఉందని ఆయనపై విచారణ చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోదండరాం డిమాండ్ చేశారు. ఎన్నికల్లో అవకతవకలను ప్రజలకు తెలియచేసేలా ఉద్యమం చేయాలని చెప్పారు. ఓట్ల గల్లంతుపై ఈసీకి ఆధారాలు ఇచ్చినా పట్టించుకోలేదని టీడీపీ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ పీసీసీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య, ఎంపీ నంది ఎల్లయ్య, మాజీ ఎంపీ అజీజ్ పాషా, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో మాకు అన్యాయం

హైకోర్టులో 10 మంది కాంగ్రెస్ నేతల పిటిషన్

హైదరాబాద్, వెలుగు: ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన పది మంది కాంగ్రెస్ అభ్యర్థులు న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించారు. తమపై నెగ్గిన టీఆర్ఎస్ అభ్యర్థులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించడంతో పాటు అనేక అక్రమాలకు పాల్పడ్డారని, వారిని అనర్హులుగా ప్రకటించాలని గురువారం హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈవీఎం ఓట్లతోపాటు వీవీప్యాట్‌లను లెక్కించాలని కోరినా ఎన్నికల అధికారులు అభ్యర్థనను తోసిపుచ్చారని చెప్పారు. కొన్నిచోట్ల ఎన్నికల అధికారులు అధికార పార్టీ అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. పిటిషన్లు వేసినవారిలో మాజీ మంత్రి డీకే అరుణ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డితోపాటు ఎన్.పద్మావతి రెడ్డి, కె.శ్రీనివాస్ గౌడ్, అద్దంకి దయాకర్, దాసోజు శ్రవణ్ కుమార్, బి.పవన్‌కుమార్, లక్షణ్‌కుమార్, కాసాని జ్ఞానేశ్వర్ ఉన్నారు. తనపై గెలిచిన టీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి అధికారులకు తప్పుడు అఫిడవిట్ సమర్పించారని డీకే అరుణ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పట్నం నరేందర్‌రెడ్డి కూడా అఫిడవిట్‌లో అనేక వాస్తవాల్ని దాచి పెట్టారని రేవంత్‌రెడ్డి వివరించారు.

కేంద్రంలో హంగ్!

చక్రం తిప్పనున్న ప్రాంతీయ పార్టీలు.. ఇండియా టుడే–కార్వీ, రిపబ్లిక్ టీవీ–సీ ఓటర్ సర్వేల్లో వెల్లడి

న్యూఢిల్లీ: ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కేంద్రంలో హంగ్ తప్పదా? బీజేపీ నేతృత్వంలోని అధికార ఎన్డీయేకు కష్టకాలమేనా? కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ పరిస్థితి మెరుగుపడుతోందా? తాజా సర్వేలు చూస్తే ఔననే తెలుస్తోంది. 'మూడ్ ఆఫ్ ది నేషన్ పోల్' పేరిట ఇండియా టుడే-కార్వీ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో, 'నేషనల్ అప్రూవల్ రేటింగ్' పేరిట రిపబ్లిక్ టీవీ- సీ ఓటర్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో ఇది వెల్లడైంది. ఎన్డీయే 99 సీట్లను కోల్పోతుందని, యూపీఏ అదనంగా 106 సీట్లను కైవసం చేసుకుంటుందని ఇండియా టుడే అంచనా వేసింది. ఎన్డీయే 103 సీట్లు కోల్పోతుందని, యూపీఏ అదనంగా 107 సీట్లను గెలుచుకుంటుందని రిపబ్లిక్ టీవీ సర్వేలో తేలింది. వచ్చే ఎన్నికల్లో ఇతరులే చక్రం తిప్పనున్నట్లు రెండు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. అటు ఎన్డీయేకు, ఇటు యూపీఏకు దూరం పాటిస్తున్న ప్రాంతీయ పార్టీల మద్దతే ప్రభుత్వ ఏర్పాటుకు కీలకంకానుంది. ఇండియా టుడే ప్రకారం 140 స్థానాలను, రిపబ్లిక్ టీవీ ప్రకారం 143 సీట్లను ఇతరులు కైవసం చేసుకోనున్నారు.

ఇండియా టుడే సర్వే ఇలా..

కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా మొత్తం 543 సీట్లలో 272 సీట్లు గెలుచుకోవాల్సి ఉంటుంది. ఎన్డీయే కానీ.. యూపీఏ కానీ ఆ మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోలేవని ఇండియా టుడే-కార్వీ సర్వేలో తేలింది. 2014 ఎన్నికల్లో ఎన్డీయే 336 సీట్లలో గెలిచి అధికారాన్ని చేపట్టగా.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మాత్రం 99 సీట్లు కోల్పోయి.. 237తో సరిపెట్టుకోవాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లో యూపీఏ 60 సీట్లు గెలుచుకోగా.. ఈసారి మాత్రం అదనంగా 106 సీట్లు తనఖాతాలో వేసుకొని 166కు చేరుకుంటుంది. దీన్ని బట్టి చూస్తే కేంద్రంలో హంగ్ ఖాయమని తెలుస్తోంది. ఒకవేళ యూపీఏతో టీఎంసీ, ఎస్పీ, బీఎస్పీ, పీడీపీ చేతులు కలిపితే మాత్రం కేంద్రంలో యూపీఏ మేజిక్ ఫిగర్ (272 సీట్లు) సాధిస్తుందని ఈ సర్వే అంచనా వేసింది. అదే సందర్భంలో అటు ఎన్డీయేతో ఏఐఏడీఎంకే, వైఎస్సార్‌సీపీ, టీఆర్ఎస్, బీజేడీ కలిస్తే.. ఎన్డీయేకు 257 సీట్లు రావొచ్చని వెల్లడైంది. అయితే.. మెజారిటీ రాకపోయినప్పటికీ ఎన్డీయేనే మళ్లీ అధికారాన్ని చేపడుతుందని సర్వేలో పాల్గొన్నవారిలో 60 శాతం మంది అభిప్రాయపడటం గమనార్హం.

రిపబ్లిక్ టీవీ సర్వే ఇలా..

కేంద్రంలో హంగ్ రావడం ఖాయమని రిపబ్లిక్ టీవీ- సీ ఓటర్ సర్వేలోనూ వెల్లడైంది. ఎన్డీయే 103 సీట్లు కోల్పోయి, 233 సీట్లకు పరిమితమవుతుందని, యూపీఏ అదనంగా 107 సీట్లు సాధించి 167 సీట్లకు ఎగబాకుతుందని తేలింది. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉండాలో నిర్ణయించేవి ప్రాంతీయ పార్టీలేనని, అందులో టీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీ, బీజేడీ పాత్ర కీలకం కానుందని ఈ సర్వే స్పష్టం చేసింది.



ఏ ఏ కూటమిలో ఏఏ పార్టీలు..?

ఎన్డీయే: బీజేపీ, ఆల్ ఇండియా ఎన్ రంగస్వామి కాంగ్రెస్, అప్నా దల్, బోడో పీపుల్స్ ఫ్రంట్, డీఎండీకే, జేడీయూ, ఎల్‌జేపీ, నాగా పీపుల్స్ ఫ్రంట్, పీఎంకే, నేషనల్ పీపుల్స్ పార్టీ, ఆర్‌పీఐ (ఏ), ఎస్ఏడీ, సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్, శివసేన

యూపీఏ: కాంగ్రెస్, డీఎంకే, జేడీ(ఎస్), నేషనల్ కాన్ఫరెన్స్, జేఎంఎం, కేరళ కాంగ్రెస్ (మణి), ఐయూఎంఎల్, ఎన్సీపీ, ఆర్జేడీ, ఆర్ఎల్డీ, టీడీపీ.

ఇతరులు: ఆప్, ఏజీపీ, ఎంఐఎం, ఏఐఏడీఎంకే, ఫార్వర్డ్ బ్లాక్, టీఎంసీ, ఏఐయూడీఎఫ్, బీజేడీ, సీపీఐ సీపీఎం, ఐఎన్ఎల్డీ, పీడీపీ, కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), ఎంఎన్ఎస్, ఎన్ఎల్‌పీ, ఆర్ఎస్పీ, టీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీ, స్వతంత్రులు

16 సీట్లు టీఆర్ఎస్‌కే


అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల్లోనూ తెలంగాణలో టీఆర్ఎస్ దూసుకుపోతుందని రిపబ్లిక్ టీవీ - సీ ఓటర్ సర్వేలో తేలింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో టీఆర్ఎస్ 16 సీట్లను కైవసం చేసుకోవడం ఖాయమని, మరో సీటు ఎంఐఎం ఖాతాలోకి వెళ్తుందని వెల్లడైంది. టీఆర్ఎస్‌కు 42.4 శాతం, యూపీఏకు 29 శాతం, బీజేపీకి 12.7 శాతం, ఎంఐఎంకు 7.7 శాతం ఓట్లు వస్తాయని సర్వే అంచనా వేసింది.

ఏపీలో వైఎస్సార్‌సీపీ హవా

ఏపీలో అధికార టీడీపీకి గట్టి షాక్ తప్పదని రిపబ్లిక్ టీవీ- సీ ఓటర్ సర్వే పేర్కొంది. అక్కడి మొత్తం 25 లోక్‌సభ సీట్లలో టీడీపీకి కేవలం ఆరు సీట్లు వస్తాయని, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 19 సీట్లు రావొచ్చని తేలింది. వైఎస్సార్‌సీపీకి 41.3శాతం, టీడీపీకి 33.1శాతం, యూపీఏకు 9.8శాతం, ఎన్డీయేకు 7.5శాతం ఓట్లు వస్తాయని సర్వే పేర్కొంది. 2014 ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ కలిసి 17 సీట్లలో విజయం సాధించగా.. అందులో టీడీపీవి 15 , బీజేపీవి 2.

యూపీ చుట్టే రాజకీయం

కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉండాలన్నా ఉత్తరప్రదేశ్ స్థానాలే కీలకం. మొత్తం 80 సీట్లున్న యూపీలో ఈసారి బీజేపీకి ఎదురు దెబ్బ తప్పేలా లేదు. ఎస్పీ, బీఎస్పీ చేతులు కలపడంతో కమలదళం కంగుతినడం ఖాయమని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ఇక్కడ గత ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 71 స్థానాల్లో గెలిచింది. దాని మిత్రపక్షం అప్నాదళ్ రెండు చోట్ల విజయం సాధించింది. ఎస్పీ ఐదుచోట్ల, కాంగ్రెస్ రెండు చోట్ల గెలువగా.. బీఎస్పీ అసలు ఖాతానే తెరువలేదు. కానీ.. ఈసారి ఎస్పీ - బీఎస్పీ పొత్తు వల్ల బీజేపీ సీట్లు భారీగా గల్లంతవుతాయని సర్వేలు పేర్కొన్నాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఎస్పీ, బీఎస్పీ కూటమికి 58 సీట్లు వస్తాయని, కాంగ్రెస్‌కు 4 సీట్లు వస్తాయని ఇండియా టుడే అంచనా వేసింది. బీజేపీ 16 సీట్లతో సరిపెట్టుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ఎస్పీ, బీఎస్పీతో కాంగ్రెస్ కలిస్తే మాత్రం బీజేపీకి కేవలం 5 సీట్లేవస్తాయని తెలిపింది. రిపబ్లిక్ టీవీ–సీ ఓటర్ సర్వే ప్రకారం.. ఎస్పీ, బీఎస్పీ కూటమికి 51 సీట్లు, బీజేపీ 25 సీట్లు రావొచ్చు.



ఆర్ఆర్ఆర్ వెంట 11 శాటిలైట్ టౌన్‌షిప్‌లు

- 'వాక్ టు వర్క్' కాన్సెప్ట్‌లో భాగంగా 5 వేల ఎకరాల్లో ఏర్పాటు
- సర్కారు వద్దకు ముసాయిదా ప్రతిపాదనలు

హైదరాబాద్, వెలుగు: రాజధాని నగరానికి మరో మణిహారంగా నిలవబోతున్న రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) వెంట 11 శాటిలైట్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'వాక్ టు వర్క్' కాన్సెప్ట్‌తో నిర్మించనున్న ఈ టౌన్‌షిప్ సెంటర్లపై ఇప్పటికే ఉన్నతస్థాయిలో ముసాయిదా ఖరారైనట్టు తెలుస్తోంది. ప్రభుత్వం దగ్గరకు ఆ ముసాయిదా వెళ్లినట్టు తెలుస్తోంది. ఒక్కో టౌన్‌షిప్‌ను కనీసం వెయ్యి నుంచి 5 వేల ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసేందుకు వీలుగా మున్సిపల్, రోడ్లు భవనాల శాఖ కలిసి ప్రతిపాదనలు తయారు చేసినట్టు తెలుస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా 50-60 కిలోమీటర్ల దూరంలో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) చుట్టూ 346.32 కిలోమీటర్ల విస్తీర్ణంతో సర్కార్ ప్రతిపాదించిన ఆర్ఆర్ఆర్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. రూ.11 వేల కోట్ల అంచనా వ్యయంతో రెండు దశల్లో ఆర్ఆర్ఆర్‌ను నిర్మిస్తారు. మొదటి దశలో భాగంగా చౌటుప్పల్-షాద్‌నగర్-సంగారెడ్డి వరకు 182.23 కిలోమీటర్ల మేర నిర్మిస్తారు. రెండో దశలో సంగారెడ్డి-నర్సాపూర్-తూప్రాన్-చౌటుప్పల్ వరకు 164.09 కిలోమీటర్ల మేర రీజినల్ రింగ్ రోడ్డును నిర్మిస్తారు.

శాటిలైట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేసే ప్రాంతాలివే...

- నేషనల్ హైవే 65: ముంబై రోడ్డు - సదాశివపేట పరిసర ప్రాంతాలు
- నేషనల్ హైవే 161: ఆందోల్ రోడ్డు పరిసర ప్రాంతాలు
- నేషనల్ హైవే 765(డి): మెదక్ రోడ్డు - నర్సాపూర్ పరిసర ప్రాంతాలు
- నేషనల్ హైవే 44: తూప్రాన్ పరిసర ప్రాంతాలు
- స్టేట్ హైవే 1: కరీంగనర్ రోడ్డు - అహ్మదీపురం పరిసర ప్రాంతాలు
- నేషనల్ హైవే 163: వరంగల్ రోడ్డు - యాదగిరి గుట్ట పరిసర ప్రాంతాలు
- నేషనల్ హైవే 65: విజయవాడ రోడ్డు - చౌటుప్పల్ పరిసర ప్రాంతాలు
- స్టేట్ హైవే 19: నాగార్జునసాగర్ రోడ్డు - నాగిళ్ల పరిసర ప్రాంతాలు
- నేషనల్ హైవే 765: శ్రీశైలం రోడ్డు - వెల్దండ పరిసర ప్రాంతాలు
- నేషనల్ హైవే 44: బెంగళూరు రోడ్డు - బాలానగర్ పరిసర ప్రాంతాలు
- నేషనల్ హైవే 163: చేవెళ్ల - పరిగి రోడ్డు - చంగముల్ పరిసర ప్రాంతాలు

హైకోర్టు చరాస్తుల విభజనపై సీఎస్‌ల భేటీ

హైదరాబాద్, వెలుగు: ఉమ్మడి హైకోర్టు చరాస్తుల విభజనపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల సీఎస్‌లు గురువారం సమావేశమయ్యారు. హైదరాబాద్ బోట్స్ క్లబ్‌లో జరిగిన ఈ భేటీలో సీఎస్ శైలేంద్రకుమార్ జోషి, ఏపీ సీఎస్ అనిల్ చంద్ర పునేత, ఇరు రాష్ట్రాల న్యాయ శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు. ఉమ్మడి హైకోర్టు సామగ్రి, కంప్యూటర్లు, వాహనాలు, ఇతర చరాస్తుల విభజనకు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై చర్చించారు. చరాస్తులపై సమాచారమివ్వాలని హైకోర్టు అధికారులను ఆదేశించారు. త్వరలోనే మరోమారు సమావేశమై విభజనపై నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.

పైసా మే పవర్

(మొదటి పేజీ తరువాయి)

మూడు విడతల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో 2,130 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మొదటి విడతలో జరిగిన ఎన్నికల్లో 12,201 మంది అభ్యర్థులు సర్పంచ్ పదవులకు పోటీపడ్డారు. రెండో, మూడో విడతలో జరిగే ఎన్నికల్లో మరో 31వేల మందికిపైగా క్యాండిడేట్లు సర్పంచ్ పదవుల కోసం తలపడుతున్నారు. వీరితోపాటు వార్డు మెంబర్లుగా మూడు లక్షల మంది బరిలో నిలిచారు. ఒక్కో సర్పంచ్ క్యాండిడేట్ సగటున రూ.5 లక్షల నుంచి 10 లక్షల వరకు ఖర్చు చేస్తున్నాడు. ఈ లెక్కన 42 వేల మంది అభ్యర్థుల మొత్తం ఖర్చు రూ. 3000 కోట్లు దాటిపోతోందని ఓ అంచనా. అన్నిమార్గాల నుంచి ఆదాయం వచ్చే మేజర్ పంచాయతీ అయితే ఖర్చు మరింత ఎక్కువవుతోంది. ఆరు నూరైనా తాను సర్పంచ్ పదవి దక్కించుకోవాలనుకునే బడా నేతలు కోట్లకు కోట్లు కుమ్మరించేస్తున్నారు. వార్డు మెంబర్ క్యాండిడేట్ల ఖర్చు అదనం. వెయ్యి మంది ఓటర్లున్న గ్రామాల్లో రూ. 10 లక్షలు ఏ మూలకూ సరిపోదని ఓ సర్పంచ్ క్యాండిడేట్ అన్నారు. ఓటర్లకు పొద్దున టిఫిన్, పగటిపూట భోజనం, రాత్రి విందు సప్లయ్ చేయాల్సి వస్తోందని, పోటీని తట్టుకోవాలంటే ఇలా ఖర్చు పెట్టక తప్పడం లేదని చెప్పుకొచ్చారు. చాలా ఊళ్లలో పొద్దుగూకితే చాలు ఇంటింటికీ బీర్లు, బిర్యానీలు వెళ్తున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచే క్యాండిడేట్లు పంపకాలు సాగిస్తున్నారు. కుల సంఘాలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలకు గంపగుత్తగా డబ్బులు పంచుతున్నారు. స్పెషల్ ప్యాకేజీలు ప్రకటిస్తున్నారు. రిజర్వుడు సీట్లు, ఏజెన్సీ ఏరియాలు మినహాయిస్తే ఈసారి అన్ని చోట్లా అభ్యర్థుల ఖర్చు అంచనాలను మించిపోతోంది.

ఇంటింటికీ రైస్‌బ్యాగ్, మటన్, వెండి నాణెం

గ్రానైట్ క్వారీలకు అడ్డాగా పేరొందిన కరీంనగర్ జిల్లా గంగాధర మండల పరిధిలోని ఓ ఊరిలో అభ్యర్థులు పెట్టిన ఖర్చు రూ. 3 కోట్లు దాటిపోయింది. ఈ పంచాయతీకి తొలివిడతలో ఎన్నికలు జరిగాయి. ప్రతి కుల సంఘానికి ఇక్కడి క్యాండిడేట్లు రూ. 4 లక్షల వరకు పంపిణీ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదే మండలం పరిధిలోని మరో ఊరిలో వార్డు మెంబర్‌గా పోటీచేసిన వ్యక్తి ప్రతి ఇంటికీ 25 కిలోల బియ్యం, రూ. 2 వేల డబ్బు అందజేశారట. ఇక, మంచిర్యాల జిల్లాలోని ఓ పంచాయతీ సర్పంచ్ పదవికి ఇద్దరు వ్యక్తులు పోటీపడ్డారు. చెరో రూ. 30 లక్షల దాకా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. వీరిద్దరూ పోటాపోటీగా ఇంటికో వెండి నాణెంను పంపిణీ చేశారట. సిద్దిపేట జిల్లా చిన్నకోదూరు మండలంలోని ఓ ఊరిలో సంక్రాంతి పండుగ రోజు ప్రతి ఇంటికీ ఓ క్యాండిడేట్ కిలో మటన్, లీటర్ కూల్ డ్రింక్ పంపించాడట. విషయం తెలుసుకున్న ప్రత్యర్థి.. పండుగ తెల్లారి తన వంతుగా ఇంటింటికి కిలో మటన్, లీటర్ కూల్‌డ్రింక్‌తో పాటు అదనంగా కిలో చికెన్ కూడా సప్లయ్ చేశాడట.

గుట్ట చుట్టూ పైసలే పైసలు

యాదగిరి గుట్ట చుట్టూ ఉన్న ఊళ్లలో ఎన్నికల ఖర్చు కోట్లు దాటిపోతోంది. ఇక్కడి ఓ సర్పంచ్ అభ్యర్థి నోటిఫికేషన్‌కు ముందు నుంచే రైతుల భూముల్లో ఫ్రీగా బోర్లు వేయించాడు. మరో ఊరిలో కొందరు అభ్యర్థులు.. ఇంటి నిర్మాణాలకు ఇటుక, సిమెంట్ మెటీరియల్ ఫ్రీగా సరఫరా చేశారు. ఇక్కడ ఒక్కో ఓటరుకు కనీసం రూ. 5 వేల నుంచి రూ.15 వేల వరకు పంపిణీ చేసినట్లు జనం అనుకుంటున్నారు. యాదాద్రి పుణ్య క్షేత్రం చుట్టుపక్కలా రియల్ వ్యాపారం జోరుగా సాగడం, బరిలో ఉన్న వారందరూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు కావడంతో క్యాండిడేట్లు ఖర్చుకు ఏ మాత్రం వెనుకాడటం లేదని స్థానికులు అంటున్నారు. ఇక, గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న పంచాయతీలకు ఫ్యాక్టరీలు, రియల్ ఎస్టేట్ రంగం నుంచి దండిగా ఆదాయం వస్తుంది. ఆయా ఊళ్లలో సర్పంచ్ పదవిని చేజిక్కించుకునేందుకు క్యాండిడేట్లు మందు, మనీని పారించేస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్లాన్ల మీద ప్లాన్లు వేస్తున్నారు.

తప్పకుంటే రూ. 2 కోట్లు!

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ ఊరిలో సర్పంచ్ పదవికి ఇద్దరు బడా లోకల్ లీడర్స్ పోటీపడ్డారు. పంచాయతీని ఏకగ్రీవం చేసుకునేందుకు ఓ అభ్యర్థి ఖర్చుకు ఏ మాత్రం వెనుకాడలేదు. బరిలో నుంచి తప్పుకోవాలని ప్రత్యర్థికి రూ.2 కోట్ల వరకు ఆఫర్ ఇచ్చాడు. అందుకు ప్రత్యర్థి ఒప్పుకోకపోవడంతో ఎన్నిక తప్పలేదు.

అసలుకు పది రెట్ల ఖర్చు

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 5 వేలు జనాభా దాటిన పంచాయతీల్లో రూ. 2.50 లక్షలు, 5 వేలలోపు జనాభా ఉన్న పంచాయతీల్లో రూ. 1.50 లక్షల వరకు అభ్యర్థులు ఖర్చు చేసుకోవచ్చు. నిబంధనలతో పట్టింపు లేకుండా ఒక్కో చోట పది రెట్లకు మించి ఖర్చు చేసేందుకే అభ్యర్థులు పోటీపడుతున్నారు. వార్డు మెంబర్‌గా పోటీచేసేవారి వ్యయం రూ. 50వేలు (5వేల జనాభా ఉన్న చోట), రూ.30 వేలు (5వేల లోపు జనాభా ఉన్న చోట) ఉండగా వీళ్లు కూడా లక్షల్లో ఖర్చు చేసేస్తున్నారు.

లెక్కలు సమర్పించాల్సిందే

ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పంచాయతీ ఎన్నికలు ముగిసిన 45 రోజుల్లోగా అభ్యర్థులందరూ తమ ఖర్చుల వివరాలు ఆర్డీవోకు సమర్పించాల్సి ఉంటుంది. ప్రచార సమయంలో ప్రతి రోజు లెక్కలను సంబంధిత పంచాయతీ రిటర్నింగ్ అధికారికి ఇవ్వాలి. భోజనాలు, పెట్రోలు, కరపత్రాలు, బ్యానర్లు, సమావేశాల ఖర్చులు.. ఇలా అన్ని వివరాలు స్పష్టంగా తెలపాలి. ఎన్నికల ఖర్చును లెక్కించటానికి పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించింది. ప్రతి మండలానికి మూడు, నాలుగు బృందాలను నియమించింది. లెక్కలు సమర్పించని వారిపై ఎన్నికల సంఘం అనర్హత వేటు వేయనుంది. అయితే.. పెట్టిన ఖర్చు ఎక్కడా బయటపడకుండా, తాము నిబంధనల ప్రకారం ఖర్చు చేసినట్లు ఎన్నికల సంఘానికి చూపేందుకు చాలా మంది అభ్యర్థులు ముందుగానే ప్రిపేర్ అవుతున్నారు.



ఇంటికి రూ. 17వేలు!

సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని ఓ చిన్న ఊరది. ఎన్నికల బరిలో ఉన్న ఇరువర్గాలవారు పోటాపోటీగా ఓటర్లకు పైసలు పంచిపెట్టారు. నలుగురు కుటుంబసభ్యులున్న ఓ కుటుంబం.. పోలింగ్ అయిన మర్నాడు కూర్చుని పైసలు ఎన్నొచ్చాయని లెక్కపెట్టసాగింది. కుటుంబం మొత్తానికి కలిపి రూ. 17 వేలు వచ్చాయట. సంక్రాంతికి మూడు రోజుల ముందు నుంచే ఇక్కడ మొదలైన పంపకాల పర్వం పోలింగ్ నాటికి పీక్స్‌కు చేరింది. పది రోజులపాటు రోజూ ఇంటికో కోడి, ఆఫ్ బాటిల్ లిక్కర్ పంచారు. వార్డు మెంబర్ బరిలో ఉన్న ఓ అభ్యర్థి ఉప సర్పంచ్ పదవిని కైవసం చేసుకునేందుకు ఏకంగా బంగారపు ముక్కుపుడకలు, చీరలు డబుల్ డబుల్ పంచిపెట్టాడని ప్రచారంలో ఉంది. తీరా చూస్తే ఎన్నికల్లో సదరు అభ్యర్థి ఓడిపోయాడు. పొలం అమ్మి మరీ కానుకలు పంచిపెడితే.. ఇలా అయిందేమిటని అతడు లబోదిబోమంటున్నాడు.

రూల్స్ పదును పెరగాలి

ఎన్నికలు పూర్తయిన తర్వాత అభ్యర్థులు సమర్పించే లెక్కలు విచిత్రంగా ఉంటాయి. ఈసీ ఖరారు చేసిన దాని కంటే తక్కువగా ఖర్చు పెట్టినట్లు క్యాండిడెట్లు చెబుతుంటారు. వ్యయ పరిమితి పెంచి, కఠినంగా నిబంధనలు అమలు చేస్తే కొంత మార్పు రావొచ్చు. లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో జరిగేలా చూడాలి. పరిశీలకులు ఖచ్చితంగా లెక్కల తనిఖీ చేపట్టాలి.

- రాకేశ్‌రెడ్డి, ఆర్టీఐ కార్యకర్త

అడ్డుకట్ట వేయాల్సిందే

ఐదేళ్లకు ఒకసారి జరిగే అసెంబ్లీ, లోక్‌సభ, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో భారీగా వ్యయం పెరుగుతోంది. ఓటర్ల వీక్‌నెస్‌ను నేతలు తమకు అనుకూలంగా మల్చుకుంటున్నారు. పోటీలో ఉండే రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు. ఎన్నికల్లో భారీ ఖర్చు అన్నది వ్యసనంలా తయారైంది. దీనికి అడ్డుకట్ట వేయాల్సిందే.

- రావు చెలికాని, ఎన్నికల నిఘా వేదిక కన్వీనర్

రెండో 'పంచాయతీ' నేడు

హైదరాబాద్, వెలుగు:

పంచాయతీ ఎన్నికల రెండో విడతలో 3,342 గ్రామ పంచాయతీలు, 26,191 వార్డులకు శుక్రవారం పోలింగ్ జరగనున్నది. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ కొనసాగుతుంది. 2 గంటల నుంచి కౌంటింగ్, విజేతల ప్రకటన, ఉపసర్పంచ్ ఎన్నిక ఉంటాయి. మలిదశలో 4,135 పంచాయతీలు, 36,602 వార్డులకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చింది. వాటిలో 788 పంచాయతీలకు సర్పంచులు, 10,317 మంది వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో ఐదు పంచాయతీలకు, 94 వార్డులకు వివిధ కారణాలతో ఎన్నికలు నిర్వహించడం లేదు. ఎన్నికలు జరిగే 3,342 పంచాయతీల సర్పంచ్ పదవుల కోసం 10,668 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 26,191 వార్డుల్లో 63,480 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

కొత్త సర్పంచులను ఆహ్వానించొద్దు

ఈ నెలాఖరుదాకా కోడ్ అమలులో ఉంటుంది కనుక ప్రభుత్వ స్కూళ్లు, ఆఫీసుల్లో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు కొత్తగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులను ఆహ్వానించొద్దని ప్రధానోపాధ్యాయులకు రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది. పంచాయతీ తొలి విడతలో గెలుపొందిన సర్పంచులు, వార్డు మెంబర్లు ప్రమాణస్వీకారం చేయాల్సి ఉన్న విషయాన్ని గుర్తుచేసింది. మూడు విడతల ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రమాణస్వీకారం ఉంటుందని తెలియజేసింది. ప్రస్తుతానికి ప్రత్యేక అధికారి మాత్రమే గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని సూచించింది. రిపబ్లిక్ డే కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులకు ప్రత్యేక అధికారం ఇవ్వొద్దని మరొక లేఖలో పేర్కొంది. యాదాద్రి భువనగిరి డీపీవో రాసిన లేఖకు ఎన్నికల సంఘం కార్యదర్శి మేకల అశోక్‌కుమార్ వివరణ ఇచ్చారు. ప్రజాప్రతినిధుల పేర్లతో ఇన్విటేషన్స్ ముద్రించరాదని, వారి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, విద్యార్థులకు బహుమతులు అందజేయవద్దని సూచించారు.



- 3,342 పంచాయతీల బరిలో 10,668 మంది సర్పంచ్ అభ్యర్థులు
- 26,191 వార్డుల్లో 63,480 మంది అభ్యర్థుల పోటీ

మూడోదశలో 573 సర్పంచులు, 8, 956 వార్డుల ఏకగ్రీవం

మూడో విడతలో 4,116 పంచాయతీలకు గాను, 573 పంచాయతీలకు సర్పంచ్, 8,956 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగతా 3,529 పంచాయతీలు, 27,583 వార్డులకు ఈనెల 30న పోలింగ్ జరుగుతుంది. అత్యధికంగా సర్పంచులు ఏకగ్రీవమైన జిల్లాలుగా నిజామాబాద్ (61), ఆదిలాబాద్ (55), మహబూబాబాద్ (39), కామారెడ్డి (38) ఉన్నాయి.

గోవా మందు.. నల్లగొండకు

- ఓటర్లకు పంచేందుకు లోకల్ లీడర్స్ ప్లాన్
- పట్టుకున్న పోలీసులు.. ప్రధాన నిందితుడి కోసం వేట

నల్లగొండ, వెలుగు:

పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అభ్యర్థులు మద్యాన్ని ఎరగా వేస్తున్నారు. తక్కువ ధరకు గోవాలో లిక్కర్ దొరుకుతుందని భావించి.. అక్కడి నుంచి దిగుమతి చేయించుకుంటున్నారు. నల్లగొండ జిల్లాలోని పలు ఊళ్లకు గోవా నుంచి అక్రమంగా వస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. దాని విలువ రూ. లక్షల్లో ఉంటుందని అంచనా. అయితే.. అది ఎప్పుడు, ఎక్కడ, ఎవరి వద్ద పట్టుకున్నది మాత్రం పోలీసులు బయటపెట్టలేదు. జిల్లాకు చెందిన కొందరు లోకల్ లీడర్స్ హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ద్వారా గోవా నుంచి మద్యం దిగుమతి చేయించుకుంటున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం పలువురు లోకల్ లీడర్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రధాన నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ విషయమై నల్లగొండ ఈఎస్ శంకరయ్య మాట్లాడుతూ.. గోవా మద్యం పట్టుబడిన మాట వాస్తవమేనని, ఒకట్రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.



పట్టుబడ్డ మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

ఓటర్స్ డేలో పాల్గొనం: సీపీఐ

హైదరాబాద్, వెలుగు: ఎన్నికల కమిషన్ శుక్రవారం నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవంలో పాల్గొనబోమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. ఓటర్ జాబితాలో తప్పులున్నాయని చెప్పినా ఎన్నికల అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈసీ ఏకపక్ష, అప్రజాస్వామిక ధోరణికి నిరసనగా తాము ఈ నిర్ణయం తీసుకుంటున్నామని తెలిపారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర సీఈవో రజత్‌కుమార్‌కు లేఖ రాశారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా 22 లక్షల నుంచి 30 లక్షల వరకు ఓట్లు గల్లంతయ్యాయని తేలిందని, ఈ విషయాన్ని ఈసీ దృష్టికి తీసుకుపోయినా నిర్లక్ష్యం చేశారన్నారు.

జగన్ పార్టీలో నన్ను అవమానించారు

అందుకే పార్టీ మారుతున్నా: వంగవీటి రాధా

విజయవాడ, వెలుగు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో తనను అవమానించారని, ఇంకెవ్వరికీ అలా జరగకూడదనే పార్టీ మారుతున్నానని విజయవాడ మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా అన్నారు. తన తండ్రి రంగా విగ్రహావిష్కరణకు జగన్ పర్మిషన్ తీసుకోవాలా అని ప్రశ్నించారు. గురువారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. "సొంత తమ్ముడని చెబుతూనే నన్ను అడుగడుగునా అవమానించారు. నాకు అభిమానులు భోజనం తీసుకొస్తే తప్పయ్యిందా? అభిమానుల కోసం విగ్రహావిష్కరణకు వెళ్లా. సీటు ఇవ్వనందుకు బాధపడలేదు. సూటిపోటి మాటలతో నా తండ్రిని అవమానిస్తున్నారు. వంద కోట్లు తీసుకొని టీడీపీలో చేరుతున్నానన్న ఆరోపణలు అవాస్తవం" అని చెప్పారు. తండ్రి రంగాను హత్య చేసింది కొందరు వ్యక్తులేనని, దాన్ని పార్టీకి పూయడం సరికాదన్నారు.

బస్ స్టేషన్లలో మినీ థియేటర్లు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని బస్ స్టేషన్లలో మినీ థియేటర్లు అందుబాటులోకి రానున్నాయి. థియేటర్ల ఏర్పాటుకు 23 స్థలాలు గుర్తించగా 15 చోట్ల నిర్మాణానికి రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్‌కుమార్ శర్మ గురువారం వెల్లడించారు. వీటి ద్వారా ఏటా రూ. 3.11 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశామన్నారు. ఏపీలోని విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో నిర్మించిన థియేటర్‌ను ఈడీ (రెవెన్యూ) పురుషోత్తం నేతృత్వంలోని అధికారుల బృందం త్వరలో సందర్శించి నిర్వహణపై స్టడీ చేస్తుందని చెప్పారు.

బరాక్ 8 రెడీ టు ఫైర్



భువనేశ్వర్: లాంగ్ రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ (ఎల్ఆర్ఎస్ఏఎమ్) లేదా బరాక్ 8ను డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో) గురువారం విజయవంతంగా టెస్టు చేసింది. ఐఎన్ఎస్ చెన్నై యుద్ధ నౌకపై నుంచి దూసుకెళ్లిన మిస్సైల్, టార్గెట్‌ను తునాతునకలు చేసింది. ఈ సమయంలో అన్ని లెవల్స్‌ను మిస్సైల్ చేరుకున్నట్లు డీఆర్డీవో ప్రకటించింది. తక్కువ ఎత్తులో వస్తున్న టార్గెట్‌ను మిస్సైల్ నాశనం చేసినట్లు పేర్కొంది. యుద్ధ వ్యతిరేక కార్యకలాపాల కోసం మిస్సైల్ సన్నద్ధతను తెలుసుకోవడానికి టెస్టు చేశారు. ఇండియన్ నేవీ కోసం బరాక్ 8ను డీఆర్డీవో, ఇజ్రాయెల్ ఏరోస్పేస్ లిమిటెడ్ సంయుక్తంగా తయారు చేశాయి. బరాక్ 8 సక్సెస్‌ఫుల్ టెస్టుపై డీఆర్డీవోకు రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు.

ఫిబ్రవరి 1 నుంచి ఫిష్ ఫెస్టివల్

హైదరాబాద్, వెలుగు: చేపలను ఆహారంగా తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు నేషనల్ ఫిష్ ఫెస్టివల్ నిర్వహిస్తామని పశుసంవర్ధక శాఖ కమిషనర్ సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. ఫిబ్రవరి 1 నుంచి మూడురోజులపాటు హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో ఫెస్టివల్ ఉంటుందని చెప్పారు. జాతీయ మత్స్య పరిశ్రమ అభివృద్ధి సంస్థ సీఈవో రాణి కుముదినితోపాటు గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 6 శాతం మంది మాత్రమే చేపలను తింటున్నారని రాణి కుముదిని చెప్పారు. గత ఏడాది విశాఖపట్నం, పాట్నా, న్యూఢిల్లీలో ఫిష్ ఫెస్టివల్ నిర్వహించామన్నారు. హైదరాబాద్ లో జరిగే ఫిష్ ఫెస్టివల్ లో 20 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

జుకర్.. స్టెన్‌గన్‌తో మేకను చంపాడు

అప్పటికప్పుడు నా కోసం కూర వండాడు: ట్విట్టర్ సీఈవో జోక్



తన కోసం ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ స్టెన్ గన్‌తో మేకను కాల్చి చంపేశాడంటూ ట్విట్టర్ సీఈవో జాక్ డోర్సే జోక్ చేశారు. తొలుత స్టెన్ గన్‌తో మేకను స్టన్ చేసిన జుకర్ ఆ తర్వాత కత్తితో దాన్ని చంపారని 'రోలింగ్ స్టోన్ మేగజైన్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ తర్వాత గబగబా తన కోసం వంట చేశారని, కానీ వడ్డించే లోపే అది చల్లబడిపోవడంతో వెజిటబుల్ సలాడ్‌తో సరిపెట్టుకున్నానని అన్నారు. గతేడాది జుకర్‌ను వాళ్లింట్లో కలుసుకున్నట్లు వెల్లడించారు. తన జీవితంలో అదో మర్చిపోలేని సంఘటన అని పేర్కొన్నారు. మేకను ఎలా చంపారని ప్రశ్నించగా.. స్టెన్‌గన్, కత్తి సాయంతో అని సమాధానమిచ్చారు. టెస్లా సీఈవో ఎలన్ మస్క్ గురించి అడగ్గా ''ఈ గ్రహం నుంచి మనల్ని వేరే గ్రహానికి తీసుకెళ్లాలనుకుంటున్న మరో వ్యక్తి ఎవరూ నాకు తెలీదు'' అని అన్నారు.

ఇండోనేసియాలో వరదలు 26 మంది మృతి

మకాస్సార్: ఇండోనేసియాలో కురుస్తున్న భారీ వర్షాలు ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ మునిగిపోయాయి. డ్యాంలు పొంగి పొర్లుతున్నాయి. ఈదురు గాలులు భారీగా వీస్తున్నాయి. కొండ చరియలు విరిగిపడటంతో 26 మంది చనిపోయారని, మరో 24 మంది గల్లంతయ్యారని అధికారులు చెప్పారు. గల్లంతైన వారికోసం గాలిస్తున్నామని చెప్పారు. దాదాపు మూడు వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విరిగిపడిన కొండచరియలను తొలగిస్తున్నారు.

మోడీపై పోటీ చేయండి

ప్రియాంకను కోరిన వారణాసి కాంగ్రెస్ కార్యకర్తలు



వారణాసి : ప్రధాని నరేంద్ర మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ ప్రియాంక గాంధీని కాంగ్రెస్ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు పోస్టర్లు వేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంకతో పాటు కిందటిసారి లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన స్థానిక నాయకుడు అజయ్ రాయ్ బొమ్మలతో కూడిన పోస్టర్లు వారణాసి అంతటా కనిపిస్తున్నాయి. వారణాసి నుంచి ప్రియాంక పోటీ చేస్తే ఆ ప్రభావం మిగతా సెగ్మెంట్ల పై పడుతుందని అజయ్ రాయ్ అన్నారు. వారణాసి సెగ్మెంట్ కు కాంగ్రెస్ కేండిడేట్ గా ప్రియాంకను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కొంతమంది యువజన కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం ప్రదర్శన నిర్వహించారు.

గెలిపించే బాధ్యత ప్రియాంకదే

అమేథీలో కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ



అమేథీ : 2022 లో జరిగే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ చీఫ్ రాహుల్ గాంధీ చెప్పారు. ప్రియాంక గాంధీ, జ్యోతిరాదిత్య సింధియాకు ఈ బాధ్యతను అప్పగించినట్లు ఆయన చెప్పారు. ఈ ఇద్దరు యువతరం లీడర్ల నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని తాను ఆశిస్తున్నట్లు అమేథీలో గురువారం జరిగిన బహిరంగ సభలో ఆయన చెప్పారు. ప్రియాంక నాయకత్వంలో కాంగ్రెస్ బలోపేతం అవుతుందన్న నమ్మకం తనకుందన్నారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడానికి అన్ని శక్తులను కూడదీసుకుని పోరాటం చేస్తామన్నారు. మోడీ ప్రభుత్వం లో కేవలం కొంతమంది పారిశ్రామికవేత్తలకే మేలు జరిగిందన్నారు. వారి రుణాలే మాఫీ అయ్యాయన్నారు. తన మాటల్లో తరచూ భగవంతుడి ప్రస్తావన తెచ్చే ప్రధాని మోడీ అబద్ధాలు చెబుతారని ఆరోపించారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే ప్రజలకు మంచి రోజులు వస్తాయని కిందటిసారి లోక్ సభ ఎన్నికలకు ముందు మోడీ ఇచ్చిన హామీ ఏమైందని రాహుల్ ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీకే చేతనవుతుందన్నారు. రుణమాఫీ గురించి రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. సీబీఐ వివాదాన్ని ప్రస్తావిస్తూ సంబంధిత కమిటీకి చెప్పకుండా కీలకమైన డైరెక్టర్ ను అర్ధరాత్రి హడావిడిగా తొలగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. సీబీఐ ను తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలని మోడీ సర్కార్ ప్రయత్నించిందన్నారు. పెద్ద నోట్ల రద్దు వాస్తవానికి ఓ పెద్ద కుంభకోణమని రాహుల్ ఆరోపించారు.

ఇక్కడొద్దు, ఇటలీ వెళ్లిపొండి

- రాహుల్‌కు చేదు అనుభవం
- ఉద్యోగాల ఆశపెట్టి భూములు లాక్కున్నారని ఆరోపణలు

అమేథీ: కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీకి తన సొంత నియోజకవర్గమైన ఉత్తరప్రదేశ్ లోని అమేథీలో చేదు అనుభవం ఎదురైంది. " మీరు ఇక్కడ వద్దు. ఇటలీ వెళ్లిపొండి " అని ప్రజలు ఆయనకు వ్యతిరేకంగా పెద్దగా నినాదాలు చేశారు. అమేథీ జిల్లా గౌరీగంజ్ పట్టణంలో ఈ సంఘటన జరిగింది. రాహుల్ గాంధీ తమ భూములు కబ్జా చేశారని కొంతమంది యువకులు ఆరోపించారు. రాజీవ్ గాంధీ ఫౌండేషన్ పేరుతో ఏర్పాటు చేసిన సంస్థకు తమ దగ్గర నుంచి రాహుల్ భూములు తీసుకున్నారన్నారు. దీనికి బదులుగా ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అయితే ఇప్పటివరకు ఎవరికీ ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. ఈ విషయంలో రాహుల్ వైఖరికి నిరసనగా సామ్రాట్ సైకిల్ ఫ్యాక్టరీ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. తమ దగ్గరనుంచి తీసుకున్న భూములనైనా వాపసు చేయాలని లేదంటే ఉద్యోగాలైనా ఇవ్వాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఇదే అంశం పై రాహుల్ పై కేంద్రమంత్రి స్మృతి ఇరానీ గతంలో ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ చీఫ్, ఉద్యోగాల ఆశపెట్టి సామాన్య ప్రజల విలువైన భూములను లాక్కున్నారని ఆరోపించారు.



వెనెజులాలో

ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తున్న ఆందోళనకారులు



జాతీయ పతాకాన్ని ఎగరవేస్తున్న ప్రెసిడెంట్ మదురో

రెండు సర్కార్లు

మిలిటరీ అండతో ఒకటి.. అమెరికా ఆసరాతో మరొకటి

తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రతిపక్ష నేత గుయిడో ప్రమాణం

గుయిడోకు అమెరికా సహా పలు దేశాల మద్దతు

కారకాస్, బ్రెస్సెల్స్, దావోస్:

వెనెజులాలో రాజకీయ సంక్షోభం తలెత్తింది. అధికార, ప్రతిపక్షాల సమాంతర ప్రభుత్వాలు నడుస్తున్నాయి. వరుసగా రెండో సారి ప్రెసిడెంట్ గా నికోలస్ మదురో ప్రమాణం చేస్తే, అది చెల్లదంటూ ప్రతిపక్షాల నియంత్రణలోని నేషనల్ అసెంబ్లీ డిక్లేర్ చేసింది. అధ్యక్ష పదవి ఖాళీగా ఉందంటూ ప్రకటన చేసింది. ఆ వెంటనే తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రతిపక్ష నేత జువాన్ గుయిడో ప్రమాణం చేశారు. మదురోకు మిలటరీ అండగా ఉండగా, గుయిడోకు అమెరికా, దాని మిత్ర దేశాలు మద్దతు ప్రకటించాయి. ప్రెసిడెంట్ గా గుయిడోను గుర్తిస్తున్నామంటూ అమెరికా ప్రకటన కూడా చేసేసింది. ఈ క్రమంలో వెనెజులా రాజధాని కారకాస్ నిరసనలు ఆందోళనలతో అట్టుడుకుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తల దాడులు ప్రతిదాడులు కొనసాగుతున్నాయి.

గెటౌట్.. వెనెజులా వదిలి వెళ్లండి

వెనెజులా అధ్యక్షుడిగా గుయిడోను గుర్తిస్తున్నామంటూ అమెరికా చేసిన ప్రకటనపై మదురో మండిపడ్డారు. ఆ దేశంతో దౌత్యపరమైన సంబంధాలను పూర్తిగా తెగదెంపులు చేసుకున్నారు. యూఎస్ డిప్లొమాట్లు 72 గంటల్లోగా వెనెజులాను విడిచి వెళ్లాలని హుకుం జారీ చేశారు. “గెటౌట్. వెనెజులా నుంచి వెళ్లిపోండి”అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుయిడో తిరుగుబాటుకు అమెరికాకు మద్దతు తెలుపుతోందని, వాషింగ్టన్ నుంచి వెనెజులాను పాలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ‘మాజీ ప్రెసిడెంట్ మదురో’ ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని యూఎస్ స్టేట్ డిపార్ట్ మెంట్ చెప్పింది. దౌత్య సంబంధాలు తెంచుకునే అధికారం ఆయనకు లేదని స్పష్టం చేసింది. తాత్కాలిక అధ్యక్షుడు గుయిడో ప్రభుత్వంతో దౌత్య సంబంధాలు కొనసాగిస్తామని తెలిపింది. మదురో మిలటరీని ఉపయోగించి ప్రతిపక్షాలను అణగదొక్కాలని చూస్తే ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోమని హెచ్చరించింది.

మొదలైందిలా..

2013లో లెఫ్టిస్ట్ ఫైర్‌బ్రాండ్ హ్యూగో చావెజ్ మరణించాక, వెనెజులా అధ్యక్షుడుగా నికోలస్ మదురో బాధ్యతలు చేపట్టారు. గతేడాది జరిగిన ఎన్నికల్లో మళ్లీ గెలిచారు. అయితే ఆ ఎన్నికలను ప్రతిపక్షాలు బహిష్కరించాయి. ఎన్నికల అధికారులపై తమకు నమ్మకం లేదంటూ బాయ్‌కాట్ చేశాయి. మదురో విజయం పెద్ద మోసం అంటూ చాలా దేశాలు కూడా వ్యాఖ్యానించాయి. ఈ క్రమంలో జనవరి 10న మదురో ప్రమాణ స్వీకారం చేశారు. ఆ వెంటనే నేషనల్ అసెంబ్లీ సమావేశమైంది. కొత్త ప్రభుత్వం చట్ట సమ్మతం కాదని, ప్రెసిడెంట్ పదవి ఖాళీగా ఉందని ప్రతిపక్షాల నియంత్రణలో ఉండే అసెంబ్లీ డిక్లేర్ చేసింది. రెండు రోజుల కిందట ప్రతిపక్ష నేత, నేషనల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ జువాన్ గుయిడో (35) తాత్కాలిక ప్రెసిడెంట్ గా ప్రమాణం చేశారు. మదురో అక్రమంగా అధికారాన్ని చేజిక్కించుకున్నారని ఆరోపించారు. అధిక ద్రవ్యోల్బణం వల్ల ఆర్థిక వ్యవస్థ పతనం కాకుండా ఉండేందుకు తాము కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని చెప్పారు. తర్వాత ఆయన గుర్తు తెలియని ప్రాంతానికి వెళ్లిపోయారు. ప్రభుత్వం అరెస్టు చేస్తుందన్న కారణంతో అజ్ఞాతంలో ఉన్నారు.

సమాంతర ప్రభుత్వం

నేషనల్ అసెంబ్లీ ప్రకటనతో ‘అన్ చార్టర్డ్ టెరిటరీ (గుర్తింపు లేని, అధికార రహిత ప్రాంతం)’గా వెనెజులా మారింది. అధికార, ప్రతిపక్షాలు సమాంతరంగా ప్రభుత్వాన్ని నడుపుతున్నాయి. గుయిడో ప్రభుత్వం విదేశీ అండతో నడుస్తోంది. అయితే దేశంలో జరిగే కార్యకలాపాలపై ఎలాంటి కంట్రోల్ ఉండదు. అయితే ఆర్మ్ డ్ ఫోర్సెస్ మద్దతుతో ఏర్పడే ప్రభుత్వమే కొనసాగే అవకాశం ఉంది. ఈ క్రమంలో మదురో వైపే మిలటరీ ఉంది.

గుయిడోకు విదేశాల మద్దతు


అమెరికా సహా బ్రెజిల్, కొలంబియా, చిలీ, పెరు, అర్జెంటీనా, కెనెడా దేశాలు గుయిడోకు మద్దతు ప్రకటించాయి. తటస్థంగా వ్యవహరించిన మెక్సికో.. వెనెజులాతో తమ సంబంధాల్లో ఎలాంటి మార్పు ఉండదని ప్రకటించింది. గయానా, సెయింట్ లూసియా కూడా న్యూట్రల్‌గా ఉన్నాయి. క్యూబా, బొలీవియా దేశాలు మదురో నేతృత్వంలోని సోషలిస్టు పార్టీ వైపు నిలిచాయి. టర్కీ కూడా మదురోను సపోర్టు చేసింది. వెనెజులా మిత్రపక్షంగా రష్యా కొనసాగుతోంది.

వ్యతిరేకత ఎందుకు?

ఆయిల్ ఎక్కువగా లభించే వెనెజులాలో మదురో హయాంలో పేదరికం బాగా పెరిగింది. ఆయిల్ రేట్లు పడిపోయాయి. రాబడి తగ్గిపోయింది. మాజీ ప్రెసిడెంట్ హ్యూగో చావెజ్ రూపొందించిన సోషల్ వెల్ఫేర్ ప్రోగ్రామ్స్ అన్నీ అటకెక్కాయి. దీంతో వెనెజులా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. అధిక ద్రవ్యోల్బణం కొనసాగుతోంది. ఆహార కొరత, ఉపాధి లేక లక్షలాది మంది వలస వెళ్లిపోతున్నారు. దీంతో కొద్దికాలంగా నిరసనలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి. తన చర్యలతో మదురో ఇంటా బయట ‘డిక్టేటర్’ అని పిలిపించుకుంటున్నారు.

గొడవల్లో 13 మంది మృతి

కారకాస్: వెనెజులాలోని కారకాస్‌లో గత మూడు రోజులుగా అధికార, ప్రతిపక్ష మద్దతుదారుల మధ్య జరిగిన గొడవల్లో దాదాపు 13 మంది చనిపోయాని రైట్ వింగ్‌నాయకులు చెప్పారు. కార కా స్, తైచారియా, బరినాస్, పోర్చుగ్యూసా, బొలివర్‌స్టేట్స్‌లో జరిగిన కాల్పుల్లో ఆం దోళన కారులు చనిపోయారన్నారు. ప్రెసిడెంట్ మదురోకు వ్యతిరేకంగా ప్రతి పక్ష నేత గాయిడో ఆధ్వర్యంలో జరుగుతున్న ర్యాలీని పోలీసులు అడ్డుకోవటంతో నిరసనకారులు ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు నిరసనకారులపై టియర్‌గ్యాస్‌ప్రయోగించి చెదరగొట్టేందుకు ప్రయత్నించగా.. ఆందోళనకారులు వారిపై రాళ్లు రువ్వారు. ఈ ఘర్షణల్లో మొత్తం 13 మంది చనిపోయారని నాయకులు చెప్పారు. కారకాస్‌లోని కమాండ్ పోస్ట్‌లో 27 మంది సైనికులు మదురోకు వ్యతిరేకంగా అందరూ వీధుల్లోకి రావాలని సోషల్ మీడియాలో పిలుపునిచ్చారు. దీంతో గొడవలు ప్రారంభమయ్యాయి.



వారికి వెనెజులాపై ఆశ

“కోల్డ్ వార్ సమయంలో లాటిన్ అమెరికా దేశాల్లో అమెరికా ఎలా జోక్యం చేసుకుందో అందరికీ తెలుసు. గ్రింగో (ఇంగ్లిష్ మాట్లాడే వాళ్లు)లను నమ్మకండి. అమెరికన్లకు మిత్రులు ఉండరు. నమ్మకాలు ఉండవు. వెనెజులా ఆయిల్, గ్యాస్, బంగారం దోచుకోవాలని ప్రయత్నిస్తున్నారు. మిత్రులారా నాకు మద్దతివ్వండి”

- వెనెజులా ప్రెసిడెంట్ నికోలస్ మదురో

సీబీఐ కేసు.. విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్‌సిక్రీ

న్యూఢిల్లీ: సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావును నియమించడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌విచారణ నుంచి జస్టిస్‌సిక్రీ తప్పుకున్నారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ ప్రారంభం కాగానే సిక్రీ తన నిర్ణయాన్ని ప్రకటించారు. అలోక్ వర్మను తొలగించిన హైపవర్‌సెలక్షన్ కమిటీలో తాను సభ్యుడిగా ఉన్నందుకు ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. ఈ కేసు విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.“ఈ విషయంలో నా పరిస్థితిని అర్థం చేసుకోండి.” అని పిటిషన్‌వేసిన ఎన్జీవో తరఫు న్యాయవాది దుష్యంత్‌దవేతో అన్నారు. హియరింగ్‌కు రాకముందే తప్పుకోవచ్చు కదా అని దవే సిక్రీని అడిగారు. కేసును విచారించాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, తాను విచారణకు హాజరు కాకుండా తన నిర్ణయాన్ని ప్రకటించకకూడదని సిక్రీ చెప్పారు. జస్టిస్‌సిక్రీ ఈ కేసును విచారించడంలో అభ్యంతరం లేదని లాయర్‌దవే, హాజరైన అటార్నీ జనరల్‌కె. కె. వేణుగోపాల్‌కోర్టుకు చెప్పారు.

జపాన్ ఆర్మీలో

వేలల్లో యువతులు

టోక్యో:

అకికో హిరయమ..22 ఏళ్ల జపాన్ అమ్మాయి... మొదటిసారిగా నేవీ షిప్ ఎక్కింది. షిప్‌లోని టార్పిడోలు, మిస్సైల్స్ ను చూసి ఆశ్చర్యపోయింది. ఆ తర్వాత కొన్ని రోజులకు ఆమె ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ గార్డుగా ఉద్యోగంలో చేరిపోయింది.

జపాన్ ఆర్మీ పనితీరు ఎలా ఉంటుందో ప్రజలకు తెలిసేలా నిర్వహించిన ఓ ప్రదర్శనకు హిరయమ అనుకోకుండా ఓసారి వెళ్లింది. ఆర్మీ చూపిన తెగువవల్ల తన కుటుంబం ఎలా ప్రాణాలతో బయటపడిందో చూద్దామని అనుకుంది. ఆరు నెలల కిందటే పెద్ద తుపానులో ఆమె సొంత టౌన్ ఒకయామ టౌన్ కొట్టుకుపోయింది. ఆ సమయంలో జపాన్ ఆర్మీ ఆమె కుటుంబాన్ని, స్నేహితుల్ని సాయం చేసి ప్రాణాలను కాపాడింది. ప్రదర్శన చూసినప్పుడు ఆర్మీలో చేరాలని హిరయమ నిర్ణయించుకుంది . ఇలా జపాన్ సైన్యంలో చేరుతున్న మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఆర్మీలో మొత్తం మూడు లక్షల మంది ఉన్నారు. ప్రపంచ శక్తిమంతమైన మిలటరీల్లో జపాన్ ఆర్మీది ఎనిమిదో స్థానం. దేశ భూభాగాన్ని కాపాడుకోవాలన్నదే ఆర్మీ ప్రధాన ఉద్దేశం. నార్త్ కొరియా, చైనాతో ఉద్రిక్తతలు పెరగడంతో ఈ డిఫెన్స్ ఫోర్స్ బలం ఏటేటా పెరుగుతూ వస్తోంది.

అర్హతల్లో సడలింపు:

వచ్చే 2065 నాటికి జపాన్ జనాభా 124 మిలియన్ల నుంచి 88కి తగ్గిపోతుందని అంచనావేస్తున్నారు. దీంతో కొత్తగా సైన్యంలో చేరేవారు కూడా తగ్గే అవకాశముందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్మీలో చేరే వయోపరిమితిని తగ్గించింది. ఒకప్పుడు 27 లోపు వయసుండేవాళ్లు మాత్రమే దీంట్లో చేరేందుకు అర్హులన్న నిబంధన ఉండేది. అయితే ఇప్పుడు 18 నుంచి 32 ఏళ్ల మధ్య ఎవరైనా చేరొచ్చనే సడలింపు ఇచ్చారు. అంతేకాదు అమ్మాయిలు కూడా ఆర్మీలో చేరేలా ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలను ఇస్తోంది.



సైన్యంలో మహిళలు

జపాన్:	6.1%
ఆస్ట్రేలియా:	16.5%
యూకే:	12.2%

జపాన్ మహిళలు ఒకప్పుడు సంప్రదాయసిద్ధమైన వృత్తులకే పరిమితమయ్యేవారు.అయితే 2013 నుంచి ప్రభుత్వం మిగిలిన అన్ని రంగాల్లో మాదిరిగానే సైన్యంలోనూ మహిళలు ఎక్కువమంది చేరాలా ఎన్నో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. మరీముఖ్యంగా మహిళలు చేరేలా వారికి ఎన్నో ప్రోత్సాహాలు ప్రకటించింది.మొదట్లో ఆర్మీలో నర్సులుగా మాత్రమే పనిచేయడానికి ఆడాళ్లకు అవకాశం ఉండేది. అయితే ఇప్పుడు సైన్యంలోని అన్ని విభాగాల్లోనూ వారిని తీసుకుంటున్నారు.

అమెరికాలోని బ్యాంకులో కాల్పులు.. ఐదుగురు మృతి

మయామి: అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. గురువారం ఫ్లోరిడా సెబ్రింగ్‌లోని సన్‌ట్రస్ట్ బ్యాంకులో దుండగుడు కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే చనిపోయినట్లు పోలీసులు చెప్పారు. బ్యాంకులోకి వెళ్లిన నిందితుడు ఇష్టమొచ్చినట్లు కాల్పులు జరిపాడు. అతడిని 21 ఏళ్ల జీపెన్‌జావర్‌గా గుర్తించామని, అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసు అధికారి కార్ల హోగ్లాండ్‌చెప్పారు. కాల్పులకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

ఆరు వారాల తర్వాత.. బొగ్గుగని కార్మికుడి మృతదేహం వెలికితీత

షిల్లాంగ్: మేఘాలయ బొగ్గుగనిలో చిక్కుకున్న 15 మంది కార్మికుల్లో ఒకరి మృతదేహాన్ని గురువారం వెలికితీశారు. ఘటన జరిగిన ఆరు వారాల తర్వాత ఎట్టకేలకు ఒకరి మృతదేహాన్ని వెలికితీసినట్లు అధికారులు చెప్పారు. సహాయక సిబ్బంది గతవారం ఒకరి మృతదేహాన్ని గుర్తించినా.. బయటికి తీసే సమయంలో అది జారీ మళ్లీ గనిలోకి పడిపోయింది. కాగా గురువారం కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని బయటికి తీసి పోస్ట్ మార్టంకు పంపినట్లు అధికారులు చెప్పారు. 370 అడుగుల లోతులో మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు చెప్పారు. మేఘాలయలోని జయంతియా హిల్స్‌సమీపంలోని బొగ్గు గనిలో 15 మంది కార్మికులు అక్రమంగా బొగ్గును తవ్వుతుండగా సమీపంలోని నది నుంచి నీరు గనిలోకి రావటంతో అందులోనే చిక్కుకుపోయారు.

రుణమాఫీ 1 3 రూపాయలే

- షాక్ లో మధ్య ప్రదేశ్ రైతులు
- సర్కార్ తీరుపై బీజేపీ ధ్వజం

భోపాల్:

రుణమాఫీ పై మధ్యప్రదేశ్ రైతుల ఆనందం ఎంతోసేపు నిలవలేదు. రెండు లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి కమల్ నాథ్ ప్రకటించారు. దీనికి సంబంధించిన సర్టిఫికెట్లను రైతులు అధికారులకు ఇచ్చారు. చివరకు తమ పేర్ల దగ్గర మాఫీ అయిన లోన్ అమౌంట్ ను చూసి వారు ఆశ్చర్యపోయారు. ఒక్కొక్క రైతుకు 13 రూపాయల వరకు మాఫీ చేసినట్లు అధికారుల నుంచి పత్రాలు అందాయి. అగర్ మాల్వా అనే గ్రామానికి చెందిన శివనారాయణ్, శివ్ లాల్ అనే రైతులకు 13 రూపాయలు మాఫీ చేసినట్లు వారి పేర్ల ఎదురుగా స్పష్టంగా రాసి ఉంది .దీంతో వీరిద్దరూ షాక్ తిన్నారు. తాను 20 వేల వరకు లోను తీసుకుంటే, కేవలం 13 రూపాయలే మాఫీ చేశారని శివనారాయణ్ మండిపడ్డాడు. పాతిక వేలు అప్పుగా తీసుకుంటే 13 రూపాయలే మాఫీ చేశారని శివలాల్ అనే మరో రైతు వాపోయాడు. ముఖ్యమంత్రి కమల్ నాథ్ అసెంబ్లీ సెగ్మెంట్ లోని అనేక గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. చాలా మందికి 13 నుంచి 232 రూపాయల వరకు మాత్రమే మాఫీ చేసినట్లు అధికారుల నుంచి పత్రాలు అందాయి. 13 రూపాయల రుణ మాఫీపై రాష్ట్ర ప్రభుత్వం పై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్ పార్టీ లోక్ సభ ఎన్నికల్లో దీనికి మూల్యం చెల్లించుకోక తప్పదని బీజేపీ సీనియర్ నేత గోపాల్ భార్గవ అన్నారు.

పొరపాట్లు సరి చేస్తాం : మంత్రి సచిన్ యాదవ్

కేవలం 13 రూపాయలనే మాఫీ చేయడం పొరపాటు వల్ల జరిగిందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి సచిన్ యాదవ్ చెప్పారు. సాంకేతిక సమస్యలు తలెత్తడం లేదా మానవ తప్పిదం వల్ల పొరపాట్లు జరిగి ఉండొచ్చని ఆయన చెప్పారు.



భవనం కూలి ఆరుగురు మృతి

గురుగ్రాం: హర్యానాలోని గురుగ్రాం జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న భవనం కుప్ప కూలింది. ఈ ఘటనలో ఆరుగురు కార్మికులు చనిపోయారు. మరో ఇద్దరు శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు అధికారులు చెప్పారు. గురువారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. శిథిలాల నుంచి ఆరు మృతదేహాలను వెలికి తీశారు. నిర్మాణంలో ఉన్న భవనంలో పనిచేసే కూలీలు రాత్రికి అక్కడే నిద్రపోయారు. అయితే గురువారం తెల్లవారుజామున ఒక్కసారిగా భవనం కుప్పకూలిపోవటంతో అందరూ శిథిలాల్లో చిక్కుకున్నారని అధికారులు చెప్పారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్, ఎన్డీఆర్ఎఫ్‌సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. భారీ ఇనుప కడ్డీలు, కాంక్రిట్ ఉన్నందు వల్ల శిథిలాలను తొలగించడంలో ఇబ్బందులు కలుగుతున్నాయని ఎన్డీఆర్ఎఫ్‌సిబ్బంది చెప్పింది.

జాన్‌పహాడ్ ఉర్సు షురూ





హుజూర్‌నగర్, వెలుగు : పాలకీడు మండలంలోని జాన్‌పహాడ్ సైదులు దర్గా ఉర్సు గురువారం షురూ అయింది. తెల్లవారుజామునే సైదులు బాబాను అలకరించారు. మొదట సిపాయి బాబాకి పూజలు చేసి అనంతరం కొవ్వొత్తుల హారతులతో పూజలు పట్టి హజ్రత్ సయ్యద్ మొహినుద్దీన్ షా, జాన్ పాక్ షహీద్ రహమతుల్లా సమాధులపై పూజారి జాని మోయినుద్దీన్ ఇంటి నుంచి తెచ్చిన గంధాన్ని ఎక్కించి ప్రార్థనలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తెచ్చిన, పూలు, దట్టీలనహ కప్పి సైదులుబాబాను అత్యంత సుందరంగా అలంకరించారు. నేడు జరగనున్న గంధం ఉత్సవానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు హాజరవుతారు. ఉర్సుకు శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీఆర్ఎస్ ఇన్‌చార్జి సైదిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు జానపహాడ్ దర్గా నిర్వాహకులు తెలిపారు.

27న సైనిక సంక్షేమ సభ

హైదరాబాద్, వెలుగు: తెలంగాణలోని మాజీ సైనికుల సంక్షేమ సభ ఈనెల 27న సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి రావుల రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రవెల్లి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించే సభకు రాష్ట్రంలోని మాజీ సైనికులు, సైనిక కుటుంబాలకు చెందిన వితంతువులు తరలిరావాలని కోరారు. రాజ్య సైనిక్ బోర్డ్ సమావేశాలు గత 22 సంవత్సరాలుగా జరగడం లేదని, జిల్లా సైనిక్ వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటైనా సమావేశాలు నిర్వహించడం లేదని, వెల్ఫేర్ కమిటీల పనితీరు సరిగాలేదన్నారు. అలాగే రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైనికుల సమస్యలపై ఈ సభలో చర్చించనున్నట్లు అందులో పేర్కొన్నారు.

వాహనం ఢీకొని జింక కాళ్లు విరిగాయి

సదాశివనగర్, వెలుగు : రోడ్డు ప్రమాదంలో జింకకు గాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని పద్మాజివాడి గ్రామ శివారులో రోడ్డు దాటుతున్న జింకను గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వా హనం ఢీకొట్టింది. ప్రమాదంలో జింక రెండు కాళ్లు విరిగాయి. గమనించిన గ్రామస్తులు వెంటనే పశువైద్యుడికి సమాచారం అందించి చికిత్స చేయించారు. అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని జింకను మెరుగైన వైద్యం కోసం కామారెడ్డికి తరలించారు. జింకను కాపాడిన గ్రామస్తులను అటవీశాఖ అధికారులు అభినందించారు.

బామ్మలకూ డ్యూటీలు






- రెండో విడత ఎన్నికల విధులకొచ్చిన వృద్ధులు

ఎల్కతుర్తి, వెలుగు : ముసలివాళ్లకు కూడా అధికారులు ఎన్నికల డ్యూటీలు వేశారు. వాళ్ల వయస్సు, ఆరోగ్యాన్ని చూడకుండా ఎన్నికల డ్యూటీలు వేయడం పట్ల అంతా ఆశ్చర్యపోతున్నారు. వరంగల్ అర్బన్ జిల్లాలోని భీమదేవరపల్లి మండలంలో రెండో విడత పంచాయతీ ఎన్నికలు శుక్రవారం జరుగనున్నాయి. గురువారం సిబ్బందికి సామాగ్రిని పంపిణీ చేశారు. ఐనవోలు మండలంలోని సింగారం అంగన్‌వాడీ టీచర్ సీతాదేవి, వరంగల్‌లోని అబ్బనికుంటలో అంగన్‌వాడీ టీచర్ కె.పద్మకు ఎన్నికల డ్యూటీలు వేశారు. వీరిద్దరు వృద్ధులే. పద్మ తానొక్కతే డ్యూటీ చేయలేక కొడుకును తోడుగా తెచ్చుకుంది. వయస్సును చూడకుండా, ఎన్నికల సామాగ్రిని కూడా మోయలేని వారికి డ్యూటీలు వేయడం సరైందికాదని ఉద్యోగులు అంటున్నారు. భీమదేవరపల్లి హైస్కూల్‌లో ఎన్నికల సిబ్బందికి సామాగ్రిని పంపిణీ చేశారు. డ్యూటీలు పడ్డవారంతా అక్కడికి చేరుకోవడంతో సందడి నెలకొంది. సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించలేదు. కూర్చునేందుకు కుర్చీలను ఏర్పాటు చేయలేదు. కొంత మంది చెట్ల కింద, మరి కొందరు మెట్లమీద కూర్చునే ఎన్నికల సామాన్లు సర్దుకున్నారు.

ముగ్గురు అటవీశాఖ అధికారుల సస్పెన్షన్

నిజామాబాద్, వెలుగు: కలప స్మగ్లర్లతో చేతులు కలిపి విలువైన అటవీ సంపదను అక్రమార్కులకు దోచిపెట్టిన ముగ్గురు అధికారులపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఆదిలాబాద్ నుంచి నిజామాబాద్ జిల్లాకు భారీ స్థాయిలో కలపను తరలిస్తూ జిల్లాకు చెందిన పలువురు నిందితులు నిర్మల్ రూరల్ పోలీసులకు ఇటీవల రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. వీరిలో ఏఆర్ ఎస్సై కూడా ఉన్నారు. నిందితులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు తీగ లాగడంతో డొంకంతా కదిలింది. ఈ విషయంపై సీఎం కేసీఆర్ సీరియస్ గా స్పందించడంతో నాలుగు రోజులుగా నిజామాబాద్ నగరంలోని సామిల్లులు, టింబర్ డిపోలతో పాటు జిల్లాలో పలుచోట్ల అటవీ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. కలప స్మగ్లింగ్ వ్యవహారంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ చైర్మన్ ఫయీమ్ ప్రధాన పాత్రధారిగా గుర్తించారు. ఈ స్మగ్లింగ్ గురించిన సమాచారం నిజామాబాద్ జిల్లా అటవీ అధికారులకు గత ఏడాది మేలోనే అందినా నిర్లక్ష్యం వహించారు. విచారణ కూడా చేయలేదని తేలింది. దాంతో నిజామాబాద్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి టి. వేణు బాబు, ఫారెస్ట్ రేంజ్ అధికారి బి.రవి మోహన్ భట్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఏ.శ్రీనివాస్ పై ఉన్నతాధికారులు వేటు వేశారు. ఉన్నతాధికారుల దృష్టిలో మరికొందరు అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. శాఖపరంగా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు, సిబ్బందిపై కూడా ఉన్నతాధికారులు విచారణ చేసి వేటు వేస్తున్నారు. గత రెండు వారాల్లో మొత్తం ఎనిమిది మంది సిబ్బందిని ఇలా సస్పెండ్ చేశారు. అందులో నలుగురిని పోలీసులు అరెస్ట్ కూడా చేశారని ఉన్నతాధికారులు తెలిపారు.



ఓటాన్ అకౌంట్..

రూ.1,085 కోట్లివ్వండి

- ఉమ్మడి పాలమూరులో పెండింగ్‌లో ప్రాజెక్టు బిల్లులు
- పనుల్లో వేగం పుంజుకోకుంటే జులై నాటికి పూర్తవడం కష్టమే
- నిధులు కోరుతూ ప్రతిపాదనలు పంపిన అధికారులు

గద్వాల, వెలుగు :

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సాగు నీరందించడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టింది. అయితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బిల్లులు చెల్లించకపోవడంతో ప్రాజెక్టుల పనులు కాస్త నెమ్మదించాయి. ఆర్థికశాఖ నుంచి ఎల్ఓసీ రాక నాలుగు నెలలుగా ప్రాజెక్టుల కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేయడం లేదు. ఫిబ్రవరి నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతుండడంతో పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు పనుల వేగిరానికి నిధులు కేటాయించాలని నీటిపారుదల శాఖ ఇంజినీర్లు ప్రతిపాదనలు పంపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులతో పాటు, పాత ప్రాజెక్టుల నిర్వహణకు కనీసం రూ. 1085 కోట్లు కేటాయించాలని అభ్యర్థించారు. జిల్లాలో ఉన్న మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, జవహర్ నెట్టెంపాడు, రాజీవ్ భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాల పరిధిలో 7.55 లక్షల ఎకరాల ఆయకట్టుకు 2019 ఖరీఫ్‌లో సాగునీటిని అందించేలా పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యం. ఈ ప్రాజెక్టులకు పెండింగ్ బిల్లుల సమస్య వెంటాడుతోంది. రూ. 259.93 కోట్ల బకాయిలు ఉన్నాయి. దీంతో ఈ ప్రాజెక్టులలో ఉన్న ప్యాకేజీలలో పనులు వేగం పుంజుకోవడం లేదు. పనులు చేయకుంటే కాంట్రాక్టు ఒప్పందాలను మార్చుతామని గతంలో ఇంజినీర్లు ఇచ్చిన తాఖీదులకు విలువ లేకుండా పోయింది. బకాయిలు చెల్లించండి, పనులు చేస్తామనేలా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారు.

అసంపూర్తిగా పనులు

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం నుంచి రెండు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాల్సి ఉండగా గత ఖరీఫ్‌లో కేవలం లక్షా 20 వేల ఎకరాలకు మాత్రమే అందించారు. అలాగే భీమా ఎత్తిపోతల పథకంలో పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేసినా కాల్వల్లో ఇంకా పెండింగ్ పనులు ఉండడంతో లక్ష్యం నెరవేరలేదు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో రెండు లక్షల ఎకరాలు, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకంలో 30 వేల ఎకరాలకు మించి నీటిని అందించడం లేదు. ఫిబ్రవరి నెలలోనే బిల్లుల చెల్లింపులు పూర్తి చేసి, పనుల వేగాన్ని పెంచకపోతే మార్చి నెలలో సార్వత్రిక ఎన్నికల కోడ్ మళ్లీ అడ్డంకిగా మారే అవకాశముంది.

ప్రాజెక్టుల వారీగా ఇలా..

వేసవిలోనే పనులకు నిధుల అవసరం ఎక్కువ కాబట్టి ఫిబ్రవరి నెలలో ప్రవేశపెట్టె ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని ఇంజినీర్లు నివేదికలో పేర్కొన్నారు. కల్వకుర్తి ప్రాజెక్టుకు రూ. 550 కోట్లు, నెట్టెంపాడుకు రూ. 160 కోట్లు, భీమా ప్రాజెక్టుకు రూ. 130 కోట్లు, కోయిల్‌సాగర్ ఎత్తిపోతలకు రూ. 43 కోట్లు, రాజోలి బండ నీటి మళ్లింపు పథకం, అందులోనే ఉన్న తుమ్మిళ్ల ఎత్తిపోతల పనులకు కలిపి రూ. 50 కోట్లు, జూరాల ప్రాజెక్టు నిర్వహణ, భూసేకరణ చెల్లింపులకు కలిపి రూ. 50 కోట్లు, కోటిపల్లి వాగు పథకానికి రూ. 2 కోట్లు, సంగంబండ పథకానికి రూ. 14 కోట్లు, ఇతర నిర్వహణ ఖర్చులకు రూ. 85 కోట్లు కేటాయించాలని ఇంజినీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

రూ. కోట్లలో కరెంట్ బకాయిలు

ఎత్తిపోతల పథకాలకు వినియోగించిన విద్యుత్‌కు సంబంధించిన బిల్లులు సైతం బకాయి పడ్డారు. కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన బకాయిలకే నిధుల కొరత ఉండడంతో విద్యుత్ బకాయిల చెల్లింపులు చేయాలని ప్రతిపాదించలేదు. కల్వకుర్తి ఎత్తిపోతల విద్యుత్ బకాయి రూ. 777.49 కోట్లు, నెట్టెంపాడు రూ. 104.70 కోట్లు, భీమా ఎత్తిపోతల విద్యుత్ బకాయి రూ. 68.82 కోట్లు ఇలా మొత్తం రూ. 951.01 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. వీటి చెల్లింపులు ఎలా ఉన్నా నిర్మాణ పనులకు ఇబ్బందులు రాకుండా నిధులు ఇస్తే చాలని, ప్రాజెక్టు పూర్తికి ప్రయత్నిస్తామని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

> **వచ్చే ఖరీఫ్‌లో పూర్తి ఆయకట్టుకు నీళ్లు**
>
> పాలమూరు జిల్లాలో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులుగా ఉన్న కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల నుంచి వచ్చే ఖరీఫ్‌లో పూర్తి స్థాయి ఆయకట్టుకు సాగునీటిని అందిస్తాం. ప్రాజెక్టుల వారీగా పనుల ప్రాధాన్యం ఆధారంగా లక్ష్యాలను నిర్ణయించాం. సాగునీటి విడుదలకు అవసరమైన పనులు చేసేందుకు నిధుల కొరత రానివ్వం. పనులు చేయడంలో ఇబ్బంది పెట్టేవారిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. కొన్ని ప్యాకేజీలలో పనుల విభజన చేసి వేగాన్ని పెంచాలని నిర్ణయించాం. అలాగే తుమ్మిళ్ల ఎత్తిపోతలలోనూ రెండో స్టేజి పనులు ప్రారంభిస్తాం. గట్టు ఎత్తిపోతల పథకం పనులకు శ్రీకారం చుడతాం.
>
> – ఖగేందర్, ప్రాజెక్టుల సీఈ

మల్లాపూర్‌లో ఏం జరిగింది?

సర్పంచ్ ఏకగ్రీవంపై అధికారుల విచారణ

మెట్‌పల్లి, వెలుగు: జగిత్యాల జిల్లా మల్లాపూర్లో సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నిక వ్యవహారం ఎన్నికల కమిషన్ చేతిలోకి వెళ్లింది. ఈ పంచాయతీలో తెరాస బలపరిచిన అభ్యర్థి సందిరెడ్డి శ్రీనివాసరెడ్డి, క్యాతం జీవన్ రెడ్డి , ఆకుతోట నర్సయ్య, గోపిడి రాజిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు బలపరిచిన అభ్యర్థి శ్రీనివాసరెడ్డి బరిలో ఉంటాడని అనుకుంటున్న సమయంలో ఎవరూ ఊహించని పరిణామాలు జరిగాయి. గోపిడి రాజిరెడ్డి, నర్సయ్య వారి నామినేషన్లు విత్ డ్రా చేసుకున్నారు. అందరినీ షాక్‌కు గురిచేస్తూ శ్రీనివాస్ రెడ్డి సైతం నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో బరిలో నిలిచిన జీవన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలపడంతో దుమారం చెలరేగింది. ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు బలపరిచిన అభ్యర్థి నామినేషన్ విత్ డ్రా చేసుకోవడంతో తెరాస నాయకులు, మద్దతు తెలిపిన పలు కుల సంఘాలు 6 రోజులుగా భగ్గుమంటున్నాయి. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి సర్పంచు ఎన్నికకు వేలంపాటలో చిట్టీలు వేసుకొని డ్రా ద్వారా సర్పంచు పదవిని ప్రత్యర్థికి అమ్ముకున్నాడని శ్రీనివాసరెడ్డిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భయభ్రాంతులకు గురి చేసి నామినేషన్ విత్ డ్రా చేసుకోవాలని బెదిరించారని ఆకుతోట నర్సయ్య జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు. మరోవైపు ఏకగ్రీవాన్ని రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ యువజన సంఘాల నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఆ క్రమంలో వెంకట్ రెడ్డి అనే యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య యత్నం చేశాడు. మిగతా యువకులు స్పందించి అడ్డుకోవడంతో అతనికి ప్రాణాపాయం తప్పింది. మరికొందరు యువకుకు వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలియజేశారు. ఈ వ్యవహారం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో జాయింట్ కలెక్టర్ రాజేశం, జిల్లా పంచాయతీ అధికారి గురువారం మల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. తుది నివేదికను జిల్లా కలెక్టర్, ఎన్నికల కమిషన్ కు నివేదిస్తామన్నారు.



కరెంట్ తీగలకు తాకి తగలబడ్డ కంటైనర్

డ్రైవర్‌మృతి

సంగారెడ్డి, వెలుగు: ప్రమాదవశాత్తు కరెంట్‌వైర్‌కు కంటైనర్ తగిలి డ్రైవర్ మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట సమీపంలోని ఎంఆర్ఎఫ్ టైరు పరిశ్రమ వద్ద గురువారం జరిగింది. సీఐ సురేందర్‌రెడ్డి వివరాల ప్రకారం తమిళనాడు రాష్ట్రానికి చెందిన కంటైనర్ డ్రైవర్ మరియప్పన్ (45) చెన్నయ్ నుంచి ఎంఆర్ఎఫ్‌టైరు పరిశ్రమకు రబ్బర్‌లోడ్‌తో వచ్చాడు. పరిశ్రమ పక్కన పార్కింగ్‌చేస్తుండగా ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో వాహనం దగ్ధమైంది. అందులో ఉన్న డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సదాశివపేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సింగరేణికి సోలార్ పవర్

భద్రాద్రికొత్తగూడెం, వెలుగు :



- కంపెనీ అవసరాల కోసం తొలివిడత నాలుగు ప్లాంట్ల ఏర్పాటు
- రూ. 534 కోట్లతో పనులు చేపట్టనున్న బీహెచ్ఈఎల్

దేశంలోని బొగ్గు పరిశ్రమల్లో సింగరేణి సంస్థ మొట్ట మొదటిసారి సోలార్ విద్యుత్ ప్లాంట్లను ప్రారంభిస్తోంది. ఇప్పటికే సింగరేణి విద్యుత్ రంగంలోకి అడుగుపెట్టింది. కొత్తగా ఇండస్ట్రియల్ కరెంటు బిల్లుల ఖర్చును తగ్గించుకునేందుకు సోలార్ పవర్ మీద దృష్టి పెట్టింది. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో విస్తరించిన కోల్‌బెల్ట్‌లో రూ.1300 కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ప్లాన్ చేశారు. మొదటి దశలో ఇల్లెందు, రామగుండం, ఎస్టీపీపీ, మణుగూరు ఏరియాల్లో విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సింగరేణి టెండర్లను పిలిచింది. ఈ టెండర్ దక్కించుకున్న బీహెచ్ఈఎల్‌తో అక్టోబర్ నాటికి మొదటి దశ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా ఒప్పందం చేసుకుంది. ఇల్లెందు ఏరియాలో 128 మెగావాట్లు, రామగుండంలో 50 మెగావాట్లు, ఎస్టీపీపీలో 10 మెగావాట్లు, మణుగూరులో 30 మెగావాట్ల ప్లాంట్లను నిర్మిస్తారు. ఇందుకోసం రూ. 534 కోట్లను ఖర్చు చేస్తారు. కొత్తగూడెంలో 37 మెగావాట్లు, ఇల్లెందులో 10 మెగావాట్లు, భూపాలపల్లిలో 10 మెగావాట్లు, మందమర్రిలో 43 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు రెండోదశలో ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. ఇల్లెందు ఏరియాలో జేకే5 ఓపెన్‌కాస్టు ప్రాంతంలో, మణుగూరులో శివలింగాపురం ప్రాంతంలో ఐదు ఎకరాల చొప్పున భూమిని సోలార్ ప్లాంట్ల కోసం యాజమాన్యం కేటాయించింది. బీహెచ్ఈఎల్ ఆఫీసర్లు కూడా ఇటీవలే ఆ స్థలాలను పరిశీలించారు. ఒకటి రెండు నెలల్లో మొదటి దశ సోలార్ ప్లాంట్ల పనులు ప్రారంభమవుతాయని, అక్టోబర్ నాటికి పూర్తి చేస్తారని సింగరేణి అధికార ప్రతినిధి ఏ ఆనందరావ్, ఈఅండ్ఎం జీఎం రామారావ్ చెప్పారు. ఇండస్ట్రియల్ కరెంటు వినియోగంలో ఖర్చు ఎక్కువ అవుతుందని, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైతే యూనిట్‌కు రూ. 2 వరకు ధర తగ్గే అవకాశం ఉందని అన్నారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియను కంపెనీ సీఎండీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు. సోలార్ విద్యుత్‌ను పూర్తిగా సింగరేణి సొంత అవసరాలకోసమే వినియోగించుకోనున్నట్టు చెప్పారు.

క్విక్ బైట్స్



యాదాద్రి రాబడి దాదాపు కోటి

యాదాద్రి, వెలుగు : యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహ్మా స్వామి దివ్యక్షేత్రంలోని హుండీలను గురువారం లెక్కించారు. దేవాలయ మండపంలో దేవాలయ సిబ్బంది భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. గత 28రోజులకుగానూ హుండీ ఆదాయం రూ.95,69,892లు, 80గ్రాముల బంగారం, 3.55కిలోల వెండి లభించినట్టు దేవస్థాన ఈవో గీతారెడ్డి తెలిపారు.



పొక్లెయినర్‌ను తగలబెట్టిన మావోయిస్టులు

ఏటూరునాగారం, వెలుగు : జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం(నూగూరు) మండలం సూరవీడు గ్రామ సమీపంలో గురువారం రాత్రి మావోయిస్టులు ఒక పొక్లెయినర్‌ను తగలబెట్టారు. సూరవీడు గ్రామ సమీపంలోని కామిని చెరువుకు సంబంధించిన కాలువ పనులు చేయడానికి వచ్చిన పొక్లెయినర్‌ను తగలబెట్టిన మావోయిస్టులు అక్కడ సీపీఐ మావోయిస్టుల పేరిట కరపత్రం వదిలినట్లు సమాచారం. సంఘటన రాత్రి వేళలో జరగడంతో పూర్తి వివరాలు శుక్రవారం తెలిసే అవకాశం ఉంది. కాగా వెంకటాపురం(నూగూరు) మండలంలో శుక్రవారం గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న సమయంలో ఈ సంఘటన జరగడంతో మన్యం ప్రాంతం ఉలిక్కిపడింది.



అన్నదానానికి రూ.50,116 విరాళం

భద్రాచలం, వెలుగు : శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి కృష్ణా జిల్లాకు చెందిన భక్తులు రూ.50,116 గురువారం అందజేశారు. కృష్ణా జిల్లాకు చెందిన కే వెంకటేశ్వరరావు, నాగమణి దంపతులు స్వామి వారి అన్నదాన పథకానికి ఖర్చు చేయాలని కోరుతూ దేవస్థానం సూపరింటెండెంట్‌కు ఇచ్చారు. కాగా సికింద్రాబాద్‌లోని చీఫ్ ట్రాఫిక్‌మేనేజర్ కే వెంకట్రావ్ రామయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.



'సెస్' ఎటుపోయిందో

ఆర్టీసీలో అభివృద్ధి పేరుతో ప్రతీ టికెట్పై ఒక రూపాయి సెస్ వసూలు చేస్తున్నారు. దీని ద్వారా వచ్చిన నిధులను బస్టాండ్ల అభివృద్ధికి కేటాయిస్తామని ఆర్టీసీ యాజమాన్యం గతంలో ప్రకటించింది. అయితే కొన్నేళ్లుగా సెస్ వసూలు చేస్తున్నప్పటికీ బస్టాండ్ల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. మరి సెస్ ద్వారా వచ్చిన సొమ్మంతా ఎటు వెళ్తోందో ఆర్టీసీ ఆధికారులకు, యాజమాన్యానికే తెలియాలి.

ఖమ్మం టౌన్, వెలుగు :

- ప్రతీ టికెట్పై రూపాయి సెస్
- బస్టాండ్ల అభివృద్ధికే వినియోగిస్తామన్న ఆర్టీసీ
- మచ్చుకైనా కనిపించని అభివృద్ధి

ఖమ్మం జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లి, మధిర డిపోలున్నాయి. ఈడిపోల పరిధిలోనే తిరుగుతున్న బస్ల ద్వారా ఆర్టీసీకి రోజుకు రూ.లక్ష వరకు సెస్ ద్వారా వసూలవుతోంది. ప్రతీ ప్రయాణికుడి వద్ద నుంచి టికెట్ ధరతోపాటు సెస్ అంటూ రూపాయి అధికంగా వసూలు చేస్తున్నారు. అత్యధిక డిపోల్లో ఆర్టీసీ నష్టాల్లో నడుస్తుండడంతో వాటి మునుగడకే ఎక్కువ నిధులు ఖర్చవుతున్నాయని, బస్టాండ్ల అభివృద్ధి సాధ్యం కావడంలేదన్న సాకుతో ఆర్టీసీ యాజమాన్యం సెస్ బాదుడుకు తెరలేపింది. దీంతో ప్రయాణికులు అదనంగా మరో రూపాయి చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే ఈ నిధులన్నీ దేనికి ఖర్చు చేస్తున్నారో తెలియకుండా ఉంది. అసలు ఆర్టీసీ యాజమాన్యమైనా లెక్కలు వేస్తోందో లేదో.. తెలియని పరిస్థితి. సెస్ రూపంలో డిపోల ఆధ్వర్యంలో ఎంత వసూలైంది. ఖమ్మం రీజియన్లో ఏడాదికి ఎంత సెస్ వసూలైంది. ఆ నగదును ఎందుకోసం ఖర్చు చేశారనే వివరాలు ఆర్టీసీ అధికారులు తెలపాల్సిన అవసరం ఉంది. అభివృద్ధికి నోచుకోని బస్టాండ్లు ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, వైరా, తల్లాడ, సత్తుపల్లి, మధిర బస్టాండ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. మౌలిక సదుపాయాలు సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సెస్తో ఈ బస్టాండ్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. దాదాపు అన్ని బస్టాండ్లలో పరిస్థితి ఆధ్వానంగా ఉంది. ఇక మరుగుదొడ్ల పరిస్థితి చెప్పలేం. బస్టాండ్లను అభివృద్ధి చేసి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. అయితే ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం డిపోలకు సంబంధించి ప్రతీ రోజు రూ.89వేలు సెస్ రూపంలో వస్తోంది. వచ్చిన మొత్తాన్ని హైదరాబాద్కు పంపిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. సెస్ రూపంలో ప్రయాణికులను బాదినా అభివృద్ధికి బస్టాండ్లు ఎందుకు దూరంగా ఉన్నాయో తెలియకుండా ఉంది.

బీసీలకు న్యాయం చేయాలి: జాజుల

న్యూఢిల్లీ, వెలుగు: వర్సిటీల నియామకాల్లో బీసీలకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్గౌడ్ అన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్కు విరుద్ధంగా కేంద్రం కొత్త పాలసీని అమలు చేస్తోందన్నారు. దీనివల్ల కేంద్రీయ, వర్సిటీల ఉద్యోగాల భర్తీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం జరుగుతోందని గురువారం ఢిల్లీలో చెప్పారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్, బోధన సిబ్బంది ఉద్యోగాల్లో ఒక వర్సిటీని కాకుండా డిపార్టుమెంట్ను యూనిట్గా తీసుకొని ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్ వర్గాలకు న్యాయం చేయకపోతే ఫిబ్రవరి 12న కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ఇంటిని ముట్టడిస్తామని తెలిపారు.

మెదక్ నుంచి ప్రియాంక పోటీచేయాలి: జగ్గారెడ్డి

హైదరాబాద్, వెలుగు: కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకలో ఇందిరా గాంధీని, పార్టీ చీఫ్ రాహుల్లో రాజీవ్గాంధీని చూసి జనం వాళ్లు వచ్చినట్టే ఫీలవుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చెప్పారు. ప్రియాంక రాక పార్టీకి అదనపు బలం ఇస్తుందన్నారు. 'రాహుల్ మంచి వ్యూహకర్త. ఆయన సమర్థతకు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్ ఎన్నికల ఫలితాలే నిదర్శనం' అని గురువారం మీడియాతో అన్నారు. రాహుల్, ప్రియాంక ఇద్దరిలో ఎవరు మెదక్ లోక్సభ నుంచి పోటీచేసినా గెలుపు ఖాయమన్నారు. తెలంగాణ ఇచ్చిన కుటుంబం కాబట్టి వారు పోటీచేస్తే సీఎం కేసీఆర్ సహకరించి ఏకగ్రీవమయ్యేలా చూడాలని కోరారు.



విద్యార్థినులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ

మన అమ్మాయిలకు ఎన్నెన్నో ఇచ్చాం

హోం మంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, వెలుగు: ఆడపిల్లల ఆత్మగౌరవానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని హోం మంత్రి మహమూద్అలీ అన్నారు. వారికి అన్నిరంగాల్లో అవకాశాలు కల్పించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ గురువారం ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహమూద్ అలీ ప్రసంగించారు. ఉమ్మడి ఏపీలో కంటే, తెలంగాణ ఏర్పాటు తర్వాతే ఆడపిల్లల హక్కులు, సంరక్షణ, భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 18 ఏళ్లు నిండిన అమ్మాయిల వివాహ ఖర్చు కోసం కల్యాణలక్ష్మి, షాదిముబారక్ల పేరిట రూ.లక్షా 16 వేలు అందిస్తున్నామన్నారు. ఆడపిల్లల చదువుపైనా దృష్టి సారించామని, ఇందుకోసం తెలంగాణవ్యాప్తంగా 500 రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభించామని చెప్పారు. దాదాపు 24 వేల మంది మైనార్టీ అమ్మాయిలు రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుతున్నారన్నారు. తర్వాత పలువురు విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. చైల్డ్ లైన్కు సంబంధించిన యూనిఫాం, కరపత్రాల పోస్టర్లను ఆవిష్కరించారు.

'వక్ఫ్' కేసులపై కఠినంగా వ్యవహరించండి

వక్ఫ్ బోర్డు భూముల కేసులపై కఠినంగా వ్యవహరించాలని పోలీసులను హోంమంత్రి మహమూద్ అలీ గురువారం ఆదేశించారు. కొందరు వ్యక్తులు తప్పుడు ధ్రువ పత్రాలతో ఆ భూముల్ని ఆక్రమించుకుంటున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని వక్ఫ్ కేసులు పోలీసులతో ముడిపడి ఉన్నాయని కూడా చెప్పారు.

ప్రైవేటుకు డిఫెన్స్ ఇవ్వొద్దు: తమ్మినేని

హైదరాబాద్, వెలుగు: రక్షణ రంగ ప్రైవేటీకరణ ప్రయత్నాలను కేంద్రం వెంటనే విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో ఈనెల 23 నుంచి మూడ్రోజుల పాటు దేశవ్యాప్తంగా ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మెకు సీపీఎం మద్దతిస్తున్నట్లు చెప్పారు. ఏడు దశాబ్దాలుగా 75 శాతం రక్షణరంగ ఉత్పత్తులను మన దేశసంస్థలే ఉత్పత్తి చేశాయని, ప్రస్తుతం ప్రైవేటీకరణ, ఔట్సోర్సింగ్ ద్వారా స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగుల భద్రతతో పాటు రక్షణ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడం సిగ్గుచేటన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న డిఫెన్స్ ప్రొక్యూర్మెంట్ పాలసీ వల్ల 42 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, 52 డీఆర్డీఓ ల్యాబ్స్, 9 ఆర్మీ ఆధారిత వర్క్షాప్స్, ఇంజనీరింగ్ సర్వీస్ వర్క్షాప్స్, మిలటరీ ఫామ్స్, డిఫెన్స్ ప్రొడక్షన్స్ సంస్థలన్నీ బలహీన పడుతున్నాయన్నారు.

కాంట్రాక్టు టీచర్లకు జీతాలు పెంచాలి

విద్యామండలి ఎదుట సెల్ఫ్ఫైనాన్స్ టీచర్ల ధర్నా

హైదరాబాద్, వెలుగు: సెల్ఫ్ఫైనాన్స్ కోర్సుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులందరికీ జీవో నెంబర్ 11 ప్రకారం వేతనాలు చెల్లించాలని లెక్చరర్లు ఆందోళనకు దిగారు. గురువారం ఉన్నత విద్యామండలి కార్యాలయం ఎదుట సెల్ఫ్ ఫైనాన్స్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యాపకులు ధర్నా నిర్వహించారు. 'రాష్టంలో 11 వర్సిటీల్లో 1500 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పని చేస్తున్నారు. జీవో 11 ప్రకారం 600 మందికే వేతనాలు పెంచారు. మిగిలిన 900 మందికీ వేతనాలు పెరిగేలా అధికారులు చర్యల తీసుకోవాలి' అని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిట్యాల రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలి చైర్మన్ పాపిరెడ్డికి వినతిపత్రం అందించారు. యూనియన్ నాయకులు కిరణ్, స్వప్న, ధర్నాలో పాల్గొన్నారు.

ఎవరి ఓదార్పులు అక్కర్లేదు

హైదరాబాద్, వెలుగు:

- ఆ కూపాల నుంచి బయటపడ్డ పిల్లల వద్దకు ఎవరినీ పంపకండి: హైకోర్టు



యాదగిరిగుట్టలో వ్యభిచార కూపం నుంచి బయట పడిన పిల్లలను సంరక్షణ గృహాల్లోనే ఉండాలని, ఈ కేసు దర్యాప్తులో ఉన్నందున వారిని చూసేందుకు ఎవరినీ అనుమతించవద్దని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. యాదగిరిగుట్టలో పిల్లలతో వ్యభిచారం చేయిస్తున్నారని పత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటోగా పరిగణించి కోర్టు విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గురువారం హైకోర్టు మరోసారి కేసును విచారించింది. సంరక్షణ గృహాల్లోని పిల్లలను ఓదార్చేందుకో, ఇతరత్రా సాకులు చెప్పి ఎవరైనా సందర్శకులు వస్తే వారిని అనుమతించరాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. పలువురు స్థానిక నేతలు పిల్లల్ని కలుసుకొని ఓదారుస్తున్నారని, మానసికంగా గాయపడిన వారిని ఎవరు పడితే వారు కలిస్తే ఎలాగని ప్రజ్వల అనే స్వచ్ఛంద సంస్థ బెంచ్ దృష్టికి తెచ్చింది. పిల్లల్ని కలిసేందుకు వీల్లేదని చెబితే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని తెలిపింది. ఇకపై అలాంటివి జరిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని, వీటిపై పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బెంచ్ ఆదేశించింది. సంరక్షణ గృహాల్లోని బాలికలను కలిసేందుకు ఎవరెవరిని అనుమతించారో సీల్డ్ కవర్లో నివేదిక ఇవ్వాలని రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల బాలల సంక్షేమ కమిటీలను ఆదేశించింది.

ప్రొఫెసర్ల కొరతను తీర్చండి

ప్రభుత్వానికి హెల్త్ కేర్ రిఫామ్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, వెలుగు: ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్ల కొరత తీర్చాలని హెల్త్ కేర్ రిఫామ్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. గురువారం ఆ సంఘం నేతలు వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతికుమారిని కలిసి సమస్యలను వివరించారు. త్వరలో రిటైర్ కానున్న 50 మంది మెడికల్ కాలేజీల ప్రొఫెసర్లను తాత్కాలిక ప్రాతిపదికన విధుల్లో కొనసాగించాలని కోరారు. గతంలోనూ ప్రొఫెసర్లను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రొఫెసర్ల కొరతను తీర్చకుంటే పలు విభాగాల్లో పీజీ సీట్లు కోల్పోవాల్సి వస్తుందన్నారు.

రైల్వే నిర్వహణలో టెలికమ్యూనికేషన్ కీలకం

హైదరాబాద్, వెలుగు: రైల్వే నిర్వహణలో టెలికమ్యూనికేషన్ పాత్ర ఎంతో కీలకమైందని, రైల్వే సిగ్నలింగ్ విశ్వసనీయతకు చిహ్నమని రైల్వే బోర్డు డైరెక్టర్ జనరల్ ఎన్ కాశీనాథ్ అన్నారు. ఇండియన్ రైల్వే ఇన్స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్స్ (ఇరిసెట్)లో ఐఆర్ఎస్ఎస్ఈ 2016బ్యాచ్ ప్రొబెషనరి ఆఫీసర్ల పాసింగ్ ఔట్లో గురువారం ఆయన పాల్గొన్నారు. 25 మంది ప్రొబెషనరి ఆఫీసర్లకు పాసింగ్ ఔట్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ఓపెన్కాస్ట్ మైనింగ్పై ఎన్జీటీ విచారణ

హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఓపెన్కాస్ట్ మైనింగ్ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గురువారం విచారించింది. జిల్లాలోని కాకతీయ గని2లో పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా బ్లాస్టింగ్స్ జరుపుతున్నారని, పేలుళ్లతో సమీపంలోని నివాసాలు దెబ్బతింటున్నాయని రాజలింగమూర్తి అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. ఈ గనిలో నిబంధనలు పాటించటం లేదని కేంద్ర పర్యావరణ శాఖ కూడా నివేదిక ఇచ్చిందని పిటిషనర్ తరపు న్యాయవాది శ్రావణ్ కూమార్ తెలిపారు. మైనింగ్ నిలిపివేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ మరో అప్లికేషన్ దాఖలు చేయగా ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. కేసు విచారణ త్వరలోనే పూర్తి చేస్తామని, మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదని బెంచ్ పేర్కొంది. తదుపరి విచారణను ఫిబ్రవరి 8కి వాయిదా వేసింది.

అందుబాటులోకి 200 మంది డాక్టర్లు

హైదరాబాద్, వెలుగు:

- 2017 ఆగస్టులో ఎంపికైనవారికి 29,30న వెబ్ ఆప్షన్లు
- కోర్టు కేసుతో ఆలస్యమైన నియామకం



జిల్లా ఆస్పత్రుల్లో వైద్యుల కొరత త్వరలో తీరనుంది. 200 మంది డాక్టర్లు అందుబాటులోకి రానున్నారు. రెండేళ్లుగా పోస్టింగుల కోసం వేచిచూస్తున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ల నియామక ప్రక్రియను వైద్య విధాన పరిషత్ పూర్తి చేసేందుకు సిద్ధమైంది. ఈ నెల 29, 30 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించింది. సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టుల భర్తీకి టీఎస్పీఎస్సీ 2017లో నోటిఫికేషన్ జారీ చేసింది. రాతపరీక్ష, ఇంటర్వ్యూలు పూర్తి చేసి ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆరు నెలల క్రితమే వైద్య విధాన పరిషత్కు ఇచ్చింది. అయితే 9 మంది కోర్టుకు వెళ్లడంతో నియామక ప్రక్రియకు బ్రేక్ పడింది. కోర్టుకు వెళ్లినవారిలో ఆరుగురికి వెబ్ ఆప్షన్ల అవకాశం కల్పించగా, మరో ముగ్గురిని కోర్టు పెండింగ్లో ఉంచింది. ఈ కేసు కోర్టులో పాక్షికంగా సద్దుమణగడంతో నియామక ప్రక్రియను పూర్తి చేయాలని వైద్య విధాన పరిషత్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



బాలికల సాంస్కృతిక ప్రదర్శన

ఆడపిల్లల తల్లులకు సన్మానం

కలెక్టర్ ఎం.రామ్మోహన్ రావు

నిజామాబాద్, వెలుగు:

ఈ రోజుల్లో ఆడపిల్ల పుడితేనే బాధపడే తల్లిదండ్రులున్నారని, అలాంటిది ముగ్గురు ఆడపిల్లలను కని ప్రేమగా పెంచుతున్న తల్లులు ఆదర్శనీయులని జిల్లా కలెక్టర్ ఎం.రామ్మోహన్ రావు అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ, ఐఎంఏ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో గురువారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు ఆడపిల్లలున్న తల్లులను కలెక్టర్ సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో ఎన్నో రంగాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, సాంకేతికంగా విప్లవాత్మక అభివృద్ధి సాధిస్తున్నామన్నారు. విద్యాపరంగా ఎంతో ఎదిగామని, మహిళలు పురుషులతో సమానంగా వివిధ రంగాల్లో దూసుకుపోతున్నారని అన్నారు. దురదృష్టవశాత్తు మహిళలపై ఇంకా వివక్ష కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో పురుషుల కంటే మహిళల జనాభాయే అధికంగా ఉండటం శుభపరిణామమన్నారు. చదువులకు దూరంగా ఉంచిన వారిని చేరదీసి చదువు చెప్పించాలని సూచించారు. బేటీ పడావో .. బేటీ బచావో ఉద్దేశం కూడా అదేనని అన్నారు. బాలికలు, మహిళల రక్షణకు ఉద్దేశించి చేసిన చట్టాల అవసరం రాకుండా చూడాలన్నారు. ఇందుకు కుటుంబం, స్కూల్, ఆఫీస్ల నుంచే మార్పునకు శ్రీకారం చుట్టాలన్నారు. రాష్ట్రంలో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ వంటి పథకాలు బాల్య వివాహాలను నిరోధించడానికి తోడ్పడుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లా సంక్షేమ అధికారిణి స్రవంతి, డీఈవో దుర్గాప్రసాద్, ఐఎంఏ అధ్యక్షులు డా. కవితారెడ్డి , జ్యోతి, తారాచంద్, రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

'నిథమ్'లో ఉపాధి శిక్షణకు దరఖాస్తులు

హైదరాబాద్, వెలుగు: ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ (నిథమ్) ఆఫర్ చేస్తున్న షెఫ్ ట్రైనింగ్, పంచకర్మ ఆయుర్వేద స్పా శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం భూక్యా తెలిపారు. షెఫ్ ట్రైనింగ్కు పదో తరగతి, పంచకర్మ స్పా శిక్షణకు ఇంటర్ పాసై ఉండాలన్నారు. గ్రామీణుల వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలలోపు ఉన్న35 ఏళ్ల లోపు వయస్సున్న యువత శిక్షణకు అర్హులన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని నిథమ్లో, సంబధిత జిల్లా కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కాంట్రాక్టు టీచర్లకు వేతనాలు పెంచాలి

- విద్యామండలి ఎదుట సెల్ఫ్ఫైనాన్స్ టీచర్ల ధర్నా

హైదరాబాద్, వెలుగు: సెల్ఫ్ఫైనాన్స్ కోర్సుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులందరికీ జీవో నెంబర్ 11 ప్రకారం వేతనాలు చెల్లించాలని లెక్చరర్లు ఆందోళనకు దిగారు. గురువారం ఉన్నత విద్యామండలి కార్యాలయం ఎదుట సెల్ఫ్ ఫైనాన్స్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యాపకులు ధర్నా నిర్వహించారు. "రాష్టంలో 11 వర్సిటీల్లో 1500 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారు. జీవో 11 ప్రకారం 600 మందికే వేతనాలు పెంచారు. మిగిలిన 900 మందికీ వేతనాలు పెరిగేలా అధికారులు చర్యల తీసుకోవాలి"అని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిట్యాల రాజు డిమాండ్ చేశారు.

గురుతులు చెరిగిపోతున్నయ్

కోరుట్ల, వెలుగు:



- ఆనవాళ్లు కోల్పోతున్న పురాతన బురుజులు, కోనేరు
- పట్టించుకోని పురావస్తు, మున్సిపల్ శాఖల అధికారులు

శిథిలమవుతున్న బురుజు ద్వారం

రాజుల కాలం నాటి ప్రాచీన కట్టడాలు.. భవిష్యత్ తరాలకు సజీవ సాక్ష్యాలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. చాళుక్యులు, జైనుల కాలం నాటి చారిత్రక కట్టడాలైన కోరుట్లలోని గడి బురుజులు, కోనేరు ప్రస్తుతం ఆనవాళ్లు కోల్పోయే స్థితిలో ఉన్నాయి. రాజులు పాలించిన సమయంలో ఈ ప్రాంతాన్ని కొరవట్టుగా పిలిచినట్లు.. క్రమేపీ కోరుట్లగా మారిందని చరిత్ర చెబుతోంది. కాగా, ఈ గడి గురుజులు కోరుట్ల పట్టణానికి పెట్టని కోటలుగా నిలిచాయి. వీటి పరిరక్షణకు పురావస్తు, మున్సిపల్ శాఖల అధికారులు ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. కోరుట్ల పట్టణంలోని కాల్వగడ్డ ప్రాంతంలో ఏళ్ల నాటి నుంచి కూరగాయాల మార్కెట్ నడుస్తోంది. ఈ ప్రాంతంలో కోట బురుజులు, ఒక కోనేరు నిర్మించారు. వీటిలో రెండు కోట బురుజులు శిథిలావస్థకు చేరుకోగా మిగిలినవి రెండు కోట బురుజులపై భాగంలో చెట్లు మొలిచి దెబ్బన్నాయి. వీటికి సమీపంలో ఉన్న రాతితో కోనేరును నిర్మించారు. ఇది ప్రస్తుతం చెత్తా చెదారంతో నిండిపోయి ఆనవాళ్లు కూడా కోల్పోతోంది. పరిసర ప్రాంతంలోని స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి.

పరిరక్షణ చర్యలు శూన్యం

కీ.శ.1024లో కోరుట్ల పట్టణంలోని కాల్వగడ్డ ప్రాంతంలో బురుజులు, కోనేరును అప్పటి వేములవాడ చాళుక్య రాజులు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. వీటి సమీపంలో అతిపురాతన మహాదేవస్వామి ఆలయాన్ని సైతం నిర్మించారు. ఈ ఆలయ శిలాశాసనాలు కూడా చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. వీటి పరిరక్షణకు పురావస్తు, మున్సిపల్ శాఖల అధికారులు ఇప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కాగా, కోట బురుజుల చిహ్నాన్ని కోరుట్ల మున్సిపల్ పాలకవర్గాలు కొంత కాలంగా అధికారిక చిహ్నంగా వినియోగించుకున్నారు. కానీ, పాలకులు కాని, పురావస్తు శాఖ అధికారులు గాని వీటి పరిరక్షణకు చర్యలు తీసుకోలేదు. కోట బురుజుల పరిరక్షణకు అఖిలపక్ష నాయకులు, స్థానికులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు అందించినా ఎలాంటి ప్రయోజనం దక్కలేదు. ఇప్పటికైనా ఏళ్ల నాటి కట్టడాలు, చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిన కోట బురుజులు, కోనేరు పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, పురావస్తు, మున్సిపల్ శాఖల అధికారులు చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఓటేస్తానని..



ఓటు.. విలువ కట్టలేనిది. ఓటుకి ఏ నోటూ సరి తూగదు. దాన్ని ఏ నేతకూ అమ్ముకోవద్దు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల చదువును, గుణగణాలను చూసి ఓటేయండి. పార్టీల మేనిఫెస్టోలను, హామీలను ఓటనే భూతద్దంలో చూశాకే ఒక నిర్ణయానికి రండి. ఓటు కోసం డబ్బులు ఇచ్చినవారు, తీసుకున్నవారు ఇద్దరూ క్రిమినల్ కేసు కింద కోర్టుకి సమాధానం చెప్పాల్సి ఉంటుంది. దానికన్నా ముందు మీ మన స్సాక్షికి జవాబు చెప్పుకోండి. మీకు మీరే సాక్షి. మీకు మీరే జడ్జి. మీ తీర్పు మీరే ఇవ్వండి. ముద్దాయిగా నిలబడకండి.

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాలో ప్రజలే పాలకులు. మన ఓటుతో మనలో ఒక సమర్థుణ్ని లీడర్‌ని చేద్దాం. ప్రజాస్వామ్య ఫలాలను మనమే అనుభవిద్దాం. ఓటర్ల లిస్టులో మన పేరుందో లేదో ముందుగానే చెక్ చేసుకుందాం. పోలింగ్ కేంద్రానికి వెళ్లిన తర్వాత ఓటు లేక బాధపడటం కంటే ఇంటర్నెట్‌లోనో, ఇంట్లో కూర్చొని సెల్‌ఫోన్‌లోనో ఓటర్ల జాబితాను ఒక్కసారి చూసుకుందాం. నా ఓటెందుకు తీసేశారని ఆఫీసర్ల మీద కోప్పడటం కాదు. నా ఓటు ఉందా? లేదా? అని తెలుసుకోవాలనే ముందుచూపు ప్రదర్శించాలి.

పంచాయతీ ఎన్నికలు పూర్తికావస్తున్నాయి. త్వరలో లోక్‌సభకు, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఎలక్షన్లు జరగనున్నాయి. 18 ఏళ్లు నిండినా ఇంకా ఓటు హక్కు లేనివాళ్లు, ఓటు కోసం అప్లై చేయనివాళ్లు కనీసం ఇప్పుడైనా కదలండి. బాధ్యత గల పౌరుడిగా వ్యవహరించండి. టీచర్లు స్టూడెంట్స్‌కి, పేరెంట్స్ పిల్లలకు, చదువుకున్నవాళ్లు చుట్టుపక్కల అందరికీ ఓటు విలువ గురించి చెప్పండి. ఓటేస్తానని.. ప్రమాణం చేయండి. చేయించండి.


ఒక వ్యక్తికి ఒకటి కన్నా ఎక్కువ చోట్ల ఓటు లేకుండా చూడాలి. ఈ మేరకు ఆధార్ నంబర్‌తో లింక్ చేయాలి. పంచాయతీ ఎన్నికల నుంచి ప్రెసిడెంట్ ఎలక్షన్ల వరకూ ఒక్క ఓటు విలువెంతో వెల్లడైన సందర్భాలు ఎన్నో. ఆ ప్రాధాన్యతను దేశవ్యాప్తంగా చాటిచెప్పటానికి ఎన్నికల సంఘం ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా.. ప్రజాస్వామ్య పరిరక్షణకు నా వంతుగా మంచి నాయకుణ్ని ఎన్నుకుంటానని ఓటర్లుగా నేడు ఒక తీర్మానానికి వద్దాం.

జాతి, కుల, మత, ప్రాంత, లింగ, భాషా భేదాలకు అతీతంగా ప్రజలందరికీ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరం పొందుదాం. వాడుకుందాం. మన దేశంలో స్థానిక సంస్థలు మొదలుకొని చట్టసభల వరకు దేనికి పోలింగ్ జరిగినా ఓటర్లందరూ పాల్గొనటం కోసం ప్రభుత్వం సెలవు ప్రకటిస్తోంది. ఓటు ద్వారా దేశ భవిష్యత్‌ను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలకు మన జీవితాలను, తలరాతను మార్చే పవర్ ఉంది. సామాన్యుడి చేతిలో శక్తిమంతమైన ఆయుధం ఓటు. ఆ ఓటు హక్కును జాగ్రత్తగా వినియోగించి సమాజానికి మేలు చేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకుందాం. పాలన సజావుగా సాగాలన్నా, సరైన నేతలకు పగ్గాలు ఇవ్వాలన్నా అది ఓటు ద్వారానే సాధ్యం.

(నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా..)

– కాళంరాజు వేణుగోపాల్, టీచర్

పేరుకే ‘ఆమె’ ప్రెసిడెంట్



పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన ఆడవాళ్లు పేరుకే ప్రెసిడెంట్‌గా ఉంటున్నారు. పెత్తనమంతా భర్తలే చేస్తున్నారు. స్త్రీలకు రిజర్వ్ చేసిన గ్రామ పంచాయతీల్లో వాళ్లను నిలబెట్టి గెలిపించే మగవాళ్లు తన భార్యకో, తల్లికో, చెల్లికో అధికారాన్ని కట్టబెట్టడానికి ఆ పని చేయట్లేదు. తన పలుకుబడి పోకూడదని, తప్పనిసరై పోటీ చేయిస్తున్నారు. విజయం సాధించిన తర్వాత వాళ్లను సంతకాలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు. పదవి ద్వారా వచ్చిన పవర్‌ని స్వయంగా వాడుకునేలా సహకరించటంలేదు. పంచాయతీ కార్యాలయంలోనో, మండల పరిషత్ ఆఫీసులోనో జరిగే మీటింగ్‌లకు వెంటబెట్టుకొని తీసుకెళుతున్నారు తప్ప మిగతా సమయాల్లో ఇంటికే పరిమితం చేస్తున్నారు. నేరుగా ఊరి జనంతో మాట్లాడి సొంత నిర్ణయాలు తీసుకునే ఛాన్స్ ఇవ్వట్లేదు. ప్రెసిడెంట్ హోదాను, గౌరవాన్ని, సౌకర్యాలను అనధికారికంగా భర్తలే పొందుతున్నారు. వార్డు మెంబర్ నుంచి మొదలుపెడితే ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, జెడ్పీపీ.. ఇలా ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి పదవుల వరకు ఇదే తతంగం సాగుతోంది. ఒక్కోసారి అధికారిక సమావేశాల్లోనూ ఈ షాడోలే హల్‌చల్ చేస్తున్నారు. కొన్ని చోట్ల వాళ్ల చర్యలను ఆఫీసర్లూ అడ్డుకోలేని పరిస్థితి. ఇది ఇలాగే కొనసాగితే, పదవులు పేపర్లకే పరిమితమైతే మహిళా సాధికారత ఎలా సాధ్యం?. సర్పంచ్ స్థానాలను స్త్రీలకు రిజర్వ్ చేయటంలో రూల్స్ ఎంత కచ్చితంగా పాటిస్తున్నారో అలాగే ఆ పదవీ బాధ్యతలను, అధికారాలను ఆడవాళ్లే నిర్వర్తించేలా ప్రభుత్వం పర్యవేక్షించాలి. మహిళల హోదాలను అడ్డుపెట్టుకొని పెత్తనం చెలాయిస్తున్న మగవాళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. పదవుల నిర్వహణలో ఆడవాళ్లకు అవగాహన కల్పించాలి. మగవాళ్ల జోక్యాన్ని నివారించాలి. స్త్రీలకు నిజమైన అధికారం అందేలా చూడాలి. ఆడవాళ్లకు ఇచ్చిన పదవులను, వాటి ఫలాలను, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను వాళ్లే పొందేలా చేయటం ద్వారానే మహిళలకు న్యాయం, సాధికారత సాధ్యం. నియమాలను, నిబంధనలను తూతూ మంత్రంగా భావిస్తే స్త్రీల ప్రయోజనాలు ఎప్పటికీ నెరవేరవు.

- శ్రీనివాస్ గుండోజు



‘శాంతి’ చెల్లింపుల్లో.. సమితి ఫెయిల్

శాంతి పరిరక్షణ కార్యక్రమాల్లో (పీస్ కీపింగ్ మిషన్స్‌లో) పాల్గొన్న దేశాలకు పేమెంట్లు ఇవ్వకపోవటంపై ఐక్యరాజ్యసమితిని ఇండియా నిలదీసింది. పిల్లి మెడలో గంట కట్టే పనిని ధైర్యంగా, విజయవంతంగా పూర్తి చేసింది. ముఖ్యంగా ఇథియోపియా, రువాండా వంటి కొన్ని నిరుపేద దేశాలకు పెద్దఎత్తున బకాయి పడటాన్ని మన దేశం గట్టిగా ప్రశ్నించింది. ఈ అంతర్జాతీయ సంస్థలో సభ్యత్వం కోసం ఇథియోపియా, రువాండా కట్టాల్సిన వార్షిక చందాలతో పోల్చితే ఆ రెండు దేశాలకు సమితి రుణ పడ్డ చెల్లింపులు 100-200 రెట్లు ఎక్కువ ఉండటం గమనార్హం. ఇది ఆర్థిక సమస్యలతో ఇబ్బందిపడుతున్న దేశాలకు శాపంగా మారిందని సమితిలోని ఇండియా శాశ్వత ప్రతినిధి సయద్ అక్బరుద్దీన్ ఆవేదన వ్యక్తం చేశారు.

లోటు బడ్జెట్

యూఎన్ఓ పీస్ కీపింగ్ బడ్జెట్‌లో భారీ (2 బిలియన్ డాలర్ల) లోటు నెలకొందని యూఎన్ఓ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ అన్నారు. ఈ మేరకు ఆయన ఈ నెల 11న సమితి సభ్య దేశాలకు లేఖ రాశారు. 2019 జనవరి 1 నాటికి యూఎన్ఓ.. పీస్ కీపింగ్ బడ్జెట్‌కి 776 మిలియన్ డాలర్లు సమకూర్చాల్సి ఉంది. సమితి చరిత్రలో ఇలా డబ్బులు లేని పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదు. యూఎన్ఓ ఆధ్వర్యంలోని మిషన్లకు భద్రతా దళాలను పంపే దేశాలు పేమెంట్లు రాక దివాలా దీస్తున్నాయని ఇండియా ఆందోళన వెలిబుచ్చింది. అత్యంత ప్రమాదకర ఘర్షణ ప్రాంతాల్లో పీస్ కీపింగ్ సర్వీస్‌కు అధికంగా చెల్లించాలనే ఒప్పందాన్ని తుంగలో తొక్కటంపై అభ్యంతరం తెలిపింది. దీనిపై సభ్య దేశాలు తక్షణం దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది.

మన మాటకు ఎంతో విలువ

శాంతి పరిరక్షణ అంశంపై మన దేశం వ్యక్తం చేసే అభిప్రాయాలకు ప్రపంచ దేశాలు ఎంతో విలువనిస్తాయి. పీస్ కీపింగ్ కోసం ఇండియా గతంలో ఎంతో కృషి చేసింది. భద్రతా దళాలను భారీగా పంపింది. యూఎన్ఓ మిషన్స్‌లో పెద్దఎత్తున పాల్గొంది. ఇప్పుడూ అదే లక్ష్యంతో ఉంది. శాంతి పరిరక్షణ కార్యక్రమాలకు సమితి వద్ద ఇప్పుడు రెండు నెలలకు మాత్రమే సరిపోను డబ్బులు ఉండటం బాధాకరమని అక్బరుద్దీన్ తెలిపారు. ఈ ప్రభావం ఇథియోపియా వంటి దేశాలపై నేరుగా పడుతోందని వెల్లడించారు. ఇథియోపియా 2018లో అన్ని దేశాల కన్నా ఎక్కువగా 7,597 మంది సోల్జర్లను సమితి కార్యక్రమాలకు కేటాయించింది. 6,528 మంది ట్రూప్‌లను పంపిన రువాండా మూడో స్థానంలో నిలిచింది.

ఈ మేరకు యూఎన్ఓ ఇథియోపియాకి 30 మిలియన్ డాలర్లు, రువాండాకు 20 మిలియన్ డాలర్లు ఇవ్వాల్సి ఉంది. ఈ అమౌంట్లు సమితికి ఇథియోపియా వందేళ్లు, రువాండా రెండు వందల ఏళ్లు కంట్రిబ్యూషన్‌గా ఇవ్వాల్సిన బడ్జెట్‌తో సమానమంటే ఆశ్చర్యం కలగకమానదు. యూఎన్ఓలో సభ్యత్వం కోసం వివిధ దేశాలు చెల్లించాల్సిన చందాను జీఎన్‌పీ, ఎక్స్‌టర్నల్ డెబ్ట్, పర్ క్యాపిటా ఇన్‌కంతోపాటు ఇతర ఎకనమిక్ ఇండికేటర్ల ఆధారంగా లెక్కిస్తారు. ఇథియోపియా తనకు ఇవ్వాల్సిన యాన్యుయల్ (2019) బిల్లును 2,78,823 డాలర్లుగా, రువాండా చెల్లించాల్సిన బిల్లును 83,647 డాలర్లుగా సమితి అసెస్ చేసింది. యూఎన్ఓ ‘హానర్ రోల్’లో ఉన్నందున రువాండా తన డ్యూస్‌ని ముందుగానే క్లియర్ చేసింది.

రూల్స్ ఇతరులకేనా?

శాంతి పరిరక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి సైనికుడికి సమితి నెలకు 1,428 డాలర్లు చెల్లిస్తుంది. దీన్ని యూఎన్ఓ జనరల్ అసెంబ్లీ అప్రూవ్ చేస్తుంది. పీస్ కీపింగ్ ఆపరేషన్స్‌లో పాల్గొనటాన్ని డెవలపింగ్ కంట్రీస్ ప్రెస్టేజీగా, లాభదాయకంగా భావిస్తాయి. సమితి వద్ద డబ్బు దండిగా ఉండి, పేమెంట్లు రెగ్యులర్‌గా వస్తుంటే ఆయా దేశాలు ఇలాగే ఫీలవుతాయి. కానీ, రీయింబర్స్‌మెంట్ నెలల తరబడి నిలిచిపోతే వాటిపై ఆర్థిక భారం పెరుగుతుంది. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి మార్గాలను వెతకాల్సి ఉందని ఇండియా ప్రతినిధి అక్బరుద్దీన్ సూచించారు. ఏదైనా సభ్య దేశం సమితికి రెండేళ్ల పాటు కంట్రిబ్యూషన్ చెల్లించకపోతే ఓటింగ్ పవర్‌ని కోల్పోతుంది. రూల్స్‌ని యూఎన్ఓ అంత కఠినంగా అమలుచేస్తోంది. సభ్య దేశాలకు తాను చేయాల్సిన చెల్లింపుల్లో మాత్రం ఇంత నిక్కచ్చిగా ఉండట్లేదు. ఈ విషయాన్నే ఇండియా ప్రతినిధి ప్రస్తావించారు.

పీస్ కీపింగ్ అరియర్స్ గురించి మన దేశం ఇలా మాట్లాడుతుండటం ఇన్‌డైరెక్ట్‌గా అమెరికాకు ఇబ్బందికరంగా మారింది. ఎందుకంటే ఈ నేరంలో ప్రధానంగా నిందించాల్సింది అగ్ర రాజ్యాన్నే అనే విషయం గమనార్హం. సమితి వద్ద ఇటీవలి కాలంలో చాలా విషయాల్లో మన దేశం అమెరికాతో జట్టు కట్టింది. కీలక సమయాల్లో ఆ దేశానికి అనుకూలంగా ఓటేసి గట్టెక్కించింది. కానీ, ఈ విషయంలో అలా కాదు. శాంతి పరిరక్షణ బడ్జెట్‌లో 28 శాతాన్ని అమెరికానే సమకూర్చాలి. అగ్రరాజ్యం ప్రస్తుతం యూఎన్ఓ పీస్ కీపింగ్ బడ్జెట్‌కి 776 మిలియన్ డాలర్లు, రెగ్యులర్ బడ్జెట్‌కి 381 మిలియన్ డాలర్లు ఇవ్వాల్సి ఉంది.

అమెరికా వల్లే..

యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్, రిపబ్లికన్ పార్టీ సంస్కరణల పేరిట సమితిని నవ్వుల పాల్జేశారు. శాంతి పరిరక్షణ బడ్జెట్‌కి 28 శాతం బదులు 25 శాతమే ఇస్తామని యూఎన్ఓలో ఆ దేశ రాయబారి నిక్కీ హేలీ గత ఏడాది మార్చిలో చెప్పారు. ఒక్క దేశంపైనే ఇంత భారం మోపటం సరికాదని అన్నారు. ఆమె ఈ అంశాన్ని ప్రస్తావించే నాటికి ఒక దేశం 25 శాతం వరకే బడ్జెట్ ఇవ్వాలనే సీలింగ్ ఏమీ లేదు. ఈ మేరకు ఒప్పందం కూడా కుదుర్చుకోలేదు. ఏదేమైనా అగ్రరాజ్యం ఇకపై ఇవ్వనున్న డబ్బుల్లో 3 శాతం కోత పడనుంది. డ్యూస్‌ని మాత్రం 28 శాతం ఆధారంగానే చెల్లించాలి. యూఎస్ చెబుతున్న సంస్కరణలు విలువైనవే కావొచ్చు. కానీ, ప్రస్తుతం అమల్లో ఉన్న 14 శాంతి పరిరక్షణ కార్యక్రమాలు కొనసాగేందుకు సభ్య దేశాలు సహకరించాలి.

- సీమా సిరోహి (‘ది వైర్’ సౌజన్యంతో)

మన దేశానికి ఎంత రావాల్సి ఉంది?

ఐక్య రాజ్య సమితి నుంచి మన దేశానికి 2017 పద్దు కింద 55 మిలియన్ డాలర్లు, 2016 అకౌంట్‌లో భాగంగా 62 మిలియన్ డాలర్లు రావాల్సి ఉంది. ఈ విషయంలో ఇతర దేశాలతో పోల్చితే ఇండియా కాస్త బెటర్ పొజిషన్‌లోనే ఉంది. 2016లో యూఎన్ఓ అన్ని దేశాలతో పోల్చితే ఇండియాకే అత్యధికంగా బకాయి పడింది. మన దేశం ఇథియోపియా, రువాండా తరపున వకాల్తా పుచ్చుకోవట్లేదు. అన్ని దేశాలకూ జరుగుతున్న అన్యాయం గురించే మాట్లాడుతోంది. ఇది ఆఫ్రికా దేశాలకు కూడా ఒక ఫ్రెండ్లీ సిగ్నల్‌నే పంపుతోంది. నిజం చెప్పాలంటే ఇప్పుడు కొన్ని దేశాలు ‘కూటమి ఏర్పాటు’ పేరుతో సమితి వద్ద గేమ్స్ ఆడుతున్నాయి. ఈ ఆటలో ఆఫ్రికా ఖండ దేశాలు చైనా వైపు మొగ్గుచూపుతున్నాయి.



సెల్ఫీ ఆఫ్ ది ఇయర్.. తర్వాత ?

హాలీవుడ్ సినిమాల థీమ్స్‌ని, కాన్సెప్ట్‌లని, స్క్రిప్టులని బాలీవుడ్ కాపీ కొట్టడం కొత్తేమీ కాదు. వింతేమీ లేదు. మనవాళ్లు సినిమాల్ని కాపీ కొడతారుగానీ, అక్కడివాళ్లలా నిర్భయంగా మాట్లాడే లక్షణాన్ని మాత్రం అందిపుచ్చుకోలేదు. సినిమాల్లో హీరోలు.. నీతి, న్యాయం, స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేస్తుంటారు. మరి వాస్తవ ప్రపంచంలోని అవకతవకలపై మాత్రం ఎందుకు స్పందించకూడదు?



జనవరి ఇంకా పోనేలేదు. అప్పుడే ‘సెల్ఫీ ఆఫ్ ది ఇయర్’గా వైరల్ అయిందీ ఫొటో. ప్రధాని మోడీ చుట్టూ బాలీవుడ్ పర్సనాలిటీలు నిలబడి చిరునవ్వులు చిందిస్తున్న పిక్‌ను మెయిన్ స్ట్రీమ్ మీడియా సైతం హైలైట్ చేసింది. వీళ్లంతా ముంబై నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లి, పీఎంని కలవటానికి గల కారణాన్ని డైరెక్టర్ కరణ్ జోహార్ ట్విటర్‌లో వివరించారు. పవర్‌ఫుల్, టైమ్లీ సంభాషణ గొప్ప మార్పు తీసుకురాగలవని అభిప్రాయపడ్డారు. ప్రధానితో మీటింగ్ అపురూపమైన అవకాశమంటూ పోస్టును ప్రారంభించిన కరణ్.. బాలీవుడ్ కమ్యూనిటీగా దేశ నిర్మాణం(నేషన్ బిల్డింగ్)లో పాలు పంచుకుంటామని, సానుకూల మార్పును ప్రేరేపించడంలో ముందుంటామని ముగించారు.

హాలీవుడ్‌లో ఇలా ఉండదు..

ఇలాంటి దృశ్యాన్నే హాలీవుడ్‌లో ఊహించండి. డొనాల్డ్ ట్రంప్‌ను సపోర్ట్ చేస్తున్నట్లు ఏ మెర్లీ స్ట్రీపో, జార్జ్ క్లూనీనో, యాన్ హాత్‌వే, మిషెల్ మూర్ లాంటి హేమాహేమీలు ఫొటోలు దిగుతారా? చాలా కష్టం. ఎందుకంటే నాయకుల తీరును గానీ, ప్రభుత్వాల నిర్ణయాలను గానీ విమర్శించడంలో హాలీవుడ్ ఎప్పుడూ ముందే ఉంటుంది. అబార్షన్ విషయంలో ట్రంప్ కామెంట్లను నటి మెర్లీ స్ట్రీప్ గట్టిగా ఖండించారు. యాక్టర్ జార్జ్ క్లూనీ.. మెక్సికన్ వలసదారుల పిల్లల్ని ట్రంప్ ప్రభుత్వం బలవంతంగా జైళ్లలో ఉంచడాన్ని తప్పుపట్టారు. హీరోయిన్ క్రిస్టీన్ బెల్.. ట్రంప్ ఇమిగ్రేషన్ పాలసీకి వ్యతిరేకంగా సంతకాలు చేయాలంటూ తన ఫ్యాన్స్‌కి పిలుపునిచ్చారు. ‘ఈ నిరంకుశ ప్రెసిడెంట్‌ని చట్టపరంగా అదుపులో ఉంచాలి’ అంటూ మరో నటి మియా ఫారో ప్రకటన చేశారు. ‘స్టార్‌వార్స్’ ఫేమ్ మార్క్ హామిల్ ఓ పొలిటిక్ (పిల్లల్ని బందీలుగా మార్చుతున్న ట్రంప్) కార్టూన్‌ను షేర్ చేశాడు.

చిన్నప్పటి నుంచి మనం చూస్తున్న సినిమాల్లో హీరోలు.. నీతి, న్యాయం, స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేస్తుంటారు. మరి నిజ ప్రపంచంలో అవకతవకలపై ఎందుకు స్పందించకూడదు!. బాలీవుడ్ నటుల్లో హీరోయిజం, ధైర్యం, ప్రశ్నించే లక్షణాలు పూర్తిగా తెర వరకే పరిమితమైపోయాయి. సొంత కమ్యూనిటీకే చెందిన నసీరుద్దీన్ షా లేదా తనూశ్రీ దత్తా లాంటివాళ్లు తీవ్ర స్థాయిలో వేధింపులు ఎదుర్కొంటున్నా బాలీవుడ్‌లోని మిగతావాళ్లు పట్టించుకోరు. వివేక్ అగ్నిహోత్రి లాంటి కొందరైతే నోరు తెరిచిన వాళ్లను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు.

ముందుగా ఈ పని చేయండి..

దేశ నిర్మాణంలో భాగం పంచుకుంటామంటున్న కరణ్ జోహార్ బృందం.. ముందుగా దేశాన్ని కాపాడుకునే పని మొదలుపెడితే మంచిదని నా ఉద్దేశం. వ్యవస్థల్ని కాపాడుకునే ప్రయత్నాలకు బాలీవుడ్ గొంతుక కావాలి. ఇండియాలో డెమొక్రటిక్, ఎకనమిక్, సోషల్, జ్యుడిషియల్ సెక్టార్లలో జరుగుతున్న సిస్టమాటిక్ డ్యామేజ్ గురించి కరణ్ జోహార్ బృందానికి తెలియదని అనుకోలేం. రైతుల ఆత్మహత్యలు, జర్నలిస్టులపై దాడులు, మాబ్ లించింగ్‌లు, మత ఘర్షణలు, కుల వివక్షల వార్తల్ని సినిమా వాళ్లు చూడరని భావించలేం. మరి ఇలాంటి బర్నింగ్ ఇష్యూలపై వాళ్లెందుకు మాట్లాడరు?

ఈ టాపిక్‌కి సంబంధించి మాజీ ఐఏఎస్ అధికారి హర్ష్ మందిర్ తన ‘లుకింగ్ ఎవే’ బుక్‌లో చక్కటి విశ్లేషణ రాశారు. సినిమాలు మొదటి నుంచీ ‘ఈక్వాలిటీ’ ఐడియాను ప్రమోట్ చేస్తూ వచ్చాయి. తొలినాళ్లలోనే రైతు సమస్యలు, భూమి హక్కులు, ఫ్యాక్టరీల్లో కార్మికుల ఉద్యమాలు లాంటి సబ్జెక్టులతో హక్కుల పోరాటాలను హైలైట్ చేసే సినిమాలొచ్చాయి. ఒంటరి పేద మహిళ ఎన్ని కష్టాలు పడ్డా భూమి కోసం చేసే పోరాటాన్ని ‘మదర్ ఇండియా’(1957) సినిమాలో చూశాం. 1953 నాటి ‘దో బిగా జమీన్’లో భూమి కోల్పోయిన బాల్‌రాజ్ సాహ్ని రిక్షా పుల్లర్‌గా మారతాడు. ‘శ్రీ420’ సినిమాలో రాజ్‌కపూర్ ఫుట్‌పాత్‌పై జీవించే వ్యక్తిగా కనిపిస్తాడు.

సబ్జెక్టులు మారుతున్నాయి..

కాలం మారినకొద్దీ సబ్జెక్టులు మారిపోయాయి. ఇప్పుడొస్తున్న హిందీ సినిమాలను ఇండియా గురించి తెలియని ఫారినర్లు చూస్తే ఇక్కడసలు పేదలు గానీ, పేదరికం గానీ లేవేమోనన్న భ్రమలో పడతారు. సినిమాల నిండా ధనవంతుల క్యారెక్టర్లే. దినసరి కూలీలు, కార్మికుల క్యారెక్టర్లు పాపులర్ సినిమాలకు ఎప్పుడో దూరమయ్యాయి. ఈ మార్పును సక్సెస్‌ఫుల్‌గా సాగిన ‘వేర్పాటు ప్రక్రియ’గా అరుంధతీ రాయ్ అభివర్ణిస్తారు. ఎక్కువగా సినిమాలు చూసే మిడిల్, అప్పర్ మిడిల్ క్లాస్ వర్గాలు తమనుతాము ఉన్నత వర్గాలతో మాత్రమే పోల్చుకునేలా, కింది వర్గాల సమస్యలతో సంబంధం లేనట్లుగా విభజన జరిగిపోయిందని ఆమె ఉద్దేశం. దేశంలో సానుకూల మార్పుకు ముందుంటామని డిక్లేర్ చేశారు కరణ్ జోహార్ అండ్ టీమ్. వాళ్లు చెబుతున్న మార్పులు సినిమాల్లో కనిపించే ఎలైట్ వర్గానికి సంబంధించినవా లేక స్క్రీన్ మీద చోటంటూలేని బడుగు వర్గాలకు సంబంధించినవా అనేది కూడా ఇంపార్టెంట్ పాయింటే. పవర్‌ఫుల్, టైమ్లీ సంభాషణ కోసం ముంబై నుంచి ఢిల్లీకి వెళ్లిన బాలీవుడ్ బృందం.. దేశంలో డెమొక్రసీ స్థితిగతులపై మోడీని ఒక్క ప్రశ్నైనా అడిగి ఉంటుందంటారా?

- రోహిత్ కుమార్, ఎడ్యుకేటర్


ఏమన్నారంటే



పవన్ కళ్యాణే కారణం

మా నాన్న కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమను మావోయిస్టులు చంపటానికి పవన్ కళ్యాణే కారణం. గతంలో పాడేరు మీటింగ్‌లో ఆయన మాట్లాడిన మాటలే మన్యంలో మంటపెట్టాయి.

- కిడారి శ్రావణ్ కుమార్, ఏపీ మంత్రి



రోహిత్ శర్మతో లవ్వు..

క్రికెటర్ రోహిత్ శర్మతో ఏడేళ్ల కిందట లవ్‌లో పడ్డా. అతగాడితో అఫైర్ గురించి నా లైఫ్ బుక్‌లో డిటేల్డ్‌గా రాస్తా. నేను ఫ్యాన్‌ని మాత్రమే అని అతను అబద్ధం చెప్పటంతో ఫీలై బ్రేకప్ ఇచ్చా.

- సోఫియా హయత్, బాలీవుడ్ నటి, మోడల్



కాంగ్రెస్ నేత అయితేనే..

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయి కాంగ్రెస్ క్యాండిడేట్ పీఎం అయ్యే ఛాన్స్ ఉంటేనే మేము సపోర్ట్ చేస్తాం. అయినా, ఢిల్లీలో కాషాయం పార్టీని హస్తం పార్టీ ఓడించటం కష్టం. ఆ పని మేమే చేయగలం.

- అమనతుల్లాఖాన్, ‘ఆప్’ ఎమ్మెల్యే



ప్రియాంకతో బీజేపీకే ప్లస్

ప్రియాంకా గాంధీ పాలిటిక్స్‌లోకి రావటం యూపీలో బీజేపీకే ప్లస్. బీఎస్పీ, ఎస్పీ కూటమి ఓట్లను చీల్చటానికే ఆమెను తెచ్చారు. కానీ, ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రాపై ఉన్న స్కాంల కేసులు చర్చకు వస్తాయి.

- సుశీల్ కుమార్ మోడీ, బీజేపీ నేత

మీరూ రాయొచ్చు!
సమాజాన్ని ప్రభావితం చేసే వేర్వేరు అంశాలమీద మీ అభిప్రాయాలను ఆర్టికల్ రూపంలో పంపవచ్చు. openpage@v6velugu.com


టాకీస్

ప్రభాత వెలుగు | 09
శుక్రవారం | హైదరాబాద్
25.01.2019
www.v6velugu.com
Follow: v6velugu



బ్రదర్స్ హిట్ ఇస్తారా?

తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమాలు చేసి టాలీవుడ్ అగ్రకథానాయిక వరుసలో దూసుకెళ్లింది రకుల్‌ప్రీత్ సింగ్. అయితే గత కొన్నాళ్లుగా మాత్రం సక్సెస్ వెనుకబడింది. ప్రస్తుతం తెలుగులో 'వెంకీ మామ' చిత్రం మాత్రమే రకుల్ ఖాతాలో ఉంది. అలాగని రకుల్ కెరీర్‌కు వచ్చిన ఇబ్బందేం లేదు. తమిళనాట వరుస చిత్రాలతో దూసుకెళ్తోంది. కార్తికి జంటగా 'దేవ్'లో నటించిన రకుల్.. మరోవైపు సూర్యతో 'ఎన్‌జికె'లో నటించింది. ఈ రెండు చిత్రాలు విడుదల సన్నాహాల్లో ఉన్నాయి. శివకార్తికేయన్‌తో ఓ చిత్రం షూటింగ్ దశలో ఉంది. 'ఖాకీ' చిత్రంతో కార్తితో కలసి తమిళంలో తొలి హిట్ అందుకున్న రకుల్.. 'దేవ్'తో మరో హిట్ అందుకునే ప్రయత్నంలో ఉంది. ఫిబ్రవరి 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ క్రమంలో కార్తితో కలసి ప్రమోషన్స్‌లో సందడి చేస్తోంది. 'ఎన్.జి.కె.' కూడా ఇటీవల షూటింగ్ పూర్తయింది. మొత్తానికి రకుల్ ఆశలన్నీ కోలీవుడ్ బ్రదర్స్ సినిమాలపైనే ఉన్నాయి. మరి మరో హిట్ ఇస్తారేమో చూడాలి!



ఈ మజ్ను వినోదం పంచుతాడు

అఖిల్, నిధి అగర్వాల్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన 'మిస్టర్ మజ్ను' చిత్రం ఈరోజు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను గురించి వివరిస్తూ గురువారం చిత్రబృందం మీడియా సమావేశం నిర్వహించారు. అఖిల్ మాట్లాడుతూ 'కథపై, దర్శకుడిపై నమ్మకంతో ఈ సినిమా చేశాను. వెంకీ ఫ్యాషనేట్ ఫిల్మ్ మేకర్. అక్కినేని ఫ్యాన్‌గా తాతగారికి, నాన్నగారికి ట్రిబ్యూట్‌గా వారి నటించిన చిత్రాల జానర్‌లో చేశాడు. కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకులకు పూర్తి వినోదం పంచి హ్యాపీ ఫీల్‌తో ఇంటికి పంపిస్తాం' అని చెప్పాడు. గతంలో తానెప్పుడూ నటించని పాత్రలో ఈ సినిమాలో కనిపిస్తానని హీరోయిన్ నిధి అగర్వాల్ తెలియజేసింది.

దర్శకుడు వెంకీ మాట్లాడుతూ 'నా మనసుకు దగ్గరైన సినిమా ఇది. 2011లోనే నేనీ కథ రాశాను. మొదట దిల్‌రాజు గారికి చెప్పాను. అనుభవమున్న దర్శకులు చేయాల్సిన చిత్రం అనడంతో విరమించుకున్నాను. రాసేటప్పుడే 'మిస్టర్ మజ్ను' టైటిల్‌తో పాటు అక్కినేని వారసులతోనే తీయాలనుకున్నాను. అందుకు తగ్గట్టే అఖిల్‌తో చేయడం ఆనందంగాఉంది. నిధి అందంగా కనిపించడంతో పాటు అభినయంతో మెప్పించింది. ఈ సినిమాలో అఖిల్‌ది ప్లేబోయ్ క్యారెక్టర్ అనుకుంటున్నారు. కానీ ఆ పాత్ర మొదటి ఇరవై నిముషాలే ఉంటుంది. మిగతాదంతా ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో కూడిన ప్రేమకథ. సెకండాఫ్‌లో సుబ్బరాజు, ప్రియదర్శి, హైపర్ ఆది నవ్విస్తారు. టీజర్ చూశాక చాలామంది బచ్‌నా హై హసినా, ఆరెంజ్ చిత్రాల్లా ఉందన్నారు. నిజానికి ఆ రెండు చిత్రాలకు.. మా కథకు ఎలాంటి సంబంధం లేదు. అన్ని రకాల ఎలిమెంట్స్‌తో మెప్పించే సినిమా అవుతుంది' అని చెప్పాడు. నిర్మాత బివిఎస్‌ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ 'హీరోను నిర్మాతలు బాగా చూసుకుంటారు. కానీ ఈ సినిమా విషయంలో అఖిల్ నన్ను బాగా చూసుకున్నాడు, మంచి అబ్బాయి. టెక్నీషియన్స్ అంతా బాగా చేశారు. సినిమా బాగా వచ్చింది. ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్ముతున్నాను' అన్నారు



రియల్ లైఫ్‌లో డ్యూయల్ రోల్

విభిన్నపాత్రలతో అన్ని వర్గాల వారిని అలరించే సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న నాని త్వరలో క్రికెటర్ గా కనిపించబోతున్నాడు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో క్రికెట్ నేపథ్యంలో నిర్మిస్తోన్న జెర్సీ సినిమా వేసవిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తదుపరి చిత్రం విక్రమ్ కె. కుమార్‌తో చేస్తున్నాడు. ఓవైపు సినిమాలతో బిజీగా ఉంటూనే.. మరోవైపు నిర్మాతగానూ బిజీ అవుతున్నాడు. అసిస్టెంట్ డైరెక్టర్ గా కెరీర్ ప్రారంభించి హీరో అయిన నాని, ఇప్పటికే నిర్మాతగా డీ ఫర్ దోపిడీ, అ.! సినిమాలను నిర్మించాడు. తన తాజా చిత్రాల నిర్మాతలు దిల్ రాజు, సూర్యదేవర నాగవంశీల భాగస్వామ్యంతో రెండు చిత్రాలు నిర్మించనున్నాడట. ఇందులో ఒకటి ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో ఉండనుంది.

హైదరాబాదీ కామెడీతో...



పన్నెండేళ్ల క్రితం పక్కా హైదరాబాదీ యాసతో యువతను అమితంగా ఆకట్టుకుంది 'హైదరాబాద్ నవాబ్స్' చిత్రం. ఇప్పుడీ సినిమాకు సీక్వెల్‌గా 'హైదరాబాద్ నవాబ్స్ 2' వస్తోంది. ఆర్.కె. అలియాస్ మామ నటిస్తూ దర్శకనిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రంలో అజీజ్, అలి రాజా, సూఫీఖాన్, ఫరా, నీరూ సింగ్ ప్రధానపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగింది. అనంతరం ఆర్.కె. మాట్లాడుతూ 'రియల్ ఎస్టేట్ నేపథ్యంలో సాగే కథ ఇది. ఈ సినిమాలోని పాత్రలతో ప్రేక్షకులు తమను తాము గుర్తు చేసుకుంటారు. ఐదు పాటలు ఉంటాయి. త్వరలో సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసి ఫిబ్రవరిలో విడుదలకు ప్లాన్ చేస్తున్నాం' అన్నారు. నటుడు అజీజ్ మాట్లాడుతూ 'సామాన్యుడికి సొంతిల్లు ఎంతో అవసరం. ఈ సినిమాలో తమ సొంతింటి కలను నెరవేర్చుకునే క్రమంలో వచ్చే కామెడీ ప్రేక్షకులను నవ్విస్తుంది. అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుంది' అన్నారు.

హీరో అలి మాట్లాడుతూ 'నటనపై మక్కువతో తెలుగు నేర్చుకుని మూడు చిన్న చిత్రాల్లో హీరోగా నటించాను. ఇలాంటి హిట్ మూవీ సీక్వెల్‌లో నటించడం ఆనందంగా ఉంది. ప్రేక్షకులను నవ్విస్తుందనే నమ్మకముంది' అని చెప్పాడు. హీరోయిన్స్ సూఫీఖాన్, ఫరా, నీరూ సింగ్, నటుడు తబర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్‌లో ఖని



ఎన్టీఆర్, రామ్ చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతోన్న క్రేజీ మల్టీస్టారర్ 'ఆర్‌ఆర్‌ఆర్'. ఇప్పటికే ఓ షెడ్యూల్ పూర్తి కాగా.. ఇటీవల సెకండ్ షెడ్యూల్ మొదలైంది. హీరోయిన్స్‌తో పాటు ఇతర నటీనటులు ఎవరన్నది ఇంకా ప్రకటించలేదు. అయితే తమిళ నటుడు, దర్శకుడు సముతిరఖని మాత్రం కీలకపాత్రను పోషిస్తున్నాడు. ఈ విషయాన్ని ఆయనే కోలీవుడ్ మీడియాతో పంచుకున్నారు. సముతిరఖని దర్శకత్వంలో వచ్చిన 'నడోడిగల్' (తెలుగులో శంభో శివ శంభో) రాజమౌళికి నచ్చడంతో అప్పటి నుంచి ఈ ఇద్దరూ టచ్‌లో ఉన్నారట. ఈ క్రమంలో ఇటీవల తన ఇంటికి ఆహ్వానించిన రాజమౌళి.. 'ఆర్‌ఆర్‌ఆర్'లో ఓ ప్రధానపాత్రలో నటించమని కోరాడట. జక్కన్న తనకు కథ చెపుతానన్నా వద్దని ఈ సినిమాకు అంగీకరించానన్నారు సముతిరఖని. రామ్‌చరణ్‌కు మామయ్య పాత్రను ఆయన పోషించనుండగా.. మూడో షెడ్యూల్ నుంచి షూటింగ్‌లో పాల్గొననున్నట్టు తెలుస్తోంది. మొత్తానికి 'బాహుబలి'కి కట్టప్పలా.. ఈ చిత్రంలో సముతిరఖని పాత్రకు ప్రాధాన్యత ఉండనుందేమో!



విలన్ వరుణ్

'ఎఫ్ 2'తో కెరీర్‌లోనే తొలిసారి పూర్తి స్థాయి కామెడీ పాత్ర పోషించి మెప్పించిన వరుణ్‌తేజ్.. ఆ సినిమా విజయంతో మరింత జోష్‌గా ముందుకెళ్తున్నాడు. ఈసారి ఏకంగా నెగిటివ్ క్యారెక్టర్‌లో నటించబోతున్నాడు. హరీష్ శంకర్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. తమిళంలో ఘనవిజయం సాధించిన 'జిగర్తాండ' చిత్రానికి ఇది రీమేక్. అక్కడ బాబిసింహా చేసిన రోల్‌ను ఈ సినిమాలో వరుణ్ తేజ్ పోషించనున్నాడు. సిద్ధార్థ్ స్థానంలో ఇక్కడ హీరో ఎవరనేది తెలియాల్సి ఉంది. ఈ నెల 27న ఈ సినిమా ప్రారంభం కాబోతున్నట్టు తెలుస్తోంది. 14 రీల్స్ సంస్థ నిర్మించనున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించనున్నాడు. ఇతర నటీనటులు, టెక్నీషియన్స్ వివరాలను సినిమా ప్రారంభం రోజున రివీల్ చేయనున్నారు. కెరీర్ ప్రారంభం నుంచి ప్రయోగాలకే ప్రాధాన్యతను ఇస్తోన్న వరుణ్ తేజ్ ఈసారి పూర్తి స్థాయి నెగటివ్ రోల్ పోషించనుండటం విశేషం. ఇక 'డీజే.. దువ్వాడ జగన్నాథం' తర్వాత హరీష్ శంకర్‌కు అనుకోకుండా ఒకటిన్నర సంవత్సరం గ్యాప్ వచ్చింది. హీరోయిజాన్ని ఎలివేట్ చేయడంలో ఎక్స్‌పర్ట్ అయిన హరీష్.. మరి ఈ చిత్రంలో విలన్‌గా వరుణ్‌ను ఎలా చూపిస్తాడో!

'మణికర్ణిక'కు లైన్ క్లియర్

కంగనా రనౌత్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'మణికర్ణిక'. ఈ చిత్రంలో ఝాన్సీ లక్ష్మీబాయిని తప్పుగా చూపించారంటూ మహారాష్ట్రకు చెందిన కర్ణిసేన బాంబే హైకోర్టులో పిటిషన్ వేసింది. గురువారం పిటీషన్‌ను విచారించిన హైకోర్టు.. విడుదలను ఆపలేమని తీర్పునిచ్చింది. సినిమాపై వస్తోన్న ఆరోపణలకు సంబంధించి రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలంటూ దర్శకనిర్మాతలను ఆదేశించింది. దీంతో శుక్రవారం ఈ సినిమా ఎలాంటి అవాంతరాలు లేకుండా విడుదలవుతోంది.




మాస్ మహారాజ్ బర్త్ డే స్పెషల్

రవితేజ హీరోగా వి.ఐ ఆనంద్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. స్పై థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాను ఎస్‌ఆర్‌టి ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్ళూరి నిర్మిస్తున్నారు. ఇంకా టైటిల్‌ను ప్రకటించలేదు. రిపబ్లిక్ డే, రవితేజ పుట్టిన రోజుల సందర్భంగా జనవరి 26న ఈ సినిమా పేరు ప్రకటించడంతో పాటు టైటిల్ లోగోను విడుదల చేయనున్నారు. రవితేజకు జోడీగా ముగ్గురు హీరోయిన్లు నటించనుండగా అందులో ఒకరిగా పాయల్ రాజ్‌పుత్‌ను ఎంపిక చేశారు. బాబీసింహా, వెన్నెల కిషోర్, సత్య ఇతర పాత్రల్లో నటించనున్నారు. తమన్ సంగీత దర్శకుడు. అతి త్వరలో ఫస్ట్ షెడ్యూల్ ప్రారంభించబోతున్నట్టు రామ్ తాళ్లూరి తెలిపారు. ఈ సినిమాతో పాటు సంతోష్ శ్రీనివాస్ దర్శకత్వంలోను రవితేజ ఓ సినిమా చేయబోతున్నాడు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ చిత్రం గురించి కూడా అదేరోజున ప్రకటన వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి.



ట్విటర్ టాక్



మనుషుల ఆలోచన విధానం ఎలా ఉంటుందనే విషయంపై అమితాబ్ బచ్చన్ ఇలా ట్వీట్ చేశారు. 'మనమెలా ఆలోచిస్తామో, ఎదుటివారు కూడా అలాగే ఆలోచిస్తారు అని ఊహించుకోవడం' అనేది జీవితంలో మనం చేసే అతి పెద్ద పొరపాటు.

ఈవెంట్




శింబు హీరోగా సుందర్ సి దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'వంతరాజ వతన్ వరువేన్'. తెలుగు బ్లాక్‌బస్టర్ హిట్ మూవీ 'అత్తారింటికి దారేది'కి ఇది రీమేక్. సమంత పాత్రను మేఘా ఆకాశ్ పోషించగా, ప్రణీత పాత్రలో కేథరిన్ నటించింది. ఈ సినిమా పాట చిత్రీకరణ సమయంలో హీరో, దర్శకుడితో కలసి కేథరిన్.

గప్‌చుప్



'ఎఫ్ 2'కు సీక్వెల్ చేస్తానని ప్రకటించిన అనిల్ రావిపూడి.. దాన్ని పక్కనపెట్టి ఓ లేడీ ఓరియెంటెడ్ సినిమాకు ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. స్టోరీ లైన్ సిద్ధమైన ఈ సినిమాకు సంబంధించి హీరోయిన్‌ని వెదికే ప్రయత్నాలు చేస్తున్నాడని అంటున్నారు. వరుస హిట్ లతో గ్రాఫ్‌ని పెంచుకుపోతున్న అనిల్.. ఇలాంటి సమయంలో లేడీ ఓరియెంటెడ్ అంటూ ప్రయోగాత్మక చిత్రం చేయాలనుకోవడం మెచ్చుకోదగ్గ విషయమే . అయితే ఫన్ తన పెన్‌కి ఇష్టం కాబట్టి బహుశా ఈ సినిమాని కూడా ఫుల్ లెంగ్త్ ఎంటర్టైన్మెంట్ గానే తియ్యొచ్చేమో. అంతేగా.. అంతేగా..!

ఫొటో ఫీస్ట్



మనసు సంతోషంగా ఉండాలే కానీ మనం ఏం చేసినా అది అందంగానే ఉంటుంది. మరిక్కడ లక్ష్మీరాయ్ మనసుకు అంతలా ఏం ఆనందమేసిందో. మణిరత్నం సినిమాలో హీరోయిన్‌లా 'ఒళ్లంత కవ్వింత కావాలిలే, ఒళ్లంత తుళ్లింత రావాలిలే' అంటూ ఇలా బాత్ టబ్బులో హుషారుగా చిందేస్తోంది. మరి ఈ పులకరింతకు కారణమేంటో!

నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.402	రూ.4.60
వరంగల్	రూ.404	రూ.4.60

మార్కెట్

సెన్సెక్స్ ↑87 36,195.10

నిఫ్టీ ↑18 10,849.80



తక్కువ లాభాలతో గట్టెక్కిన మార్కెట్

ముంబై: రెండు రోజులుగా నష్టాలను చవిచూసిన మార్కెట్లు గురువారం ట్రేడింగ్ లో లాభాలను సొంతం చేసుకున్నాయి. ఫ్లాట్ గా ప్రారంభమైన సూచీలు ఆ తరువాత ట్రేడింగ్ ఆద్యంతం ఒడిదుడుకుల్లోనే సాగింది. దాదాపు 260 పాయింట్లు ఊగిసలాడిన సెన్సెక్స్ చివర్లో లాభాల్లో ముగిసింది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 86.63 పాయింట్లు పుంజుకుని 36,195.10 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 18.30 పాయింట్లు పెరిగి 10,849.80 వద్ద ముగిసింది.



అల్ట్రాటెక్ లాభం రూ.390 కోట్లు

న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్‌లోని అల్ట్రా టెక్ సిమెంట్ డిసెంబర్ 2018తో ముగిసిన క్వార్టర్‌కు రూ. 390.43 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించింది. అంతకు ముందు ఏడాది మూడో క్వార్టర్‌లో కంపెనీకి రూ. 456.66 కోట్ల నికర లాభం వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో క్వార్టర్‌లో అల్ట్రా టెక్ సిమెంట్ ఆదాయం రూ. 9,492.94 కోట్లు. డిసెంబర్ 2018తో అంతమైన క్వార్టర్‌లో అమ్మకాలు 15% పెరిగాయని, అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు రూ. 8,056.54 కోట్లు మాత్రమేనని కంపెనీ తెలిపింది. అధిక ఇంధన ధరలకు, రూపాయి విలువ క్షీణత తోడవడంతో ఉత్పత్తి వ్యయం అంతకు ముందు ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 11% పెరిగిందని, యుఎన్‌సీఎల్ టేకోవర్ కోసం తీసుకున్న రుణాల మీద వడ్డీ భారం అదనంగా చేరిందని పేర్కొంది. దీంతో మొత్తం వ్యయం రూ. 8,916.44 కోట్లకు పెరిగిందని వివరించింది. జైప్రకాష్ అసోసియేట్స్, జేపీ సిమెంట్ కార్ప్‌ల సిమెంట్ ప్లాంట్ల ఫలితాలు కూడా ఇందులో కలిసే ఉన్నాయని వెల్లడించింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంతోపాటు, హౌసింగ్ ప్రాజెక్టుల మీద ప్రభుత్వం వ్యయం పెంచుతున్న నేపథ్యంలో, భవిష్యత్ ఆశాజనకంగా ఉంటుందని అల్ట్రాటెక్ తెలిపింది. విస్తరణ ప్రాజెక్టులు అందుబాటులోకి రావడంతో పాటు, కొన్ని టేకోవర్‌లను పూర్తి చేయడంతో దేశపు ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో భాగం పంచుకునేందుకు తగిన అవకాశాలున్నాయని కూడా పేర్కొంది.

Dr.Reddy's

అమెరికా మార్కెట్‌లోకి అనస్థిటిక్ ప్రొడక్ట్

ప్రోపోఫోల్ లాంచ్ చేసిన డాక్టర్ రెడ్డీస్

హైదరాబాద్: ఇంటెన్సివ్ కేర్ యూనిట్లలో అనస్థిషియా, సెడేషన్‌లకు వాడే ప్రోపోఫోల్ ఇంజెక్టబుల్ ఎమల్షన్‌ను డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ గురువారం అమెరికా మార్కెట్‌లో లాంచ్ చేసింది. ప్రోపోఫోల్ ఇంజెక్టబుల్ ఎమల్షన్ అనేది డిప్రివ్యాన్ ఇంజెక్టబుల్ ఎమల్షన్‌కు చికిత్సా పరమైన జనరిక్ వెర్షన్ అని కంపెనీ బీఎస్ఈ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ ప్రొడక్ట్‌ను దుర్వినియోగం చేయకుండా నిరోధించేందుకు దీన్ని మార్కెట్ చేసే డిస్ట్రిబ్యూషన్ కంట్రోల్స్‌ను కూడా దక్కించుకున్నట్టు డాక్టర్ రెడ్డీస్ పేర్కొంది.

మూడేళ్ల కూన జెల్స్ మాక్
రూ.23 కోట్ల ఐపివో

హైదరాబాద్, వెలుగు:

స్టార్టప్ కంపెనీలు వ్యాపార విస్తరణ కోసం డబ్బులవసరమైతే వెంచర్ క్యాపిటల్ మీద ఆధారపడటం ఇటీవలి ట్రెండ్. ఐతే, ఈ ట్రెండ్‌ను ఫాలో అవకుండా, జెల్స్ మాక్ డిజైన్ అండ్ టెక్ లిమిటెడ్ ప్రారంభమైన మూడేళ్లలోనే రూ.23 కోట్ల మేర నిధులు సమకూర్చుకునేందుకు ఐపివో (ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్) తో పబ్లిక్ ముందుకు వచ్చింది. కార్పొరేట్, గవర్నమెంట్, స్టార్టప్స్ వంటి వాటికి ఎండ్ టు ఎండ్ టెక్నాలజీ సొల్యూషన్స్, సపోర్ట్ ప్రొవైడర్ గా బెంగుళూరుకు చెందిన జెల్స్ మాక్ సేవలందిస్తోంది. ప్రమోటర్లు, స్నేహితులు, కుటుంబ సభ్యుల ద్వారా ఇప్పటి వరకు రూ.14.5 కోట్లు పెట్టుబడి పెట్టగా, ఇప్పుడు కంపెనీని మరింత విస్తరించడానికి రూ.23 కోట్ల మేర నిధులు సేకరించేందుకు ఐపివో కు వచ్చింది. జనవరి 23 న ప్రారంభమైన ఈ ఐపివో జనవరి 25 తో ముగియనుంది. రూ.62-66 ప్రైజ్ బ్యాండ్ తో రూ.10 ఫేస్ వాల్యూతో ఈక్విటీ షేర్ల జారీకి ఐపివోను ప్రకటించింది. ఇష్యూ మొదటిరోజున 45 శాతం సబ్‌స్క్రిప్షన్ పొందగా, రెండో రోజైన గురువారం నూరు శాతం సబ్‌స్క్రిప్షన్‌ను సాధించడం విశేషం.

హైదరాబాద్ లో సెంటర్ ఏర్పాటు

సంక్లిష్టమైన టెక్ సొల్యూషన్స్‌ను సులభతరం చేయడమే తమ కంపెనీ ధ్యేయమని అందుకే కంపెనీ పేరును కూడా కాంప్లెక్స్ అనే ఇంగ్లీష్ పదాన్ని రివర్స్ చేసి జెల్స్ మాక్ అని పెట్టినట్లు కంపెనీ కో ఫౌండర్ శ్రీనివాస్ కూర తెలిపారు. హైదరాబాద్ కు చెందిన శ్రీనివాస్ కూర జెల్స్ మాక్ ఫౌండర్లలో ఒకరు. 16 యేళ్లపాటు జస్ట్ డయల్లో పదవులు నిర్వహించిన తర్వాత , జెల్స్ మాక్ ను ఏర్పాటుచేశారు. బెంగళూరు తో పాటు కోల్‌కతా, ముంబై, ఢిల్లీ ప్రాంతాల్లో తమకు సెంటర్‌లున్నాయని, ఐపివో ద్వారా సేకరించిన నిధులతో హైదరాబాద్‌లో కూడా సెంటర్ ప్రారంభించనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ లో మరో రెండు నెలల్లో సుమారు 6,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని, ఇందులో 40-50 మందికి ఉద్యోగాలు దొరుకుతాయని వెల్లడించారు. మొత్తం ఐపివో లో 75% క్యూఐబి (క్వాలిఫైడ్ ఇన్స్టిట్యూషనల్ బయ్యర్స్), 15% హెచ్‌ఎన్‌ఐ (హై నెట్ వర్త్ ఇండివిడ్యువల్), 10% రిటెయిల్ ఇన్వెస్టర్లకు కేటాయించినట్లు తెలిపారు. కంపెనీ వృద్ధి కోసం సమీకరించనున్న ఈ మొత్తం లో రూ.6 కోట్లు వర్కింగ్ కాపిటల్ కాగా, మిగిలిన రూ. 17 కోట్లను క్యాపెక్స్‌గా, కంపెనీ విస్తరణకు వినియోగించనున్నట్లు వెల్లడించారు.



- హైదరాబాద్‌లో కొత్త సెంటర్... 50 మందికి ఉద్యోగాలు
- కోఫౌండర్ శ్రీనివాస్ కూర వెల్లడి

తక్కువ సమయంలోనే లాభాలు

కంపెనీ ప్రారంభించిన యేడాది లోనే రూ.2 కోట్ల స్టాండ్ అలోన్ రెవెన్యూ సాధించిన జెల్స్ మాక్, 2018 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.5.5 కోట్ల రెవెన్యూ ను ఆర్జించింది. 2018 సెప్టెంబర్ నాటికి (ఆరు నెలల కాలానికి) కంపెనీ స్టాండ్ అలోన్ రెవెన్యూ రూ.3.7 కోట్లు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మరింత వృద్ధి సాధిస్తామని కంపెనీ నిర్వాహకులు ధీమా వ్యక్తం చేసారు. 2017 మార్చి నాటికి కంపెనీ కన్సాలిడేటెడ్ రెవెన్యూ రూ.1.9 కోట్లు కాగా మార్చి 2018 నాటికి రూ.4.9 కోట్లకు చేరుకుంది. హైదరాబాద్ లో మౌలిక వసతులు మెండుగా ఉన్నాయని, ఇక్కడ సెంటర్ ప్రారంభించడం ద్వారా గణనీయంగా వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నట్లు చెప్పారు. మంచి ఐడియా, బిజినెస్ మోడల్ ఉంటే మార్కెట్లో విస్తృతంగా అవకాశాలున్నాయని, ఇది ఎంతో మందిని స్టార్టప్స్ కిందికి మారుస్తుందని ప్రమోటర్స్ చెబుతున్నారు.



చందాకొచ్చర్‌పై క్రిమినల్ కేసు

బిగుసుకున్న వీడియోకాన్ రుణ వివాదం ■ దీపక్ కొచ్చర్, వీడియోకాన్ ఎండీ ధూత్‌లపై కూడా సీబీఐ ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ:

ఐసీఐసీఐ బ్యాంక్‌కు మారుపేరుగా నిలిచిన చందాకొచ్చర్ తీవ్ర ఇరకాటంలో పడిపోయారు. వీడియోకాన్ రుణ వివాద కేసు, ఆమె మెడకు చుట్టుకుపోతోంది. వీడియోకాన్ రుణ వివాద కేసులో ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో చందాకొచ్చర్‌పై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) గురువారం క్రిమినల్ కేసు రిజిస్టర్ చేసింది. చందాకొచ్చర్‌తో పాటు ఆమె భర్త, న్యూపవర్ రెన్యూవబుల్స్ వ్యవస్థాపకుడు దీపక్ కొచ్చర్‌పై, వీడియోకాన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ ధూత్‌పై కూడా సీబీఐ క్రిమినల్ కేసులు నమోదు చేసింది. 2012లో వీడియోకాన్ గ్రూప్‌కు బ్యాంక్ రుణాలు మంజూరు చేయడంలో వీరు మోసానికి, అక్రమాలకు పాల్పడినట్టు సీబీఐ అధికారులు చెప్పారు. అంతేకాక ముంబైలో ఉన్న వీడియోకాన్ గ్రూప్ ఆఫీసుల్లో, ఔరంగబాద్‌లో ఉన్న న్యూపవర్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాల్లో కూడా గురువారం సీబీఐ మరోసారి తనిఖీలు చేపట్టింది. ఈ దాడులు ఐసీఐసీఐ బ్యాంక్, వీడియోకాన్ రుణ కేసుకు సంబంధించి చేపట్టామని, అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేశామని అధికారులు తెలిపారు. క్విడ్ ప్రోకో విధానంలో చందాకొచ్చర్, వీడియోకాన్ గ్రూప్‌కు రుణాలు మంజూరు చేసినట్టు పెద్ద ఎత్తున దుమారం చెలరేగిన సంగతి తెలిసిందే. ఈ దుమారంతో కొన్ని రోజులు ఐసీఐసీఐ బ్యాంక్ బోర్డు చందాకొచ్చర్‌కు మద్దతు పలికినప్పటికీ, ఆ తర్వాత ఈ వివాదంపై స్వతంత్ర విచారణకు ఆదేశించింది. అనంతరం చందాకొచ్చర్ బ్యాంక్ సీఈవోగా వైదొలిగారు.



దీపక్ కొచ్చర్ | వేణుగోపాల్ ధూత్

ఈ రుణవివాద కేసుతో బ్యాంకింగ్ రంగంలో ఉన్న పెద్ద పెద్ద అధికారులు కూడా ఫైనాన్సియల్ క్రైమ్‌లకు పాల్పడుతున్న వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. మరోవైపు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో చోటు చేసుకున్న నీరవ్ మోడీ భారీ కుంభకోణం కూడా బ్యాంకింగ్ రంగ పరువును బజారుకు ఈడ్చింది. ఈ బ్యాంక్ ఎండీ, సీఈవో ఉషా అనంత సుబ్రహ్మణ్యం పై కూడా సీబీఐ విచారణ సాగుతోంది. సీబీఐ క్రిమినల్ కేసుపై దీపక్ కొచ్చర్ స్పందించలేదు. వేణుగోపాల్ ధూత్ మీడియా కాల్స్‌ను, మెసేజ్‌లను స్వీకరించడం లేదు. క్విడ్ ప్రో కో విధానంలో ఐసీఐసీఐ బ్యాంక్, వీడియోకాన్ గ్రూప్‌నకు రూ.3,250 కోట్ల రుణాలను మంజూరు చేసింది. ఈ మొత్తం 2012లో 20 బ్యాంక్‌ల కన్సార్టియం జారీ చేసే రూ.40వేల కోట్ల రుణంలో భాగం. రుణాలను అక్రమంగా జారీ చేసినందుకు లెండర్స్ (ఐసీఐసీఐ) , చందా కొచ్చర్, దీపక్ కొచ్చర్, వేణుగోపాల్ ధూత్‌లకు వ్యతిరేకంగా సీబీఐ మార్చిలో ప్రాథమిక విచారణ ప్రారంభించింది.

ఐసీఐసీఐ నుంచి రూ.3250 కోట్ల రుణం అందుకున్న కొన్ని నెలలకే న్యూపవర్ కంపెనీలో రూ.64 కోట్ల విలువ చేసే షేర్లను వీడియోకాన్ ధూత్ కేవలం రూ.9 లక్షలకే దీపక్ కొచ్చర్ (చందా కొచ్చర్ భర్త)కు ఇచ్చేసి ఆయనకే మొత్తం బాధ్యతలను అప్పగించేశారు. 2008లో వీడియోకాన్ గ్రూప్‌కు చెందిన వేణుగోపాల్ ధూత్, దీపక్ కొచ్చర్, మరో ఇద్దరు కలిసి న్యూపవర్ రెన్యూవబుల్స్ సంస్థను ఏర్పాటు చేశారు. ప్రాథమిక విచారణలో భాగంగా సేకరించిన సాక్ష్యాలతో, సీబీఐ వీరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

ఐసీఐసీఐ బ్యాంక్‌ను మోసం చేస్తూ.. క్రిమినల్ కుట్రలో భాగంగా ప్రైవేట్ కంపెనీలకు నిందితులు రుణాలను మంజూరు చేసినట్టు సీబీఐ అధికార ప్రతినిధి చెప్పారు. చందాకొచ్చర్, దీపక్ కొచ్చర్, వేణుగోపాల్ ధూత్‌లతో పాటు న్యూపవర్ రెన్యూవబుల్స్, సుప్రీం ఎనర్జీ, వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, వీడియోకాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లపై కూడా క్రిమినల్ కుట్ర, అవినీతి నిరోధక చట్టానికి సంబంధించిన ఐపీసీ సెక్షన్స్ కింద సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు తెలిపారు.



జర్మన్ ఆటో కంపెనీ మెర్సిడెస్ బెంజ్ లగ్జరీ ఎంపీవీ వీ క్లాస్‌ను గురువారం మన దేశంలో లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధర రూ.68.40 లక్షలు. వీ క్లాస్ ఎంపీవీ కారు సిక్స్ సీటర్ లాంగ్ వీల్ బేస్(ఎక్స్‌క్లూజివ్), సెవన్ సీటర్ ఎక్స్‌ట్రా లాంగ్ వీల్ బేస్(ఎక్స్‌ప్రెషన్) వేరియంట్లలో అందుబాటులో ఉంటుంది. బీఎస్ 6 ప్రమాణాలకు అనుగుణంగా 2.2 లీటర్ డీజిల్ ఇంజిన్‌తో రూపొందించారు.

మార్కెట్లోకి టాటా హారియర్

హైదరాబాద్, వెలుగు: టాటా మోటార్స్ హారియర్ కార్ ను గురువారం హైదరాబాద్ మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రీమియం ఎస్ యూవి (స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్) విభాగంలో విడుదల చేసిన హారియర్ నాలుగు మోడళ్లలో అందుబాటులో ఉంది. ప్రస్తుతానికి డీజిల్ వేరియంట్ ఒక్కటే అందుబాటులోకి తీసుకువచ్చినట్లు టాటా మోటార్స్ తెలిపింది. జాగ్వర్ లాండ్ రోవర్ ప్రాసెస్, సిస్టమ్ తో దీన్ని తయారు చేసామని, 6 ఎయిర్ బ్యాగ్స్, 3డి ఎల్ఈడి టెయిల్ లాంప్స్, రిచ్ అండ్ ప్రీమియం లెదర్ ఇంటీరియర్, 9 జెబిఎల్ స్పీకర్లు, 8.8 ఇంచుల హై రిసొల్యూషన్ స్క్రీన్, 1956 సిసి ఇంజిన్ వంటి ప్రత్యేకతలున్న ఈ కారు ఐదు రంగుల్లో లభ్యం కానుంది. హారియర్ ఎక్స్ షోరూం ధర వేరియంట్ ను బట్టి రూ.12.69 లక్షల నుండి రూ.16.29 లక్షల వరకు ఉంది. ఆటో మొబైల్ పరిశ్రమ వృద్ధి రేటు కంటే టాటా వృద్ధి రేటు ఎక్కువగా ఉందని, ప్రస్తుతం టాటా మార్కెట్ వాటా 6.8 శాతం కాగా, 2022 నాటికి 19 శాతం మార్కెట్ వాటా సాధిస్తామని పాసింజర్ వెహికిల్ బిజినెస్ యూనిట్ ప్రెసిడెంట్ మయంక్ పరీక్ తెలిపారు. కారు కొనేముందు సాధారణంగా 3 కార్లను పరిశీలిస్తారని, ఆ పరిశీలనలో టాటా ఉండడమే తమ ముందున్న లక్ష్యమని అన్నారు. బిఎస్6 వాహనాలకు మారడం ఇప్పుడు ఆటో మొబైల్ పరిశ్రమ ముందున్న అతిపెద్ద సవాలని అన్నారు. 2012 లో మొత్తం కార్లలో డీజిల్ కార్ల వాటా 62 శాతం కాగా ప్రస్తుతం 40 శాతానికి పడిపోయిందని, పెట్రోల్,డీజిల్ ధరల మధ్య ఎక్కువగా వ్యత్యాసం లేకపోవడంతో పెట్రోల్ వాహనాన్ని కొనడానికే ఎక్కువగా ఇష్టపడుతున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో చిన్న కార్ల విభాగంలో గరిష్ట వాటా పెట్రోల్ కార్లదే ఉంటుందని అభిప్రాయపడ్డారు.



క్యాష్ పంపితే..
వీర బాదుడేనా?

న్యూఢిల్లీ:

- బ్యాంకింగ్ కరెస్పాండెంట్ల ద్వారా పంపించే నగదుపై జీఎస్టీ
- వలస కార్మికులకు శాపం

బ్యాంక్‌ల బాదుడుకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మినిమమ్ బ్యాలెన్స్ అమౌంట్ ఛార్జీలు, ఏటీఎం లావాదేవీలపై ఫీజులు, మిని స్టేట్‌మెంట్, చెకింగ్ బ్యాలెన్స్‌లపై ఛార్జీలంటూ వీరబాదుడు బాదుతోన్న బ్యాంక్‌లు మరో కొత్త రకం ఛార్జీలకు తెరలేపబోతున్నాయి. ఎక్కడో నౌకరి చేసుకుంటూ.. కుటుంబానికి ఆసరాగా... ఇంటికి పంపిస్తోన్న నగదుపై కూడా ఇక నుంచి జీఎస్టీ వేయాలని నిర్ణయించాయి. బ్యాంకింగ్ కరెస్పాండెంట్ల ద్వారా పంపించే నగదుపై బ్యాంక్‌లు గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్(జీఎస్టీ) వేయాలని నిర్ణయించాయని దీనికి సంబంధించిన ఓ వ్యక్తి చెప్పారు. ఈ నగదును ఎక్కువగా విదేశాల్లో, ఇతర ప్రాంతాల్లో పనిచేస్తోన్న వలస కార్మికులు తమ కుటుంబాలకు పంపిస్తూ ఉంటారు. ఆర్థికంగా అంతగా ఎదగని ప్రాంతాల్లో ఈ లావాదేవీలు జరుగుతూ ఉంటాయి.

లావాదేవీ విలువలో 1.5 శాతం మీద18 శాతం జీఎస్టీ వేయాలని బ్యాంక్‌లు ప్లాన్ చేస్తున్నాయని ఆ వ్యక్తి చెప్పారు. ఉదాహరణ... రూ.10వేల విలువైన లావాదేవీ జరిపితే, దానిలో 1.5 శాతమంటే 150 రూపాయలు. ఈ రూ.150పై 18 శాతం జీఎస్టీ విధించాలి. అంటే రూ.27 జీఎస్టీ అవుతుంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాంకులు ఈ ఛార్జీలను ప్రవేశపెట్టబోతున్నాయని తెలిపారు. అయితే లావాదేవీలపై విధించే సర్వీసు ఫీజు, రెమిటెన్స్ విలువలో 1.5 శాతం మించకూడదు. 1.5 శాతం కంటే తక్కువగా ఎంతైనా విధించుకోవచ్చు. ఈ జీఎస్టీ విధింపుతో పన్ను అధికారుల స్క్రూటినీని (పరిశీలనను) తప్పించుకోవచ్చని బ్యాంక్‌లు భావిస్తున్నాయి. జీఎస్టీ కౌన్సిల్ నుంచి దీనిపై క్లారిఫికేషన్ వచ్చిన తర్వాతనే, బ్యాంక్‌లు ఈ నిర్ణయం తీసుకున్నాయని తెలిసింది. బ్యాంకింగ్ ప్రతినిధులు, బిజినెస్ కరెస్పాండెంట్ల ద్వారా నగదును పొందే కస్టమర్ల నుంచి బ్యాంక్‌లు ఫీజులను వసూలు చేస్తున్నాయి. ఈ ఫీజులపై కూడా బ్యాంక్‌లు పన్నులు చెల్లించాలని జీఎస్టీ కౌన్సిల్ ఆదేశించింది. బ్యాంకింగ్ సౌకర్యాలు లేని ప్రాంతాల్లో, చాలా మంది కస్టమర్లు కిరాణా షాపుల లాంటి వాళ్ల దగ్గరకు వెళ్లి ఈ లావాదేవీలను జరుపుతూ ఉంటారు. బ్యాంక్‌ల సాయంతో బ్యాంకింగ్ కరెస్పాండెంట్ మాదిరే, వారు ఈ లావాదేవీలను నిర్వహిస్తారు. సర్వీసు ప్రొవైడర్లు, బ్యాంక్‌లు ఈ లావాదేవీ కోసం కస్టమర్ల నుంచి ఫీజులను వసూలు చేస్తాయి. అయితే సర్వీసు ప్రొవైడర్ల తరఫున బ్యాంక్‌లు వీటికి పన్నులు చెల్లించాలని ప్రభుత్వం ఇటీవలే ఆదేశించింది. ఆర్‌బీఐ బిజినెస్ కరెస్పాండెంట్ మోడల్ కింద నెలకు సుమారు రూ.5,000 కోట్ల నుంచి రూ.6,000 కోట్ల వరకు రెమిటెన్స్ లావాదేవీలు జరుగుతున్నాయి.



ఎంత ఫీజు వేస్తున్నాయో బ్యాంక్‌లకే తెలియదు..?

అయితే ఒక వ్యక్తి నగదును ట్రాన్స్‌ఫర్ చేసినందుకు సాధారణంగాఎంత ఫీజు వసూలు చేస్తున్నాయన్నది బ్యాంక్‌లకే తెలియదని పీడబ్ల్యూసీ ఇండియా ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ పార్టనర్ సుమిత్ లుంకర్ అన్నారు. అంతేకాక ఎంత విలువ జీఎస్టీ కిందకు వస్తుందో కూడా బ్యాంక్‌లకు తెలియదన్నారు. ఫీజుల కింద కస్టమర్ సర్వీసు పాయింట్ 1.5 శాతం వసూలు చేయాల్సినవసరం లేదని, అంతకంటే తక్కువ కూడా ఉండొచ్చని పేర్కొన్నారు. 2018 అక్టోబర్‌లో యాక్సిస్ బ్యాంక్ మారుమూల ప్రాంతాల్లో మనీ ట్రాన్స్‌ఫర్ ఆపరేషన్స్‌ను క్లోజ్ చేసింది. ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ఇదే మాదిరి నిర్ణయం తీసుకుంటోంది. దీంతో ఆర్‌బీఎల్ బ్యాంక్, యస్ బ్యాంక్‌లు ఈ లావాదేవీలపై ఎక్కువ జీఎస్టీని భరించబోతున్నాయి. యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఈ సేవలను క్లోజ్ చేయడంతో, తమ వైపుకే ఎక్కువ మంది కస్టమర్లు ఆకర్షితులవుతారని ఈ బ్యాంక్‌లు భావిస్తున్నాయి. అయితే ఈ విషయంపై స్పందించడానికి మాత్రం ఆర్‌బీఎల్, యస్ బ్యాంక్‌లు నిరాకరించాయి. జీఎస్టీ విధింపుతో పాటు, బ్యాంక్‌లు వారి డాక్యుమెంటేషన్‌ను కూడా మార్చాలనుకుంటున్నాయి. ఇప్పటి వరకు సర్వీసు ప్రొవైడర్లు సేకరించే ఫీజులపై ఎలాంటి డేటా లేదు. ఇక నుంచి ఈ లావాదేవీల కోసం సరియైన డాక్యుమెంటేషన్ నిర్వహించాలని భావిస్తున్నాయి.



నగదు విత్‌డ్రా, నగదు డిపాజిట్, బ్యాలెన్స్ స్టేట్‌మెంట్, కేవైసీ అప్‌డేట్, సంతకం, ఫోటో వెరిఫికేషన్, చెక్ డిపాజిట్ వంటి ఉచిత సర్వీసులపై కూడా కొన్ని బ్యాంక్‌లు ఫీజులు వసూలు చేస్తోన్న సంగతి తెలిసిందే. పరిమితికి మించిన ఏటీఎం లావాదేవీలపై కూడా బ్యాంక్‌లు భారీగా బాదుతున్నాయి. మినిమమ్ అమౌంట్ ఉంచకపోతే కూడా ఎస్‌బీఐ సహా బ్యాంకులన్నీ తెగ ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఇలాంటి అడ్డదిడ్డమైన ఛార్జీల ద్వారా బ్యాంకులు వేల కోట్ల రూపాయిలు సంపాదిస్తున్నాయంటే అర్థం చేసుకోవచ్చు. వీటన్నింటికి తోడు ఇప్పుడు కొత్తగా బ్యాంకింగ్ కరెస్పాండెంట్ల ద్వారా బదిలీ చేసే సేవలపై కూడా జీఎస్టీ బాదుడును బ్యాంకులు షురూ చేస్తున్నాయి.



మంధనాధన్

న్యూజిలాండ్‌పై మిథాలీసేన గ్రాండ్ విక్టరీ





నేపియర్: అచ్చం కోహ్లీ సేనలాగే టీమిండియా విమెన్స్ క్రికెట్ టీమ్ న్యూజిలాండ్ టూర్‌లో అదిరిపోయే ఆరంభం చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (105: 104 బాల్స్, 9x4, 3x6) సెంచరీ, రోడ్రిగ్స్ (81 నాటౌట్: 94 బాల్స్, 9x4) సూపర్ ఇన్నింగ్స్ సాయంతో న్యూజిలాండ్ విమెన్స్ టీమ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో మిథాలీ సేన 9 వికెట్లతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 48.2 ఓవర్లలో 192 రన్స్‌కే ఆలౌట్ అయింది. 193 రన్స్ టార్గెట్ ఛేజింగ్ కోసం బరిలో దిగిన ఇండియా ఒక్క వికెట్ నష్టపోయి ఇంకా 102 బాల్స్ మిగిలి ఉండగానే టార్గెట్ పూర్తి చేసింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న ఇండియా బౌలర్లను ఆరంభంలో న్యూజిలాండ్ ఓపెనర్లు ధాటిగా ఎదుర్కొన్నారు. సుజీ బేట్స్- డెవైన్ తొలి వికెట్‌కు 61రన్స్ భాగస్వామ్యాన్నందించారు 28 రన్స్ చేసి నిలదొక్కుకుంటున్న డెవైన్ రనౌట్ అవడంతో వికెట్ల పతనం మొదలైంది. మిడిలార్డర్‌లో కెప్టెన్ సాటర్‌వైట్ (31), కెర్ (28)లు నిలదొక్కునే ప్రయత్నం చేసినా స్పిన్నర్ పూనమ్ యాదవ్ వరుసగా మూడు వికెట్లు పడగొట్టి కివీస్‌ను కోలుకోలేని దెబ్బతీసింది. ఆ తర్వాత బిస్త్ కివీస్ ప్లేయర్లను బెంబేలెత్తించి మూడు వికెట్లు పడగొట్టింది. చివర్లో రోవ్ (25) కాసేపు ప్రతిఘటించినా 48.1 ఓవర్ల వద్ద న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. బిస్త్, పూనమ్ యాదవ్ మూడేసి వికెట్లు పడగొట్టారు.

మంధాన షో

టీ20 వరల్డ్ కప్ తర్వాత తొలి సిరీస్ ఆడుతున్న ఇండియా 193 రన్స్ టార్గెట్‌తో ఇన్నింగ్స్ ప్రారంభించి ఈజీగా గెలుపొందింది. ఓపెనర్లు మంధాన-రోడ్రిగ్స్ కివీస్ బౌలర్లను చెడుగుడు ఆడుకున్నారు. తాజాగా ఐసీసీ ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు గెలుచుకున్న మంధాన ఈ మ్యాచ్ ఆద్యంతం అద్భుతంగా ఆడింది. సూపర్ ఇన్నింగ్స్‌తో వన్డేల్లో నాలుగో సెంచరీ పూర్తి చేసుకుంది. 101 బాల్స్‌లో 8 ఫోర్లు మూడు సిక్సలతో సెంచరీ చేసిన మంధాన 32 ఓవర్లో వెనుదిరగడంతో ఇద్దరి భాగస్వామ్యం విడిపోయింది.. ఇద్దరూ తొలి వికెట్‌కు 190 రన్స్ రికార్డు పార్ట్‌నర్ షిప్ అందించారు. న్యూజిలాండ్‌పై ఇదేఇండియాకు అత్యధిక వన్డే పార్ట్‌నర్‌షిప్. తొలి వన్డే హాఫ్ సెంచరీ చేసిన రోడ్రిగ్స్ మ్యాచ్‌ను ముగించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇండియా తర్వాతి మ్యాచ్‌ను 29న ఆడుతుంది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 48.2 ఓవర్లలో 192 ఆలౌట్ (బేట్స్ 36, డెవైన్ 28, సాటర్త్‌వైట్ 31, కెర్ 28, రోవె 25, బిస్త్ 3/32, పూనమ్ 3/42, దీప్తి 2/27), **ఇండియా** : 33 ఓవర్లలో 193/1 (మంధాన 105, రోడ్రిగ్స్ 81 నాటౌట్).

పాండ్యా, రాహుల్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

కివీస్‌కు బయల్దేరనున్న హార్దిక్

న్యూఢిల్లీ: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన టీమిండియా క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, లోకేశ్ రాహుల్‌లకు రిలీఫ్ లభించింది. వారిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు క్రికెట్ పరిపాలకుల కమిటీ (సీఓఏ) గురువారం ప్రకటించింది. వీరిద్దరిపై విచారణ మాత్రం కొనసాగుతుందని తెలిపింది. సుప్రీంకోర్టు నియమించిన కొత్త అమికస్ క్యూరీ (న్యాయ సలహాదారు) పీఎస్ నర్సింహా సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఓఏ చెప్పింది. 'అమికస్ క్యూరీతో సంప్రదించాకే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఆయన సలహా మేరకే ఈ నెల 11న పాండ్యా, రాహుల్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నాం. ఈ ఆదేశాలు తక్షణమే అమలులోకి వస్తాయి' అని సీఓఏ



ఒక ప్రకటనలో తెలిపింది. బీసీసీఐ రాజ్యాంగంలోని 46వ నిబంధన ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొంది. సీఓఏ సభ్యురాలు దయానా ఎడుల్జీ ఈ నిర్ణయంలో బీసీసీఐ ఆఫీస్ బేరర్స్ ప్రమేయం ఉండాలని పట్టుబట్టగా... చీఫ్ వినోద్ రాయ్ మాత్రం అది బోర్డు రాజ్యాంగానికి విరుద్ధమని ఆమె వాదనను కొట్టి పారేశారు. కాగా, టీవీ షోలో పాండ్యా, లోకేశ్ అనుచిత వ్యాఖ్యలపై విచారణలో ఫిబ్రవరి 5న సుప్రీంకోర్టు వాదనలు విననుంది. నిషేధం ఎత్తివేయడంతో పాండ్యాను న్యూజిలాండ్ టూర్‌లో ఉన్న ఇండియా జట్టులో చేర్చినట్టు సెలెక్షన్ కమిటీ ప్రకటించింది. వీలైనంత త్వరగా అతడు కివీస్‌కు వెళ్తాడని చెప్పింది. ఇక, తిరువనంతపురంలో ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగే ఐదు వన్డేల సిరీస్‌లో చివరి మూడు మ్యాచ్‌ల్లో ఇండియా-ఎ జట్టు తరఫున లోకేశ్ రాహుల్ ఆడతాడని తెలిపింది.

శ్రీలంక 144 ఆలౌట్

బ్రిస్బేన్: పేస్ బౌలర్లు కమిన్స్ (4/39), రిచర్డ్సన్ (3/26), స్టార్క్ (2/41)ల దెబ్బకు ఆస్ట్రేలియాతో మొదలైన డే/నైట్ టెస్ట్‌లో మొదటి రోజు శ్రీలంక విలవిల్లాడింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కేవలం 144 రన్స్‌కే ఆలౌట్ అయింది. లంక టాపార్డర్‌లో వికెట్ కీపర్ డిక్‌వెల్లా (64) మాత్రమే హాఫ్ సెంచరీ చేశాడు. ఓపెనర్ కరుణ రత్నె (24) తర్వాతి టాప్ స్కోరర్. జట్టులో ఏడుగురు ప్లేయర్లు సింగిల్ డిజిట్ కూడా దాటలేదు. ఆ తర్వాత బ్యాటింగ్ మొదలుపెట్టిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు నష్టపోయి 72 రన్స్ చేసింది. హ్యారిస్ (40), లైయన్ (0) క్రీజ్‌లో ఉన్నారు.

ఒకవైపు జపాన్ యువకెరటం నవోమి ఒసాక.. మరోవైపు చెక్ రిపబ్లిక్ యోధురాలు క్విటోవా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో చెలరేగి ఆడుతున్నారు..! సెమీస్‌లో ప్లిస్కోవాకు చెక్‌పెట్టి నవోమి, డానియెల్ కొలిన్స్‌ను చిత్తు చేసి క్విటోవా తుదిపోరుకు దూసుకెళ్లారు..! పురుషుల సింగిల్స్‌లో స్పెయిన్ బుల్ నడాల్‌కు ఎదురేలేకుండాపోయింది..! తన చిరకాల ప్రత్యర్థి రోజర్ ఫెడరర్‌ను ఓడించిన సిట్సిపాస్‌ను తిరుగులేని ఆటతో మట్టికరిపించిన రఫా ఫైనల్లో అడుగుపెట్టాడు.!



ఒసాక x క్విటోవా



ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో నవోమి, పెట్రా

- సెమీస్‌లో ప్లిస్కోవా, కొలిన్స్‌పై విజయాలు
- తుదిపోరుకు దూసుకెళ్లిన నడాల్

నేటి సెమీస్
జొకోవిచ్Xపౌలీ
మ. 2.00 నుంచి
సోనీ నెట్‌వర్క్‌లో

మెల్‌బోర్న్: నాలుగున్నర నెలల కిందట అమెరికా లెజెండ్ సెరెనా విలియమ్స్‌ను ఓడించి యూఎస్ ఓపెన్ నెగ్గి అందరినీ ఆశ్చర్యపరిచిన జపాన్ యువ సంచలనం నవోమి ఒసాక వరుసగా రెండో గ్రాండ్‌స్లామ్‌కు అడుగు దూరంలో నిలిచింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన ఆమె అదిరిపోయే ఆటతో ఫైనల్‌కు చేరుకుంది. మరోవైపు చెక్ రిపబ్లిక్ స్టార్ పెట్రా క్విటోవా కూడా సెమీస్‌ను దాటేసి ఒసాకతో అమీతుమీకి సిద్ధమైంది. 21 ఏళ్ల ఒసాక గురువారం జరిగిన సెమీఫైనల్లో 6-2, 4-6, 6-4తో కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)పై విజయం సాధించింది. తన పవర్ గేమ్‌తో చెక్ ప్లేయర్ ఆట కట్టించిన నవోమి 15 ఏస్‌లు సంధించి.. గ్రౌండ్‌స్ట్రోక్ విన్నర్లతో అదరగొట్టింది. చివరి సెట్‌లో నాలుగు బ్రేక్ పాయింట్లు కాపాడుకున్న ఆమె 185 కి.మీ. స్పీడు ఏస్‌తో మ్యాచ్‌ను ముగించింది. క్వార్టర్ ఫైనల్లో అమెరికా గ్రేట్ సెరెనా విలియమ్స్‌ను ఓడించి సంచలనం సృష్టించిన ప్లిస్కోవా ఈ మ్యాచ్‌లో మరోసారి అలాంటి మ్యాజిక్ చేయలేకపోయింది. మూడో గేమ్‌లోనే ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన నవోమి తొలిసెట్‌ను సులువుగా నెగ్గింది. కానీ, ఆ ధాటిని కొనసాగించలేకపోయిన జపాన్ ప్లేయర్ రెండో సెట్‌లో అనవసర తప్పిదాలు చేసింది. వీటిని సద్వినియోగం చేసుకున్న ప్లిస్కోవా ఈ సెట్ గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. అదే విధంగా చివరి సెట్‌లోనూ మెరుగ్గా ఆడుతూ ఒసాకపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేసింది. అయితే, వరుసగా నాలుగు పాయింట్లతో మూడో గేమ్ నెగ్గిన నవోమి.. తర్వాతి గేమ్‌లో చెక్ ప్లేయర్ సర్వీస్ బ్రేక్ చేసి సులభంగా మ్యాచ్ నెగ్గేలా కనిపించింది. 4-5తో ప్లిస్కోవా పోటీలోకి వచ్చినా తన సర్వీస్‌లో మ్యాచ్ పాయింట్ నెగ్గిన ఒసాక ఫైనల్ బెర్త్ దక్కించుకుంది. ఇక, తనను తక్కువగా అంచన వేసినా వారిని ఆశ్చర్యపరుస్తూ క్విటోవా మెల్‌బోర్న్‌లో తొలిసారి ఫైనల్‌కు చేరుకుంది. రెండుసార్లు వింబుల్డన్ చాంపియన్ అయిన ఎనిమిదో సీడ్ క్విటోవా 7-6 (7/2), 6-0తో వరుస సెట్లలో డానియెల్ కొలిన్స్ (అమెరికా)ను చిత్తు చేసింది. తొలి సెట్‌ను టైబ్రేక్‌లో గెలుచుకున్న ఆమె రెండో సెట్‌లో మరింత చెలరేగి ఆడింది. ప్రత్యర్థికి ఒక్క గేమ్ కూడా ఇవ్వకుండా సెట్‌తో పాటు మ్యాచ్‌ను ఖాతాలో వేసుకుంది.

నడాల్ అలవోకగా

ఓపెన్ ఎరాలో అన్ని గ్రాండ్‌స్లామ్స్‌ను రెండేసి సార్లు నెగ్గిన తొలి ప్లేయర్‌గా అరుదైన ఘనత సాధించేందుకు రఫెల్ నడాల్ కేవలం విజయం దూరంలో నిలిచాడు. ఫెడరర్‌ను ఓడించిన రైజింగ్ స్టార్ సిట్సిపాస్‌కు రఫా అసలైన టెన్నిస్ అంటే ఏమిటో చూపించాడు. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ నడాల్ 6-2, 6-4, 6-0తో సిట్సిపాస్‌ను చిత్తుగా ఓడించి మెల్‌బోర్న్‌లో ఐదోసారి ఫైనల్ చేరాడు. తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్ ఆడుతున్న గ్రీక్ ప్లేయర్‌కు రఫా చుక్కలు చూపించాడు. గంటా 46 నిమిషాల పోరులో అతడికి ఏ చిన్న అవకాశం కూడా ఇవ్వలేదు. వరుసగా 63 మ్యాచ్‌ల్లో ఒక్కసారి ఒక్క సెట్ కోల్పోని స్పెయిన్ గ్రేట్.. ఈ టోర్నీలోనూ ఒక్క సెట్ కోల్పోకుండా టైటిల్ ఫైట్‌కు వచ్చాడు. అద్భుతమైన సర్వీస్‌లు, నెట్ గేమ్‌తో పాటు పొరపాట్లకు తావివ్వకుండా ఆడిన నడాల్ ఐదు ఏస్‌లు, 28 విన్నర్లు కొట్టి ఆరు బ్రేక్ పాయింట్లు సాధించాడు. ఐదు ఏస్‌ల, 17 విన్నర్లు కొట్టిన సిట్సిపాస్ ఒక్క బ్రేక్ పాయింట్ కూడా నెగ్గలేకపోయాడు. రెండు డబుల్ పాల్ట్స్, 22 అనవసర తప్పిదాలు చేసి రఫా అనుభవం ముందు తేలిపోయాడు. జొకోవిచ్-పౌలీ మధ్య శుక్రవారం జరిగే మరో సెమీస్‌లో నెగ్గిన వారితో నడాల్ తుదిపోరులో తలపడనున్నాడు.



క్వార్టర్స్ లో సింధు, శ్రీకాంత్



ఇండోనేసియా: ఇండియన్ బ్యాడ్మింటన్ స్టార్లు పీవీ సింధు, శ్రీకాంత్, సైనా ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీలో దూకుడు కొనసాగిస్తున్నారు. వరుస విజయాలతో ఇద్దరూ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. రెండో సీడ్‌గా బరిలో దిగిన సింధు జార్జియా మరిస్క (ఇండోనేసియా)ను 23-21, -21-7 స్కోరుతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. 37 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో సింధుకు తొలి గేమ్‌లో మరిస్క గట్టిపోటీ ఇచ్చింది. అయితే రెండో గేమ్‌లో అద్భుతమైన ఆటతో సింధు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడంతో మరిస్క చేతులెత్తేసింది. ఒలింపిక్ మాజీ చాంపియన్ లి జురుయ్ తొలి రౌండ్‌లోనే ఓడించి మంచి ఫామ్‌లో ఉన్న సింధు క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ స్టార్ కరోలిన్ మరీన్‌తో పోటీపడుతుంది. మరో మ్యాచ్‌లో లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సైనా 21-17 , 21-15 స్కోరుతో ఫిత్రియాని (ఇండోనేసియా)పై గెలుపొంది క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. మెన్స్ సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ శ్రీకాంత్ రెండో రౌండ్ విజయానికి కాస్త శ్రమించాల్సి వచ్చింది. ఆసియన్ గేమ్స్ కాంస్య పతక విజేత నిషిమొటో (జపాన్)ను 21-14, 21-9 స్కోరుతో ఓడించిన శ్రీకాంత్ తదుపరి మ్యాచ్‌ను జొనాథన్ క్రిస్టీతో పోటీపడతాడు.

ఉమేశ్‌కు ఏడు వికెట్లు

కేరళ 106 ఆలౌట్, విదర్భతో రంజీ


వేనాడ్: విదర్భ పేస్ బౌలర్, టీమిండియా ఆటగాడు ఉమేశ్ యాదవ్ కేరళతో మొదలైన రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో తొలి రోజు ప్రతాపం చూపెట్టాడు. ఉమేశ్ 48 రన్స్‌కే ఏడు వికెట్లు పడగొట్టడంతో కేరళ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 106 రన్స్‌కే ఆలౌట్ అయింది. ఉమేశ్‌తో పాటు మరో పేస్ బౌలర్ గుర్బాని మూడు వికెట్లు పడగొట్టడంతో కేరళ జట్టు కేవలం 28.4 ఓవర్లలోనే కుప్పకూలింది. కేరళ జట్టులో విష్ణు వినోద్(37), కెప్టెన్ సచిన్ బేబీ (22)లు టాప్ స్కోరర్లు. ఆ తర్వాత బ్యాటింగ్ మొదలుపెట్టిన విదర్భ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఐదువికెట్లు నష్టపోయి 171 రన్స్ చేసింది. ఫైజ్ ఫజల్ (75), వసీం జాఫర్ (34) ఆకట్టుకున్నారు.

కర్ణాటక 264/9

బెంగళూరులో సౌరాష్ట్రతో మొదలైన మరో సెమీ ఫైనల్లో కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లు కోల్పోయి 264 రన్స్ చేసింది. సౌరాష్ట్ర బౌలర్లు జయ్‌దేవ్ ఉనాద్కట్ (4/50), కమలేశ్ మక్వానా (3/73)లు రాణించి కర్ణాటక దూకుడును అడ్డుకున్నారు. కర్ణాటక ఆటగాళ్లలో కెప్టెన్ మనీశ్ పాండే (62), శ్రేయస్ గోపాల్ (87), శరత్ (74)లు హాఫ్ సెంచరీలతో రాణించారు.

చహల్‌ను మిస్సవుతా: కుల్దీప్

నేపియర్ : యజువేంద్ర చహల్ మ్యాచ్‌లో లేకపోతే తాను ఏదో మిస్సవుతుంటానని టీమిండియా లెగ్ స్పిన్ ద్వయంలో ఒకడైన కుల్దీప్ యాదవ్ అన్నాడు. "మ్యాచ్‌లో నువ్వు లేకపోతే ఏదో లోటు ఉంటుంది. మనమిద్దరం మ్యాచ్‌లో ఉంటే పిచ్ ఎలా ప్రవర్తిస్తుంది, బ్యాట్స్‌మన్ ఎలా ఆడుతున్నాడు వంటి అంశాలపై చర్చించుకుని చకచకా వికెట్లు తీస్తాం. బ్యాట్స్‌మన్ ను తికమక పెట్టే కొన్ని వేరియేషన్స్ మనం ఒకేలా చూపిస్తాం" అని అతను చెప్పుకొచ్చాడు.



రిటైర్ అవ్వను: పేస్

మెల్‌బోర్న్ : టెన్నిస్‌పై ఉన్న ఇష్టం వల్లే రాకెట్‌ను వదల్లేకపోతున్నానని, ఇప్పట్లో కోర్ట్‌ను వదిలే ఆలోచనే తనకు లేదని ఇండియన్ వెటరన్ లియాండర్ పేస్ పేర్కొన్నాడు. ఇప్పటికీ కొత్తగా ఏదో ఒకటి నేర్చుకోవాలనే తపన తనలో ఉందని, కోర్ట్‌లో సమయం గడపడానికే ఎక్కువ ఇష్టపడతానని 45 ఏళ్ల పేస్ పేర్కొన్నాడు. నేటి తరం పిల్లల నుంచి కొత్త షాట్లు, టెక్నిక్, డైట్ విధానాలు నేర్చుకుంటానన్నాడు.

ఫిబ్రవరి 1న 'వెలుగు' క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

రేపటి నుంచి సెలెక్షన్స్

వెలుగు, హైదరాబాద్: తెలంగాణ యువ క్రికెటర్లకు శుభవార్త. పల్లె నుంచి పట్టణాల వరకూ రాష్ట్రంలోని ఔత్సాహిక క్రీడాకారుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపేందుకు 'వెలుగు' దినపత్రిక ముందుకొచ్చింది. క్రికెట్‌పై ఆసక్తి ఉన్న కుర్రాళ్లను ప్రోత్సహించేందుకు.. వారి జీవితాలను మలుపు తిప్పేందుకు స్టేట్ లెవెల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు రెడీ అయింది. జిల్లా నుంచి రాష్ట్రస్థాయి వరకు ఆసక్తి గల యువకులు తమ ప్రతిభను చాటుకునేందుకు చక్కటి అవకాశం కల్పిస్తోంది. హైదరాబాద్, రంగారెడ్డి మినహా ఎనిమిది ఉమ్మడి జిల్లాల్లో ప్రతి నియోజకవర్గం నుంచి ఒక్కో టీమ్ చొప్పున మొత్తం 90 టీమ్స్ బరిలో నిలిచే ఈ మెగా టోర్నీ ఫిబ్రవరి ఒకటో తేదీన షురూ అవుతుంది. నియోజకవర్గాల వారీగా టీమ్ సభ్యులను ఎంపిక చేసేందుకు శుక్రవారం నుంచి సెలెక్షన్స్ జరుగుతాయి. ఆయా జిల్లాలో ఎంపిక చేసిన మైదానాల్లో ఉదయం పది గంటలకు సెలెక్షన్స్ ప్రారంభమవుతాయి. 28 ఏళ్లలోపు వయసున్న క్రికెటర్లందరూ ఇందులో పాల్గొనేందుకు అర్హులు. సెలెక్షన్లకు వచ్చే వారందరూ కచ్చితంగా తమ ఆధార్ కార్డును వెంట తెచ్చుకోవాలి. టీం సెలెక్షన్లు పూర్తయిన తర్వాత మొదట ఉమ్మడి జిల్లాల జట్ల మధ్య పోటీలు నిర్వహిస్తారు. ఎనిమిది ఉమ్మడి జిల్లాల్లో విజేతలుగా నిలిచిన జట్లు ఫిబ్రవరి 23 నుంచి జరిగే క్వార్టర్‌ఫైనల్స్ (స్టేట్ లెవెల్)కు అర్హత సాధిస్తాయి. అలాగే, ఉమ్మడి జిల్లాలో గెలిచిన జట్టుకు రూ. 50 వేలు, రన్నరప్ జట్టుకు రూ.25 వేలు ఇస్తారు. రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచిన జట్టు లక్ష రూపాయాల ప్రైజ్‌మనీ అందుకుంటుంది. రన్నరప్ టీమ్‌కు రూ.50 వేలు నగదు అందిస్తారు. సెలెక్షన్స్, మ్యాచ్‌ల తేదీల వివరాలను వెలుగు పేపర్, వీ6 ఛానల్ ద్వారా తెలుసుకోవచ్చు.

- యువ క్రికెటర్లకు గొప్ప అవకాశం
- 28 ఏళ్లలోపు వారంతా అర్హులే



సెలెక్షన్స్ జరిగే వేదికలు	ఎంపిక చేసే జట్లు
ఉమ్మడి వరంగల్	
జనవరి 26- వరంగల్ సీకేఎం కాలేజ్ గ్రౌండ్	వరంగల్ ఈస్ట్, వర్ధన్నపేట, నర్సంపేట
జనవరి 27- మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియం,	మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి
జనవరి 28- భూపాలపల్లి అంబేద్కర్ సింగరేణి స్టేడియం	పరకాల, భూపాలపల్లి, ములుగు
జనవరి 30- హన్మకొండ జేఎన్ ఎస్ గ్రౌండ్	వరంగల్ వెస్ట్, స్టేషన్ ఘనపూర్, జనగాం
నిజామాబాద్	
జనవరి 27- కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియం	కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి
జనవరి 27- ఆర్మూర్ సెయింట్ పాల్స్ హైస్కూల్	ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్
జనవరి 28- నిజామాబాద్ ఎంఎస్ఆర్ స్కూల్ గ్రౌండ్	నిజామాబాద్ అర్బన్, జుక్కల్, బోధన్
మెదక్	
జనవరి 27- సిద్దిపేట టిహెచ్ ఆర్ మినీ స్టేడియం	సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక
జనవరి 29- సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియం	సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్
జనవరి 31- మెదక్ ఇందిరాగాంధీ స్టేడియం	మెదక్, నర్సాపూర్
ఫిబ్రవరి 2- జోగిపేట బ్రిలియంట్ హై స్కూల్ గ్రౌండ్	నారాయణఖేడ్ , అందోల్
నల్గొండ	
జనవరి 29- దేవరకొండ హెచ్ఆర్‌డీ హైస్కూల్	దేవరకొండ, నాగార్జునసాగర్
జనవరి 31- భువనగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీ	భువనగిరి, ఆలేరు, మునుగోడు
ఫిబ్రవరి 01- నల్గొండ మేకల అభినవ్ స్టేడియం	నల్గొండ, నకిరేకల్, మిర్యాలగూడ
ఫిబ్రవరి 02- సూర్యాపేట ఎస్వీ డిగ్రీ కాలేజీ	సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్
ఖమ్మం	
ఫిబ్రవరి 5 - ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్స్	ఖమ్మం, పాలేరు, వైరా, మధిర
ఫిబ్రవరి-6- కొత్తగూడెం ప్రకాశం స్టేడియం	కొత్తగూడెం, ఇల్లందు, సత్తుపల్లి
ఫిబ్రవరి -7- భద్రాచలం గవర్నమెంట్ కాలేజీ గ్రౌండ్	భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

(ఉమ్మడి మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల సెలెక్షన్స్ వివరాలను తదుపరి వెల్లడిస్తారు)



ఐ వాంట్ బ్యాడ్ బాయ్స్

- ఏరికోరి క్రిమినల్స్, గ్యాంగ్‌స్టర్లను పెళ్లాడిన లేడీ డాన్ సోనూ
- నలుగురు భర్తలూ పోలీసుల చేతిలో హతం

న్యూఢిల్లీ:

సోనూ పంజాబన్ అలియాస్ గీతా అరోరా.. ఢిల్లీలో సెక్స్ రాకెట్ నడిపే లేడీ డాన్.. ప్రేమించి ఓ గ్యాంగ్‌స్టర్‌ను పెళ్లి చేసుకుంది.. కానీ అతను ఎన్‌కౌంటరయ్యాడు.. తర్వాత మరో బాయ్‌ఫ్రెండ్.. అతడూ పోలీసుల కాల్పుల్లో హతమయ్యాడు.. ఇలా తన జీవితంలోకి వచ్చిన వారందరూ ఎన్‌కౌంటరయ్యారు. పెళ్లి చేసుకున్న నలుగురు భర్తలూ చనిపోయారు.

సోనూ పంజాబన్ ఢిల్లీలో ఏళ్లుగా చీకటి రాజ్యాన్ని ఏలుతోంది. వ్యభిచారం నిర్వహణ కేసులో అరెస్టయి విడుదలైనా మళ్లీ అదే పని చేస్తూ పోలీసులకు చిక్కుతోంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగు సార్లు అరెస్టయింది. ప్రస్తుతం అదే కేసులో మళ్లీ జైలుకెళ్లి పెరోల్‌పై బయటకొచ్చింది. సినిమా, మోడలింగ్ రంగంలోకి రావాలని ఆశపడే యువతులను వలవేసి పంజాబన్ వ్యభిచార కూపంలోకి దింపుతుందన్న ఆరోపణలున్నాయి. హై ప్రొఫైల్ వ్యాపారవేత్తలు సహా అనేక మంది ప్రముఖులు తన క్లైంట్లు. తన అనుచరులతో కలసి కోల్‌కతా, ముంబై, రాజస్థాన్, పంజాబ్‌లలో సెక్స్ రాకెట్ నిర్వహిస్తోంది. మైనర్లపై లైంగిక దాడుల నిరోధక చట్టం, వ్యవస్థీకృత నేరాల నిరోధక చట్టంతోపాటు హత్యల వంటి ఇతర నేరాల్లో ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానాల్లో పంజాబన్ నిందితురాలు.

అందరూ గ్యాంగ్‌స్టర్లే

ఆమెకు 'బాడ్ బాయ్స్' అంటే ఇష్టమని, కానీ తన జీవితంలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ చనిపోయారని పోలీసులు చెప్పారు. మొదట గ్యాంగ్‌స్టర్ హేమను సోనూను పంజాబన్ పెళ్లి చేసుకుంది. పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హేమను మృతి చెందాక తన పేరులో సోనూ చేర్చుకుంది. ఆ తర్వాత మరో గ్యాంగ్‌స్టర్ విజయ్ సింగ్ (గ్యాంగ్‌స్టర్ శ్రీ ప్రకాశ్ శుక్లాకు దగ్గరివాడు)తో ప్రేమలో పడింది. వీరిద్దరూ పెళ్లి చేసుకున్న కొద్ది రోజులకే 2003లో గర్హ్ ముక్తేశ్వర్ ప్రాంతంలో సింగ్‌ను ఉత్తరప్రదేశ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. తర్వాత మరో బాయ్‌ఫ్రెండ్ దీపక్ కూడా అస్సాంలో పోలీసుల చేతిలో హతమయ్యాడు. ఆ తర్వాత దీపక్ తమ్ముడు హేమంత్ సోనూ పంజాబన్‌కు ఆసరాగా నిలిచాడు. కొద్ది రోజులకు వాళ్లిద్దరూ పెళ్లి చేసుకున్నారు. కానీ ఓ హై ప్రొఫైల్ జంట హత్యల కేసులో హస్తమున్న హేమంత్‌ను 2006లో ఢిల్లీ-గురుగ్రామ్‌లో స్పెషల్ సెల్ పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. కాగా, బుధవారం తన బంధువులను కలిసి వస్తుండగా ముగ్గురు దుండగులు తనపై దాడి చేశారని గీతా కాలనీలో సోనూ పోలీసులకు సోనూ ఫిర్యాదు చేసింది.

అరెస్టయినా వదల్లే

ఇమ్మోరల్ ట్రాఫికింగ్ ప్రివెన్షన్ యాక్ట్ కింద 2007లో ప్రీత్ విహార్‌లో పోలీసులు పంజాబన్‌ను అరెస్టు చేశారు. తర్వాత బెయిల్‌పై బయటికొచ్చినా మళ్లీ 2008లో అదే నేరం చేస్తూ అరెస్టయింది. మూడేళ్ల తర్వాత 2011లోనూ వ్యభిచారం కేసులోనే పోలీసులకు చిక్కింది. 2017లో ఓ 16 ఏళ్ల అమ్మాయిని వ్యభిచార కూపంలోకి దింపాలని ప్రయత్నించిన కేసులో పోక్సో చట్టం కింద అరెస్టయింది.

మీ టీవీ బిల్లెంతో తెల్సుకోండి

జనవరి 31 నుంచి కేబుల్ నిబంధనలు మారుతున్నాయి కదా. మనకు కావాల్సిన చానెళ్లనే చూసేందుకు ట్రాయ్ కొత్త రూల్స్ తెచ్చింది కదా. మరి, ఏమేం చానెళ్లు చూడాలనుకుంటున్నారు? ఆ చానెళ్ల ప్యాకేజీకి ఎంతవుతుందో తెలుసా? అందుకే టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఓ వెబ్ అప్లికేషన్‌ను తయారు చేసింది. ఆ సైట్‌లోకి వెళితే మీకు కావాల్సిన చానెళ్ల ప్యాకేజీకి ఎంతవుతుందో తెలుసుకోవచ్చు. channel.trai.gov.in అనే వెబ్‌సైట్‌లోకి వెళితే కింద గెట్ స్టార్టెడ్ అని వస్తుంది. దానిపై క్లిక్ చేస్తే మరికొన్ని వివరాలు అడుగుతుంది. మొదటి స్టెప్‌లో మీ పేరు అడుగుతుంది. రెండో స్టెప్‌లో రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవాలి. మూడో స్టెప్‌లో చానెల్ భాషను ఎంచుకోవాలి. నాలుగో స్టెప్‌లో కావాల్సిన చానెళ్ల టైపును



ఎంచుకోవచ్చు (మీకు నచ్చిన జోనర్). ఐదో స్టెప్‌లో హెచ్‌డీ లేదా ఎస్డీ (లేదా రెండింటిని ఎంచుకోవచ్చు) ఎంపిక చేసుకుంటే అసలు పేజీలోకి తీసుకెళుతుంది. అక్కడ 25 కంపల్సరీ ఫ్రీ చానెళ్లు కార్ట్‌లో యాడ్ అయి ఉంటాయి. వాటితో పాటు కావాల్సిన పే చానెళ్లను ఎంచుకుని వాటికి ఎంతవుతుందో తెలుసుకోవచ్చు. పే చానెళ్లు కాకుండా మరో 75 ఫ్రీ చానెళ్లనూ కార్ట్‌కు యాడ్ చేసుకోవచ్చు.



కన్నీటి సంద్రం

మనిషి అత్యాశకు బలవుతున్న సముద్ర జీవులు

సముద్రాలు... ఆయిల్, మినరల్స్, మెడిసిన్, ఫుడ్ మరెన్నిటికో కేరాఫ్! అంతేకాదు ఎన్నో జీవులకు ఆలవాలం. ఇప్పడా జీవులన్నీ మనిషి అత్యాశకు బలవుతున్నాయి. ఆయిల్, నేచురల్ గ్యాస్ కోసం మనిషి సాగిస్తున్న వేటలో ప్రాణాలు విడుస్తున్నాయి. ఆయిల్, నేచురల్ గ్యాస్ నిక్షేపాలను గుర్తించే సీస్మిక్ షాట్ టెక్నిక్ వాటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తోంది.

భారీ నౌకలు సముద్రాల్లో నత్తనడకన కదులుతూ, ఈ షాట్స్‌ను ఎయిర్ గన్స్ సాయంతో వేడి గాలిని అతివేగంతో సముద్రగర్భాల్లోకి పంపుతాయి. అలా కొన్ని మైళ్ల పాటు లోపలికి వెళ్లిన తరంగాలు నేలను తాకి తిరిగి వెనక్కువస్తాయి. వీటిని సముద్ర ఉపరితలంపై ఉండే హైడ్రోఫోన్స్ ఇట్టే పట్టేస్తాయి. ఆ తర్వాత తరంగాలను బట్టి త్రీడీ మ్యాపింగ్ చేసి ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను తవ్వి

- ఆయిల్ వేట కోసం ఎయిర్ గన్స్
- రాకెట్, జెట్ విమానాల కన్నా ఎక్కువ శబ్దం
- కర్ణభేరి పగిలి చచ్చిపోతున్న జీవాలు

తీసేందుకు ప్రపంచదేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఎయిర్ గన్స్ వల్ల సముద్ర జీవులకు భారీగా నష్టం కలుగుతోంది. ఇవి భారీ శబ్దం చేస్తూ గాలిని నీళ్లలోకి వదులుతాయి. ఈ ధాటికి ప్రశాంతంగా బతికే వేల్స్, డాల్ఫిన్స్, చేపలు, స్క్విడ్, ఆక్టోపస్, ప్లాంక్టన్ తదితర జీవులు చనిపోతున్నాయి. కొన్ని జీవుల మెదళ్లలో రక్తం గడ్డకడుతోంది, మరికొన్ని వినికిడి లోపానికి గురవుతున్నాయి. తీసుకునే తిండి, పునరుత్పత్తిపై ఆ శబ్దాల ప్రభావం ఉంటుందని పర్యావరణ హిత సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ఇంత ప్రమాదం ఉందని తెలిసినా శబ్ద తీవ్రతను మరింత పెంచేలా అమెరికా నిర్ణయించింది. అట్లాంటిక్ మహాసముద్రంలో ఆయిల్, సహజ వాయువు అన్వేషణ కోసం మరింత వేగంగా గాలిని సముద్ర అంతర్భాగంలోకి వదలాలని ఆదేశించింది. ఈ మేరకు ఐదు అంతర్జాతీయ కంపెనీలకు అనుమతులు ఇచ్చింది. పర్యావరణ వేత్తలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఆర్డర్లపై కోర్టుకు వెళ్తామని పేర్కొంటున్నారు.

ఇప్పటికే ఈ శబ్దాల కారణంగా సముద్రాల్లోని కొన్ని అరుదైన జీవజాతుల సంఖ్య తగ్గిపోయిందని నిపుణులు చెబుతున్నారు. 2017లో చేసిన ఓ సర్వేలో ఎయిర్ గన్స్ కంటే తక్కువ శబ్దంతో సముద్ర నీళ్లలోకి గాలిని పంప్ చేస్తే, ఒక మైలు పరిధిలో ఉన్న 'జూ ప్లాంక్టన్'లలో మూడో వంతు మరణించాయట. చూడటానికి అతి చిన్నగా కనిపించే జూ ప్లాంక్టన్స్ సముద్రాల్లోని గొప్ప ప్రాణులు గ్రేట్ వేల్స్ నుంచి అతి చిన్న జీవులు రొయ్యల వరకూ ఇష్టమైన ఆహారం. ఎయిర్‌గన్స్ వాడకం వల్ల ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో జీవి అనేది కనపడకుండా పోతోందని సర్వేలో తేలిందని నేచురల్ రిసోర్సెస్ డిఫెన్స్ కౌన్సిల్ (ఎన్ఆర్డీసీ) డైరెక్టర్ మైకేల్ జాస్నీ పేర్కొన్నారు.

ఒక్క షాట్.. 260 డెసిబుల్స్

ఎయిర్‌గన్స్ నుంచి విడుదలయ్యే శబ్ద పరిమాణం ఎంతో తెలుసా? దాదాపు 260 డెసిబుల్స్. ఇది రాకెట్లు, జెట్ విమానాలు విడుదల చేసే భారీ శబ్దాల కన్నా చాలా ఎక్కువ. మామూలు ట్రాఫిక్ శబ్దాలనే (80 నుంచి 85 డెసిబెల్స్) వినలేక



మనం అల్లాడిపోతుంటాం. అలాంటిది ఇంతకు మూడు రెట్ల ఎక్కువ శబ్దం, సున్నిత ప్రాణులను తాకితే పరిస్థితి ఏంటి? చాలా ప్రాణులు ఈ శబ్దాలకు కర్ణభేరి పగిలి చనిపోతున్నాయి. మామూలు నౌకల వల్ల దాదాపు 190 డెసిబెల్స్ శబ్దం విడుదలవుతుంది. గాలిలో కన్నా శబ్ద వేగం నీళ్లలో నాలుగు రెట్లు ఎక్కువ. ఇది సముద్ర జీవులను మరింతగా ప్రభావితం చేస్తోంది. దాదాపు 20 వేలకు పైచిలుకు చేప జాతులు వినగలవు. మరో 800 జాతులు సొంతంగా శబ్దాలు చేసి, ఇతర జీవుల్ని సంతానోత్పత్తి కోసం ఆకర్షిస్తాయి. గూళ్లను కాపాడుకోవడం కోసం కూడా అరుస్తాయి. ఒక ఏడాదిలో ఏ టైంలో చూసినా, సముద్రాలపై కనీసం 20 నుంచి 40 సీస్మిక్ సర్వేలు జరుగుతున్నాయని జియోలాజికల్ రీసెర్చ్ అనే సంస్థ వెల్లడించింది. అమెరికా కొత్త నిర్ణయాల ప్రకారం తొలి ఏడాదిలో తూర్పు తీరంలో దాదాపు 50 లక్షలకు పైగా సీస్మిక్ షాట్స్‌ను ప్రయోగిస్తారని తెలిపింది. పర్యావరణ నిపుణుల వాదన హేతుబద్ధమైనది కాదని సర్వేలు చేస్తున్న కంపెనీలు వాదిస్తున్నాయి. ముందు జాగ్రత్తల ద్వారా మెరైన్ లైఫ్‌కు ఎలాంటి ప్రమాదం లేకుండా చూడొచ్చని నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఏఏ) ఫిషరీస్ విభాగం పేర్కొంది. సముద్ర అంతర్భాగంలో శబ్దాలు చేయడంపై ఎలాంటి నిబంధనలు లేవు. ఐక్యరాజ్యసమితి ఇటీవల దీనిపై ఓ సమావేశం నిర్వహించింది. 2030 కల్లా సముద్రాల్లో శబ్దాల అలజడి డబుల్ అవుతుందని ఓ పరిశోధనలో తేలింది.

సూదులు, టాబ్లెట్లు వేస్ట్.. ఎవరో వాడిన టిష్యూసే బెస్ట్!

రోగ నిరోధకతను పెంచుతాయంటూ అమెరికా కంపెనీ వ్యాపారం

ఎవరో ఒకాయన టిష్యూతో ముక్కు చీదిపడేశాడు. ఇంకొకాయన మూతి తుడుచుకుని విసిరేశాడు. మరొకాయన సుబ్బరంగా చెయ్యి తుడుసుకుని చెత్త బుట్టలో వేశాడు. అలా ఎవరో ముక్కూమొహం తెలియని మనిషి వాడి పడేసిన టిష్యూలను మళ్లీ వాడండి అంటే.. వాడతరా? 'చీ.. యాక్' అంటారు కదా! కానీ, ఓ కంపెనీ అలా వాడి పడేసిన టిష్యూలనే మళ్లీ ప్యాక్ చేసి అమ్ముతోంది తెలుసా? నమ్మరా.. నమ్మి తీరాల్సిందే. లాస్‌ఏంజిలిస్‌కు చెందిన వాయివ్ (vaev) అనే కంపెనీ పడేసిన టిష్యూలను ఏరుకొచ్చి.. రసాయనాలతో కొద్దిగా శుద్ధి చేసి నీట్‌గా ప్యాక్ చేసి మార్కెట్లోకి వదులుతోంది. ఇదేం పైత్యం అని అనుకుంటారేమో.. కంపెనీ దానికో కారణమూ చెబుతోంది. వర్షాకాలం, చలికాలం వచ్చిందంటే.. ఇప్పుడన్నీ మహమ్మారి ఫ్లూలు అదే స్వైన్ ఫ్లూ వంటివి అటాక్ చేస్తున్నాయి కదా. అందుకే ఫ్లూ వచ్చినప్పుడు వేలకు వేలు మందులకు పోసే బదులు.. ఇలా ఎవరో వాడిన టిష్యూలను వాడితే రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంటోంది. కంపెనీ మాటల్లో చెప్పాలంటే.. "ఫ్లూ కాలమొస్తే రోగాల బారిన పడుతుంటారు కదా. ఎవరో చీమిడి చీదిన టిష్యూ వాడితేనే బాగుంటుందని



మేం నమ్ముతున్నాం. ఫ్లూ వచ్చాక వేసుకునే ఇంజెక్షన్లు, గోలీల కన్నా ఎవరో చీమిడి తుడిచిన టిష్యూనే భద్రం అని మా భావన'' అని కంపెనీ తన వెబ్‌సైట్లో రాసుకొచ్చింది. ఇది రోగనిరోధక వ్యవస్థను పటిష్ఠం చేస్తుందని అంటోంది. ఇంతకీ దాని ధరెంతో తెలుసా.. రూ.5,700. డాలర్లలో చెప్పాలంటే 79.99 డాలర్లు. మరి, ట్విట్టర్‌లో మాటలతో కూత పెట్టేటోళ్లు ఊరుకుంటరా చెప్పండి. కంపెనీని కొందరు ఎడాపెడా వాయించేస్తే.. మరి కొందరు మాత్రం ఫన్నీ కామెంట్లు చేశారు. సైంటిస్టులు ఆ కంపెనీ మాటలను కొట్టిపారేస్తున్నారు. అది వర్కవుట్ కాదని యూనివర్సిటీ ఆఫ్ అరిజోనా సైంటిస్ట్ చార్లీ గెర్బా అన్నారు. అన్నివైరస్‌లు ఒకేలా పనిచేయవన్నారు. అందుకే మామూలు సర్దికి ఇప్పటిదాకా వ్యాక్సిన్ లేదని చెప్పారు.



కాపీ కోతులు

జీన్ ఎడిటింగ్ చేసి ఐదింటిని సృష్టించిన చైనా

బీజింగ్:

ప్రపంచంలో తొలి జీన్ ఎడిటింగ్ (జన్యు సవరణ) కవలలు చైనాలో జన్మించినట్లు గతేడాది ఆ దేశ సైంటిస్టు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. దీంతో ప్రపంచవ్యాప్తంగా దీనిపై ఆందోళన వ్యక్తమైంది. ఇదిలా ఉండగానే మరో కొత్త వివాదానికి చైనా వేదికైంది. జీన్ ఎడిటింగ్ (జన్యు సవరణ) చేసి 5 కోతులను సృష్టించినట్లు డ్రాగన్ కంట్రీ వెల్లడించింది. షాంగైలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోసైన్స్ ఆఫ్ చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఇందుకు వేదికైంది. ఇంక్యుబేటర్‌లో ఉన్న ఆ కోతుల ఫొటోలను అధికారికంగా విడుదల చేశారు. అల్జీమర్స్ లాంటి వ్యాధులకు కారణమయ్యే జన్యువులను జొప్పించి ఈ ప్రయోగం చేశామని ఆ దేశ సైంటిస్టులు చెప్పారు. సిర్కాడియన్ రిథమ్ డిజార్డర్స్‌తో బాధపడుతున్న వానరం జన్యువులను సవరించి కోతులను క్లోన్ చేశామన్నారు. ఇలా ఒకేసారి ఎక్కువ క్లోన్ జంతువులను సృష్టించడం ఇదే తొలిసారని చెప్పారు. గతేడాది జోంగ్ జోంగ్, హువా హువా కోతులకు సృష్టించడానికి వాడిన జీన్ ఎడిటింగ్ పద్ధతినే ఇక్కడ కూడా వాడామన్నారు. నిద్రలేమి, ఒత్తిడి, అల్జీమర్స్ లాంటి వ్యాధులకు సిర్కాడియన్ రిథమ్ డిజార్డర్ కారణం. క్లోన్ చేసిన కోతుల శరీరానికి మనుషుల శరీరానికి దగ్గరి పోలికలున్నాయి. మనుషుల్లానే ఆందోళన, నిరాశ లాంటివి వ్యక్తపరుస్తాయి. ఈ కోతులతో బ్రెయిన్ డిజార్డర్ల నుంచి కేన్సర్ వరకు వ్యాధులపై పరిశోధనలు చేయొచ్చని, చికిత్స చేసేందుకు అవకాశం ఉంటుందని కొందరు సైంటిస్టులు అంటున్నారు.



పాము వయసు 10 కోట్ల ఏళ్లు

డైనోసార్లతో కలిసి బతికాయట

చరిత్రలో కలిసిపోయిన జీవులెన్నో! వాటిలో కొన్ని మన ఆర్కియాలజిస్టుల పనితనంతో అప్పుడప్పుడు బయటపడుతున్నాయి. తాజాగా దాదాపు 10 కోట్ల ఏళ్ల క్రితం భూమిలో కలిసిపోయిన పాము పిల్ల శిలాజం సైంటిస్టులకు దొరికింది. చెట్టులో ఇరుక్కుని అది మరణించినట్లు చెబుతున్నారు. అంతర్జాతీయ ఆర్కియాలజిస్టుల బృందం కొన్నేళ్లుగా మయన్మార్‌లో తవ్వకాలు జరుపుతోంది. దాదాపు 8 సెంటీమీటర్ల పొడవున్న పాము పిల్ల చెట్టులో ఉన్నప్పుడు భూకంపం లాంటి విపత్తు సంభవించి, అది భూమిలో కలిసిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. చనిపోయిన పాము పిల్ల 'క్సియావోఫిస్ మయన్మారీస్' అనే జాతికి చెందినదిగా పేర్కొన్నారు. భూమిపై పాముల పుట్టుక గురించి తెలుసుకునేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.

■ చికెన్‌ను మాంచిగా నూనెలో ఫ్రై చేసుకుని తింటున్నారా? చేపలు ఫ్రెష్‌గా ఉన్నాయని పెనంపై వేయించుకు తింటున్నారా? అయితే, డేంజర్‌లో పడ్డట్టే! చికెన్ ఫ్రై, ఫిష్ ఫ్రైతో 50 ఏళ్ల పైబడిన మహిళల్లో చావు ముప్పు ఎక్కువని అమెరికా సైంటిస్టుల అధ్యయనంలో తేలింది. 1993–98 మధ్యకాలంలో వుమెన్స్ హెల్త్ ఇనిషియేటివ్‌లో నమోదు చేసుకున్న 50 నుంచి 79 ఏళ్ల మధ్య వయసున్న 1.07 లక్షల మంది మహిళల ఆరోగ్యం, ఆహారపుటలవాట్లను అంచనా వేసి ఈ నిర్ధారణకు వచ్చారు. 2017 నాటికి వారిలో 31,588 మంది చనిపోయినట్టు చెప్పారు. అందులో 9,320 మంది గుండె జబ్బులు, 8,358 మంది కేన్సర్, 13,880 మంది ఇతర జబ్బులతో చనిపోయినట్టు చెప్పారు. చనిపోయినవాళ్లు ఎక్కువగా ఫ్రై ఫుడ్డు తిన్నారని చెప్పారు.

టుటెంకమిన్‌ను దులిపేశారు

పదేళ్ల పాటు క్లీనింగ్.. టూరిస్టుల అందుబాటులోకి వచ్చిన సమాధి

టుటెంకమిన్ టూంబ్.. ప్రపంచంలో చూడాల్సిన ప్రదేశాల్లో ముందు వరుసలో ఉంటుంది. తొలిసారిగా 1922లో హొవార్డ్ కార్టర్ అనే ఆర్కియాలజిస్ట్ దానిని అందరికీ పరిచయం చేశాడు. అయితే, మనుషుల తాకిడికి దుమ్ముధూళి చేరి దీనావస్థకు చేరిన ఆ టూంబ్‌కు పదేళ్ల పాటు మరమ్మతులు చేసింది జెట్టీ కన్జర్వేషన్ ఇనిస్టిట్యూట్. గోడలు, పైకప్పుకు పట్టిన మట్టిని, బూజును ఆర్కియాలజిస్టులు తీసేశారు. దాదాపు పూర్తిస్థాయిలో సందర్శకులకు అందుబాటులోకి వచ్చింది. రిపేర్లు చేస్తున్నప్పుడు, రిపేర్లయ్యాక తీసిన ఫొటోలను సంస్థ తొలిసారి విడుదల చేసింది. సమాధి పెయింటింగ్ గోడలను దాదాపు శుభ్రం చేసినా, కొన్ని నల్ల మచ్చలను మాత్రం తీసేయలేదు. ఆ మచ్చలు సూక్ష్మజీవుల వల్ల ఏర్పడి ఉంటాయని భావిస్తున్నారు. అవన్నీ గోడల్లో ఇంకిపోయినట్టున్నాయని, వాటిని పూర్తిగా తీసేస్తే పెయింటింగ్స్ పాడయ్యే అవకాశం ఉంటుందని ఆర్కియాలజిస్టులు చెబుతున్నారు. ఆ మచ్చలన్నీ కూడా సమాధిని కార్టర్ కనిపెట్టినప్పుడే ఉన్నాయని,



కొత్తగా మాత్రం ఏ మచ్చలు రాలేదని చెప్పారు. ఇప్పుడున్న మచ్చలతో గోడల పెయింటింగ్స్‌కు ఎలాంటి ప్రమాదం లేదన్నారు.

టూరిస్టుల తాకిడే పెద్ద భయం

టూంబ్‌ను కనిపెట్టిన తొలినాళ్లలోనూ దాన్ని క్లీన్ చేయడానికి పదేళ్లు పట్టింది. మళ్లీ ఇప్పుడూ దాని పునరుద్ధరణకు అంతే టైం పట్టింది. అయితే, ఈ టూంబ్‌ను చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచీ భారీ సంఖ్యలో టూరిస్టులు తరలి వస్తుంటారు. వాళ్ల వల్లే ఆ సమాధికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని ఆర్కియాలజిస్టులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువ మంది వచ్చినప్పుడు భారీగా తేమ, కార్బన్ డై ఆక్సైడ్ వాయువులు గాల్లో కలుస్తాయని, పెయింటింగ్స్ పాడయ్యే ముప్పు ఉందంటున్నారు. టూరిస్టులకు అనుమతి ఉన్న ప్రదేశాల్లో గోడలు నెర్రెలొచ్చే అవకాశం ఉందన్నారు. వాళ్ల బట్టలు, చెప్పులతో వచ్చే మట్టి గోడలపై పేరుకుపోతుందంటున్నారు. సినిమా వాళ్లయితే ఆ ప్రభావం మరింత ఎక్కువుంటుందంటున్నారు. వాళ్ల పరికరాల వల్ల గోడలు దెబ్బతినే ముప్పు ఉందంటున్నారు. అవి పాడైపోతే వచ్చే వేల మంది టూరిస్టులు నిరాశ చెందే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. టుటెంకమిన్ సమాధి సహా ఇప్పుడు ఒరిజినల్ వస్తువులన్నీ యథాతథంగా ఉన్నాయి. గోడలపైన పెయింటింగ్స్ టుటెంకమిన్ జీవితాన్ని వివరిస్తాయి. ఇలాంటి పురాతన ప్రదేశాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఈజిప్ట్ మాజీ మంత్రి, జీసీఐ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన జాహీ హవాస్ అన్నారు. దానిని శుభ్రం చేసేందుకు రాటుదాలిన ఆర్కియాలజిస్టులు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్లు, మైక్రోబయాలజిస్టులు, ఆర్కిటెక్టులు ఎంతో మంది పనిచేశారు.



ఎవరా టుటెంకమిన్.. ఏమా కథ?

క్రీస్తు పూర్వం 1332 నుంచి క్రీస్తు పూర్వం 1323 మధ్య కాలంలో ఈజిప్టును పరిపాలించిన రాజే టుటెంకమిన్. పదేళ్ల వయసులోనే రాజ్యాన్ని చేపట్టాడు. తన సవతి తల్లి కూతురు (చెల్లెలు/కజిన్) యాంఖెసెన్‌పాటిన్‌ను పెళ్లి చేసుకున్నాడు. 18 ఏళ్లప్పుడు చనిపోయాడు. ఆ చావుకు కారణమేంటన్నది తెలియదు. ఆ రాజు పాలించిన ప్రాంతంలో తవ్వకాలు చేపట్టాలని ఇంగ్లిష్ ఆర్కియాలజిస్ట్, ఈజిప్టాలజిస్ట్ హొవార్డ్ కార్టర్‌ను 1907లో బ్రిటన్ లార్డ్ కార్నర్వన్ జార్జ్ హెర్బర్ట్ ఆదేశించారు. ఆ తవ్వకాల్లో భాగంగా 1922 నవంబర్ 4న టుటెంకమిన్ టూంబ్‌ను కనిపెట్టారు. 2007లో జాహీ హవాస్ ఆధ్వర్యంలో టుటెంకమిన్ సమాధిని తెరిచారు.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.